తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
RNI NO.TELTEL / 2013 /50370
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 10.09.2026 | సంపుటి : 13 సంచిక : 52 | పేజీలు : 12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

ఎర్రవల్లిలో..


# దళితులు డప్పుకొడితే శుద్ధిచేస్తారా

"కసబ్ వంటి ఉగ్రవాదులకు, స్పీకర్‌ను తిట్టిన వారికి తేడా లేదు. స్పీకర్‌కు క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయి. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ దళితులు డప్పులతో నిరసన తెలిపారు. ఎక్కడ కుట్ర జరిగిందో.. అక్కడ డప్పు మోగించి వాళ్లు నిరసన చేపట్టారు. ఫాంహౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప.. ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదు. దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని మాత్రమే వారు కోరారు. కేసీఆర్ క్షమాపణ చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారు. సంధ్యారావు అనే నాయకురాలికి చెప్పి ఆ ప్రదేశాన్ని శుద్ధి చేయించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేశారు. పదేళ్లు సీఎంగా ఉన్న.. విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా?శుద్ధి చేయాల్సింది నేలను కాదు.. తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలి. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలి.

- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

## స్పీకర్‌పై దూషణ,అంటరానితనం ఘటనలపై సమగ్ర విచారణ

## మీకూ..ఉగ్రవాదులకు తేడా ఏముంది?



- దళితులను అవమానించిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షిస్తాం
- కులవివక్ష, అణచివేత చర్యలను ఈ ప్రభుత్వం ఉపేక్షించేదిలేదు
- ఎర్రవల్లి ఫామ్ హౌజ్‌లోనే కుట్ర జరిగింది
- క్షమాపణ చెప్పాల్సింది పోయి.. దళితులు నడిచారని నేలను శద్ధిచేయిస్తాడా..
- శుద్ధి చేయాల్సింది నేలను కాదు.. తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను కడిగేయాలి
- దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలి
- బీఆర్ఎస్ నేతల తీరుపై అసెంబ్లీలో ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఘోరమైన పదంతో దూషించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని.. కానీ తల్లిని అవమానిస్తారా? అని ప్రశ్నించారు. కుల వివక్ష, అణచివేతను తమ ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. స్పీకర్‌పై దూషణ, ఎర్రవల్లిలో దళితులు నడిచారని రోడ్డును శుద్ధి చేసిన ఘటనలపై మిగతా 2లో..

### గడీల పాలనపై గర్జించిన ధిక్కార పతాకం చాకలి ఐలమ్మ

ధీర వనితకు సీఎం రేవంత్ నివాళులు

### కాళోజీ సేవలు చిరస్మరణీయం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



## ఎమ్మెల్యేల మీద పోలీసుల దాడిపై గవర్నర్‌కు

# ఆధారాలు చూపాం

### శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశాం: కేటీఆర్

- లోక్‌భవన్‌లో శివ్‌ప్రతాప్‌శుక్లాను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదు చేసిన నేతలు
- పార్లమెంటుకు రాహుల్ వెళ్లినట్లే తాము నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు.శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపామని, ఎమ్మెల్యే సబితపై పోలీసుల దాడి, సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు మిగతా 2లో..

"శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు . పార్లమెంటుకు రాహుల్ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లాం"

- కేటీఆర్

# మహిళా ఎమ్మెల్యేలకు న్యాయంచేయాలి



- అసెంబ్లీ హాలులో బీఆర్ఎస్ నేతల ఆందోళన
- శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్
- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు
- సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్

2లో







## ఎర్రవల్లిలో బీఆర్ఎస్ నాయకులు చేసిన

# శుద్ధీకరణ హేయనీయం

బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరించిన తీరు, స్పీకర్‌కు జరిగిన అవమానంపై గవర్నర్‌కు మంత్రుల ఫిర్యాదు

2లో

## హర్మ్మూజ్ జలసంధి

# ఇరాన్ స్వాధీనం

### పరస్పరం దాడులు చేసుకున్న అమెరికా, ఇరాన్

- హర్మ్మూజ్‌లో 13 చమురు నౌకలపై దాడులు..!
- ఖర్గ్,గల్ఫ్ ఆఫ్ ఒమన్ సమీపంలో 5 చమురు ట్యాంకర్లను పేల్చివేసిన యూఎస్ సెంట్రల్ కమాండ్
- ప్రతిగా హర్మ్మూజ్‌లో 8 చమురు నౌకలపై ఇరాన్ దాడులు

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో మరోసారి బాంబుల వర్షం కురిసింది. ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ద్వీపం, గల్ఫ్ ఆఫ్ ఒమన్ సమీపంలోని ఐదు చమురు ట్యాంకర్లను తమ బలగాలు పేల్చివేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. గత రెండు రోజులుగా తమ యుద్ధనౌకలపై టెహ్రాన్ బాలిస్టిక్

### 100 డాలర్లకు చేరిన ముడి చమురు

2లో





## రూ.10వేల కోట్లతో

# ఏడు రైల్వే కారిడార్లు

### తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు

### పలు కీలక రైల్వే లైన్లకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం



న్యూఢిల్లీ(జనంసాక్షి):రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా 8 మల్టీ-ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుల(దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులకు )కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వీటిలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక పరిధిలోని 17 జిల్లాలను కలుపుతూ 5 మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. రూ.10వేల కోట్లకు పైగా వ్యయంతో 7 రైల్వే కారిడార్లలో మిగతా 2లో..

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

# దాదాపు ఖరారైనట్లే..

- మిగిలిన అంశాలపై ఇరు దేశాల మధ్య చర్చలు
- కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడి



వాషింగ్టన్(జనంసాక్షి):భారత్ - అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారైనట్లు కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ఒప్పందంలోని కొన్ని అంశాలపై ఇరు దేశాలు ఇంకా చర్చిస్తున్నాయని పేర్కొన్నారు. సరైన సమయంలో ఒప్పందంపై సంతకాలు చేస్తామని స్పష్టం చేశారు. ఇరు దేశాలు పరస్పరం తమ మార్కెట్లలో ప్రాధాన్య ప్రాప్యత కల్పించుకునే విధంగా ఒప్పందాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ముంబయిలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్- 2026 సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. భారత్ సాధారణంగా మోస్ట్ ఫేవర్డ్ నేషన్ టారిఫ్ విధానాన్ని అనుసరిస్తుంది. అమెరికా ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ టారిఫ్‌ల విధానంలో పనిచేస్తోంది. దీంతో భారత్‌కు వ్యత్యాసాలను, ప్రాధాన్య మార్కెట్ ప్రాప్యత కల్పించేలా ఒక ప్రత్యేక వ్యవస్థ అవసరం. ఇరువైపులా వ్యాపార వర్గాలు ఇప్పటికే చురుకుగా పరస్పరం చర్చలు జరుపుతున్నాయి. రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన సమగ్ర అవగాహనపై వ్యాపార సంస్థలు సంతృప్తిగా ఉన్నాయి. అలాగే భారత్-చిలీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరింది. కొన్ని అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. వచ్చే రెండు, మూడు నెలల్లో గణనీయమైన పురోగతి ఉంటుందని ఆశిస్తున్నాం. మిగతా 2లో..

## న్యాయవ్యవస్థపై నిర్మాణాత్మకమైన

# విమర్శలు చేయాలి

### సమాచారం లేని వాదనలను న్యాయస్థానం వ్యతిరేకిస్తుంది : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ(జనంసాక్షి): విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. మిగతా 2లో..

5 రాష్ట్రాల ఎన్నికల వేళ..

## భాజపాకు రూ.1,473 కోట్లు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యధిక నిధులు పొందిన పార్టీల్లో భాజపా అగ్రస్థానంలో నిలిచింది. మిగతా 2లో..



# భారత్, రష్యా భారీ రక్షణ ఒప్పందం

- ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ
- అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్- రష్యా మధ్య ఉన్న వ్యూహాత్మక రక్షణ బంధం మరో సరికొత్త మలుపు తిరగబోతోంది. దిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ఈ నెల 11న మిగతా 2లో..

## పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల

# వయోపరిమితి పెంపు

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్(జనంసాక్షి):నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పోలీసు నియామకాల్లో వయోపరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కానిస్టే బుల్ పోస్టులకు మూడేళ్ల వయోపరిమితి పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇంతకుముందు ఎస్సై ఉద్యోగాలకు వయోపరిమితి 32, కానిస్టేబుళ్లకు 29గా ఉండేది. దీంతో రెండు పోస్టుల మధ్య వయసు తేడాపై అభ్యంతరాలు రావడంతో ప్రభుత్వం ఎస్సై అభ్యర్థులతో సమానంగా కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితిని పెంచింది. పోలీసు, ఫైర్, జైళ్ల శాఖ, ఎస్‌పీఎఫ్ విభాగాల్లోని కానిస్టేబుళ్లకు ఈ నిర్ణయం అమలు కానుంది. కానిస్టేబుల్ (డ్రైవర్ పోస్టులకు) మాత్రం ప్రభుత్వం సడలింపు ఇవ్వలేదు.

## శాసనసభ్యులపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం

సమర్పించామని తెలిపారు. తమపై దాడులు చేసి తమపైనే కేసులు పెట్టారని శివ్‌ప్రతాప్ శుక్లాకు వివరించామని పేర్కొన్నారు. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదని వెల్లడించారు.నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించాం : తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. ”శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేప డంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లాం” అని కేటీఆర్ అన్నారు

## బీఆర్‌ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణ హేయనీయం

**హైదరాబాద్(జనంసాక్షి):**

లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌కు మార్ శుక్లాను పలువురు మం త్రులు కలిశారు. బీఆర్‌ఎస్ నా యకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు స్పీకర్‌ను అవమానపర్చే విధంగా మాట్లా డిన తీరును మంత్రులు గవర్న ర్‌కు వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఉపముఖ్య మంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోం దని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, అతని తల్లిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని, దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో పలువురు మంత్రులు గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. దళితులు ప్రజాస్వామ్యంగా నిరసన తెలిపితే కేసీఆర్ అవమానించారు, తన ఫామ్‌హౌస్ రోడ్డులో దళితులు నడిచారని కేసీఆర్ శుద్ధి చేయించారు. కేసీఆర్ చూపించిన అంటరానితనంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. బీఆర్‌ఎస్ నేతలు స్పీకర్, స్పీకర్ తల్లిని కూడా దూషించారు. బీఆర్‌ఎస్ నేతలు చేసిన శు ద్ధీకరణపై కేసీఆర్ ఇప్పటికైనా స్పందించాలి. దళితులను అవమానించటం కేసీఆర్ ఆదేశాలతోనే జరుగుతున్నదా?, కేసీఆర్ ఆదేశించకపోతే ఎందుకు మాట్లాడటం లేదు అని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదుపై స్పీకర్ స్పందించారని, ఘటనపై విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారని లక్ష్మమ్ తెలిపారు. ప్రజాపాలనలో అంటరానితనానికి తావు లేదని, ఇలాంటి కుల వివక్ష ఘటనలను సహించబోమని అడ్లూరి ప్రకటించారు. బీఆర్‌ఎస్ నేతల తీరును గవర్నర్‌కు వివరించడం కోసమే తాము లోక్‌భవన్‌కు వెళ్లినట్లు ఆయన తెలిపారు.

## గడీల పాలనపై గర్జించిన ధిక్కార పతాకం చాకలి ఐలమ్మ

హైదరాబాద్(జనంసాక్షి):గడీల పాలనకు, దొరల అహంకారానికి వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అణచివేత, దమనకాండకు వ్యతిరేకంగా ఆ మహనీయురాలు ఎగరేసిన ధిక్కార పతాకం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళి తెలిపారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని సీఎం గుర్తు చేశారు. సమ్మక్క-సారక్క, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని ముఖ్యమంత్రి తెలిపారు. వారి ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు కూడా ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

## కాళోజీ సేవలు చిరస్మరణీయం

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు సేవలను చిరస్మరణీయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి సేవలు మనమంతా స్మరించుకోవాలన్నారు. ప్రజల గొంతుకగా నిలిచిన కాళోజీ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రజా ప్రభుత్వం సారథ్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ భాషకు కాళోజీ చేసిన సేవలు శ్లాఘనీయమని... ఆయన స్ఫూర్తితో తెలంగాణ భాష, సాహిత్యానికి మరింత ప్రోత్సాహం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వం స్పష్టం చేశారు.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారైనట్లే..

ఇక భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏను వీలైనంత త్వరగా అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. అక్టోబర్‌లో ఇది అమలులోకి వచ్చే అవకాశం ఉంది” అని కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ అన్నారు

**ఎగుమతులపై రవాణా ఖర్చుల ప్రభావం తక్కువే**

ఎగుమతిదారులను ప్రభావితం చేస్తున్న రవాణా ఖర్చుల గురించి రాజేశ్ అగర్వాల్ మాట్లాడారు. అంతర్జాతీయ సరుకు రవాణా ఖర్చులు పెరగడం వల్ల ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా ప్రభుత్వం సారించిం దని తెలిపారు. ఎగుమతిదారులకు తగినంత షిప్‌లు, కంటైనర్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రవాణా ఆలస్యాలు, అదనపు వ్యయాలను తగ్గించేందుకు ప్రభుత్వం ఎగుమతిదారులతో కలిసి పనిచేస్తోంద న్నారు. అయితే ప్రస్తుతానికి అధిక ఫ్రైట్ ఛార్జీల ప్రభావం అంచనా వేసినంత తీవ్రంగా కనిపించడం లేదని తెలిపారు. తొలి నాలుగు నెలల్లో దేశ ఎగుమతులు 15%పైగా పెరగడమే ఇందుకు సంకేతమని పేర్కొన్నారు.

**ప్రపంచ ఫిన్‌టెక్ మార్కెట్‌లో భారత్‌కు భారీ అవకాశాలు**

భారత్ డిజిటల్ చెల్లింపులు, రుణాలు, బీమా, ట్రేడ్ ఫైనాన్స్ రంగాల్లో సాధించిన అనుభవాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉందని రాజేశ్ అగర్వాల్ అన్నారు. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల్లో భారత ఫిన్‌టెక్ సేవలకు విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు స్వదేశానికి పంపే నగదుపై ప్రస్తుతం సగటున 5?6 శాతం వరకు రెమిటెన్స్ ఛార్జీలు ఉంటున్నాయని తెలిపారు. వీటిని 3 శాతానికి తగ్గించగలిగితే భారతీయ వలస కార్మికుల చేతికి అదనంగా 500 కోట్ల డాలర్ల వరకు చేరే అవకాశం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇదే స్థాయిలో ఛార్జీలు తగ్గితే వలస జనాభాకు దాదాపు 3,000 కోట్ల డాలర్ల ప్రయోజనం కలగవచ్చని వివరించారు.

# ఎర్రవల్లిలో దళితులు డప్పుకొడితే శుద్ధిచేస్తారా

సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని తీవ్రంగా పరిగణిస్తున్నామని.. అంటరానితనం సహా సెప్టెంబర్ 6 నుంచి జరిగిన వరుస ఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు.

“కసబ్ వంటి ఉగ్రవాదులకు, స్పీకర్‌ను తిట్టిన వారికి తేడా లేదు. స్పీకర్‌కు క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయి. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ దళితులు డప్పులతో నిరసన తెలిపారు. ఎక్కడ కుట్ర జరిగిందో.. అక్కడ డప్పు మోగించి వాళ్లు నిరసన చేపట్టారు. ఫాంహౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప.. ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదు. దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని మాత్రమే వారు కోరారు. కేసీఆర్ క్షమాపణ చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారు. సంధ్యారావు అనే నాయకురా లికి చెప్పి ఆ ప్రదేశాన్ని శుద్ధి చేయించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేశారు. పదేళ్లు సీఎంగా ఉన్న.. విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా? శుద్ధి చేయాల్సింది నేలను కాదు.. తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలి. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలి.

**దళితులను అవమానించిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షిస్తాం**

సెప్టెంబర్ 6న ఫాంహౌస్‌లో భేటీ మొదలుకొని ఆ తర్వాత జరిగిన వరుస ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం. అంటరానితనం ప్రదర్శించిన వారిపై చర్యలకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. ఈ ఘటనలపై విచారణకు విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. అసెంబ్లీ వద్ద మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపైనా విచారణ చేపడతాం. విధుల్లో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉంటూ సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా సమగ్ర విచారణ చేపట్టి క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. రాజకీయాలకు అతీతంగా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరముంది” అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**దళితులు నడిచారని రోడ్డును శుద్ధి చేయడం దారుణం: మంత్రి వాకిటి శ్రీహరి**

హైదరాబాద్: దళితులు నడిచారని రోడ్డును శుద్ధి చేయడం దారుణమైన ఘటన అని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. అస్పృశ్యత విధానం ఇంకా కొనసాగుతుండటం బాధాకరమని చెప్పారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. “స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలు గడిచినా, విద్యతో చైతన్యం పెరిగినా కొందరి భావజాలం మారలేదు. ఇలాంటి అహంకారపూరిత వ్యక్తులు, పార్టీని ప్రజలు సహించరు. భూతల్లిని కాదు.. అస్పృశ్యత నాటుకుపోయినా వాళ్ల మనసులను శుద్ధి చేయాలి. మహిళా ఉద్యోగుల ముందు దుస్తులు విప్పటం చూసి సభ్యసమాజం తలదించుకుంటోంది. కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు ఇవ్వాలని సీఎం ఎన్నోసార్లు ఆహ్వానించారు” వాకిటి శ్రీహరి అన్నారు.

**దళితులను అవమానించడమే వారి భావజాలం: మంత్రి సీతక్క**

దళితులను అవమానించడమే బీఆర్‌ఎస్ భాజపా భావజాలమని మంత్రి సీతక్క విమర్శించారు. శాసనసభలో ఆమె మాట్లాడుతూ “స్పీకర్‌ను అవమానించామనే పశ్చాత్తాపం లేకుండా బీఆర్‌ఎస్ సభ్యులు బయట డ్రామాలు చేస్తున్నారు. దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేశారు. సభలో ఉన్న భాజపా సభ్యులు వీటిని ఖండించట్లేదు. పైగా పోడియం వద్దకు వచ్చి సభ సజావుగా సాగకుండా అడ్డుపడుతున్నారు” అని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజు నుంచి బీఆర్‌ఎస్, భాజపా సభ్యులు సభ జరగకుండా అడ్డుకుంటున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. ఈ వార్త చదివారా: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలదే కీచకపర్వం.. వీడియో విడుదల చేసిన మంత్రి సీతక్క

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలదే కీచకపర్వం..

హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేలపట్ల అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించారని మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. ఇందుకు సంబంధించి అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనపై వీడియోను ఆమె విడుదల చేశారు. బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవలక్ష్మీలను వెనక నుంచి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి తోసేయడంతోపాటు.. గంగుల కమలాకర్ మహిళా ఎమ్మెల్యేలను వెనకనుంచి నెట్టుకుంటూ ముందుకు వచ్చారని తెలిపారు. మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన మంత్రి సీతక్క.. ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల మధ్యలోకి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వచ్చారని... అలా చొరబడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కోవా లక్ష్మీ, సబితా ఇంద్రారెడ్డిపై ఆ పార్టీ ఎమ్మెల్యేలే అనుచితంగా వ్యవహరించారని తెలిపారు. నవీన్ రెడ్డి నెట్టుకుంటూ పోయినప్పుడు ఆ మహిళా ఎమ్మెల్యేలు అయ్యో అని అరిచారని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేలను వెనక నుంచి తోసిన గంగుల కమలాకర్, సుధీర్‌రెడ్డిలది కీచకపర్వమని విమర్శించారు.

**దొరతనం పోకడలను భరించడానికి రాష్ట్రం సిద్ధంగా లేదు: భట్టి**

సభాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్‌ఎస్ నేతలు చేశారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. “అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నా. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలి. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి.. స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదు. సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారు. నిరసనలో భాగంగా దళితులు రోడ్డుపై నడిచారని పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. పసుపు నీటితో శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారు. న్యాయం కావాల్సింది.. బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకు. మీ చేతుల్లో అవమానానికి గురవుతున్న ప్రజలకు న్యాయం కావాలి. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోంది. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారు. దొరతనం పోకడలను భరించడానికి రాష్ట్రం సిద్ధంగా లేదు” అని భట్టి విక్రమార్క అన్నారు.

**ఎస్సీలు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేస్తారా?: మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

ఎస్సీలను భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పార్టీ అవమానిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ధ్వజమెత్తారు. తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు మూడో రోజు ప్రారంభమైన వెంటనే.. ఎర్రవల్లిలో శుద్ధిపై కాంగ్రెస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చింది. మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎర్రవల్లిలో ఎస్సీలు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేస్తారా? అని ప్రశ్నించారు. శుద్ధి పేరుతో ఎస్సీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై బీఆర్‌ఎస్ నేతలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆత్మగౌరవం కోసం తెలంగాణ సాధించుకున్నాం.. రాష్ట్రం సాధించుకున్న తర్వాత కూడా ఎస్సీలపై వివక్ష కొనసాగుతోందన్నారు. శుద్ధి పేరుతో బీఆర్‌ఎస్ నేతలు చేసిన పనికి ఏం సమాధానం చెబుతారు? స్పీకర్ విషయంలో ఘటనపై కూడా బీఆర్‌ఎస్ నేతలకు పశ్చాత్తాపం లేదని మండిపడ్డారు.

## మహిళా ఎమ్మెల్యేలకు న్యాయంచేయాలి

హైదరాబాద్(జనంసాక్షి):బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్?ఎస్? సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్? అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే ‘వి వాంట్ జస్టిస్’ అంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదిం చారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్‌ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 5 రాష్ట్రాల ఎన్నికల వేళ.. భాజపాకు రూ.1,473 కోట్లు

ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి శాసన సభలకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో భాజపాకు భారీగా నిధులు అందినట్లు ఎన్నికల సంఘానికి సమర్పించిన వ్యయ నివేదికలో వెల్లడైంది. దీని ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక్క భాజపా కేంద్ర కార్యాలయానికి రూ.1,473 కోట్ల మేర నిధులు రాగా.. కాంగ్రెస్ పార్టీ కేంద్ర, రాష్ట్ర విభాగాల నుంచి వచ్చిన మొత్తం రూ.207కోట్లుగా ఉంది. కాంగ్రెస్‌తో పోలిస్తే భాజపాకు వచ్చిన నిధులు ఏడు రెట్లు అధికం.అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి ఎన్నికలకు సంబంధించిన కాంగ్రెస్ సమగ్ర వ్యయ నివేదిక ఇదివరకే వెలువడింది. మార్చి 15నుంచి మే 6వరకు కొనసాగిన ఎన్నికల సమయంలో ఆ పార్టీ రూ. 207.17 కోట్ల ఆదాయాన్ని.. రూ.248.55 కోట్ల వ్యయాన్ని చూపించింది. దీనికి భిన్నంగా అదే సమయంలో భాజపా తన కేంద్ర కార్యాలయం నుంచే రూ. 1,472.8 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది.

## భారత్, రష్యా భారీ రక్షణ ఒప్పందం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అత్యంత కీలకమైన ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఈసారి అజెండాలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. అవే ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ, అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్

## న్యాయవ్యవస్థపై నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి

ఎన్‌సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో ‘న్యాయవ్యవస్థలోని అవినీతి’ అనే అంశాన్ని ప్రవేశపెట్ట డంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ’న్యాయవ్యవస్థపై నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి”’ న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించ జాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు” అని సుప్రీంకోర్టు పేర్కొంది.

**అసలేంటి వివాదం?**

ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన ‘ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)’ అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైనా, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది.

సవరించిన పాఠ్య పుస్తకం

అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. ‘స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?’ అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి ‘న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా ‘న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు’ అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది.

# హర్మూజ్ జలసంధి ఇరాన్ స్వాధీనం

క్షిపణులతో దాడులు చేసిందని అమెరికా పేర్కొంది. వాటిని తాము అడ్డుకున్నామని వెల్లడించింది. ఆ దాడులకు ప్రతిస్పందనగానే చమురు ట్యాంకర్లను టార్గెట్ చేశామంటూ వీడియోలను షేర్ చేసింది. ఈ దాడులపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై విరుచుకుపడింది. ఇక్కడ ఉన్న అమెరికా ఫైటర్‌జెట్‌లను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. అయితే అమెరికా మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు.

“అమెరికా యుద్ధనౌకను పేల్చేందుకు బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ రెండుసార్లు విఫలయత్నం చేసింది. ఆ దాడులనుంచి మా నౌక విజయవంతంగా తప్పించుకొని.. సముద్ర జలాల్లో గస్తీని కొనసాగించింది. మా సిబ్బందికి ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. ఇరాన్ దాడులకు ప్రతిగా ఐఆర్‌జీసీ (ఎఖీఉఅ) చమురు స్మగ్లింగ్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదు నౌకలపై అమెరికా దళాలు దాడి చేశాయి. ఐఆర్‌జీసీ, దాని అనుబంధ సంస్థలకు నిధులు సమకూర్చేందుకు ‘షాడో ఫ్లీట్’లో భాగంగా ఈ ఐదు నౌకలు రాకపోకలు సాగిస్తున్నాయి” అని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఆరోపించింది.

హర్మూజ్‌లో 8 చమురు నౌకలపై దాడులు: ఇరాన్ అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. జోర్డాన్‌లోని అల్ అజ్రఖ్ ఎయిర్ స్థావరాన్ని టార్గెట్ చేసింది. అమెరికా యుద్ధ విమానాలు ఉపయోగించే హ్యాంగర్లు ధ్వంసమయ్యాయని ఐఆర్‌జీసీ ప్రకటించింది. అలాగే హర్మూజ్ జలసంధిలో రెండు అమెరికా నౌకలు, ఎనిమిది చమురు ట్యాంకర్లపై దాడి చేసినట్లు వెల్లడించింది అంతేగాకుండా నిబంధనలు ఉల్లంఘించిన మరో 10 నౌకలను తమ బలగాలు లక్ష్యంగా చేసుకున్నాయని తెలిపింది. అమెరికా (జూం) మద్దతుతో జలసంధిలోని నిషేధిత, అసురక్షిత ప్రాంతం మీదుగా అవి ప్రయాణించడానికి ప్రయత్నించాయని పేర్కొంది. అలాగే కువైట్, బహ్రెయిన్ దేశాలకు హెచ్చరికలు పంపింది. ఆ దేశాల పోర్టుల్లోని చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. దీంతో పలువురు నావికులు నౌకలను వదిలేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అమెరికాకు చెందిన అండర్ వాటర్ డ్రోన్‌ను కూడా ఇరాన్ స్వాధీనం చేసుకొంది. దానికి సంబంధించిన వీడియోను విడుదల చేసింది.

ఇరాన్-ఇరాక్ మధ్య నాడు ట్యాంకర్ వార్..

1980-88 మధ్య ఇరాన్-ఇరాక్ మధ్య జరిగిన యుద్ధంలో ట్యాంకర్ వార్ ఒక భాగం. ఆ దేశాలు ఒకదాన్ని మరొకటి ఆర్థికంగా దెబ్బతీసుకోవడానికి పర్షియన్ గల్ఫ్ జలాల్లో ప్రయాణించే చమురు ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీనినే ట్యాంకర్ వార్‌గా చెప్తారు. ఈ యుద్ధంలో దాదాపు 400కుపైగా నౌకలు ధ్వంసమయ్యాయి.

## 100 డాలర్లకు చేరిన ముడి చమురు..

టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్-అమెరికా దాడులతో హర్మూజ్ దద్దరిల్లుతోంది. రెండు దేశాలు 10కిపైగా చమురు ట్యాంకర్లపై దాడులు చేశాయి. దీంతో ముడి చమురు ధరలు మళ్లీ పెరిగాయి బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఒక బ్యారెల్ ధర 99.49 డాలర్లకు ఎగబాకింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర 94.63 డాలర్లు పలుకుతోంది.

## రూ.10వేల కోట్లతో ఏడు రైల్వే కారిడార్లు

4 లేన్ల నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇందులో ప్రధానంగా తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ, బుధవారం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టులను, 2029-30 నాటికి పూర్తి చేయాలని కేబినెట్? ప్రణాళిక వేసింది. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరాలు వెల్లడించారు. ”బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మే-జూన్ నాటికి టెస్టింగ్? కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్? పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుంది.”అని అన్నారు.

దక్షిణాది విషయానికొస్తే,

ఇందులో, అరక్కోణం- రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘట్‌కేసర్- కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్-బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలం-కరూర్-దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్-ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది.

4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు

వీటితో పాటు బంగాల్, ఝార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్?ల్లోని 14 జిల్లాల గుండా రైల్వే కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. ఖరగ్‌పూర్- ఝూర్సుగూడ, కట్నీ- పెండ్రా రోడ్ సెక్షన్ల మధ్య నాలుగో లైన్, అలాగే బిలాస్‌పూర్? (ఉస్లాపూర్)- పెండ్రా రోడ్ సెక్షన్ల మధ్య మూడో లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నూతన ప్రాజెక్టుల ద్వారా భారతీయ రైల్వే ప్రస్తుత నెట్‌వర్క్ సుమారు 540 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. నూతన లైన్ల ద్వారా దాదాపు 52 లక్షల జనాభా ఉన్న 2,121 గ్రామాలకు రవాణా సదుపాయాలు మెరుగుపడనున్నాయి.

రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గి

ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యటక ప్రదేశా లకు రైలు మార్గాలు మెరుగుపడనున్నట్లు తెలిపింది. తా రాతరిణి ఆలయం, జగన్నాథ ఆల యం(ఝూర్సుగూడ సమీపంలోని పురాతన ఆలయం), బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ ఆలయం, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో పాటు సరుకు రవాణాకు కూడా ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణా సులభతరం కానుంది. దీనివల్ల ఏడాదికి అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు మార్గం సులభతరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా బహుళ- రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీఎం గతి శక్తి నేషనల్? మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టులు ప్రణాళిక రచించారు.

## భారత్ నాకు అన్యాయం చేసింది

- విజయ్ మాల్యా సంచలన వ్యాఖ్యలు

**లండన్(జనంసాక్షి):**బ్యాంకు రుణాల ఎగవేత కేసులో భారత్ నుంచి పారి పోయిన ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా మరోసారి సంచలన వ్యాఖ్య లు చేశారు. భారత ప్రభుత్వం తనకు తీవ్ర అన్యాయం చేసిందని ఎక్స్ వేదిక గా ఆరోపించారు. తాను నిర్దోషినని పేర్కొంటూనే, చట్టపరమైన కారణాల వల్ల తాను యూకే విడిచి వెళ్లలేకపో తున్నానని చెప్పారు. 1992 నుంచి తాను యునైటెడ్ కింగ్‌డమ్‌లో శాశ్వత నివాసిగా ఉన్నానని, ప్రస్తుతం ఆ దేశాన్ని విడిచి వెళ్లేం దుకు తనకు చట్టపరంగా అనుమతి లేదని తెలిపారు. 2025 అక్టోబర్‌లో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు తెలిపిన ప్రకారం, పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం, 2018 కింద పరారీలో మొత్తం 15 మంది ఆర్థిక నేరస్థులు ఉన్నారని ప్రకటించారు. ఈ జాబితాలో విజయ్ మాల్యా, నీరవ్ మోదీ తదితర ప్రముఖ పేర్లు ఉన్నాయని చెప్పారు. అయితే తాను భారత్?కు రాకుండా యూకేలోనే ఉండడం తన ప్రయాణంపై ఉన్న చట్టపరమైన నిషేధంలో భాగమేనని మాల్యా ఇప్పుడు వాదిస్తున్నారు.

**బాంబే హైకోర్టు చివరి అవకాశం**

ఈ ఏడాది ఫిబ్రవరిలో విజయ్ మాల్యాను బాంబే హైకోర్టు మందలించింది. ఉద్దేశపూర్వకంగా కోర్టు విచారణలను తప్పించుకుంటూ న్యాయపరమైన ఉపశమనం కోరలేరని కోర్టు పేర్కొంది. భారత్‌కు తిరిగి రావాలనే ఉద్దేశం ఉందో లేదో స్పష్టం చేసేందుకు మాల్యాకు చివరి అవకాశం ఇచ్చింది. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టాన్ని, తనను పరారీలో ఉన్న వ్యక్తిగా ప్రకటించిన ప్రక్రియను మాల్యా సవాలు చేస్తూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు.

# కేసీఆర్ హయాంలో ఫార్మారంగం అభివృద్ధి

- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్ల పాలనలో ఫార్మాస్యూటికల్ పరిశ్రమ అభివృద్ధికి విశేష కృషి చేశారని, దీంతో ఫార్మా రంగానికి హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా అవతరించిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.ఈ రంగాన్ని మరింతగా విస్తరించేందుకు, అభివృద్ధి చేసేందుకు 33వేల ఎకరాలు సేకరించి పెట్టగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు దానిని ఫ్యూచర్ సిటీ అంటూ ప్రచారం చేసుకుం టున్నారని పేర్కొన్నారు.కోల్డ్ చెయిన్ అన్ బ్రోకెన్-2026 పేరుతో గ్లోబల్ కోల్డ్ చెయిన్ కనెక్షన్ ఆధ్వర్యాన శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఉన్న నోవాటెల్ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో సదస్సు జరిగింది.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు ఎంపీ రవిచంద్ర బుధవారం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కరోనా మహమ్మారి నివారణకు ఇక్కడి జినోమ్ వ్యాలీలో ఉన్న భారత్ బయోటెక్ కంపెనీ కోవాగ్జిన్ వ్యాక్సిన్ ను తయారు చేయడం జరిగిందని,ప్రధాని నరేంద్రమోడీ స్వయంగా వచ్చి కృష్ణ ఎల్లాను ప్రశంసించారన్నారు.హెటిరో,ఎంఎస్ఎం, రెడ్డీస్,దివీస్ వంటి పేరుగాంచిన ఫార్మా కంపెనీలు ఇక్కడే ఉన్నాయని తెలిపారు. ప్రపంచానికి అవసరమయ్యే ఔషధాలలో సుమారు 35 శాతం ఇక్కడ తయారైనవేనని, ఏటా 49వేల కోట్ల రూపాయల ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును హైదరాబాద్ లో ఏర్పాటు చేయడం అభినందనీయమని,ఇది మంచి ఆలోచన అన్నారు.వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని,మరిన్ని పెట్టుబడులు రాబట్టి పరిశ్రమల స్థాపనకు,అభివృద్ధికి అండగా ఉంటారని ఎంపీ వద్దిరాజు వివరించారు.ఈ సదస్సులో శంకర్,సర్వేష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

### సమాధానం చెప్పలేకే సస్పెన్షన్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడిగే ప్రశ్నలకు,లేవనెత్తే అంశాలకు సమాధానాలు చెప్పలేకే వారిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారు. ప్రజలకిచ్చిన 420 హామీలు,6 గ్యారంటీలు,13 డిక్లరేషన్లను అమలు పర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పట్ల రోజురోజుకు ఆదరణ పెరుగుతుండడంతో దిక్కుతోచని స్థితిలో అధికార పక్షం"డైవర్షన్ పాలిటిక్స్"చేస్తూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నది. అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు సభ్యులను సస్పెండ్ చేయడం తీవ్ర గర్హనీయం.

# ఘనంగా కాళోజీ 112వ జయంతి వేడుకలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 09(జనంసాక్షి) :** ఖైరతాబాద్‌లోని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ మరియు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తదితరులు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ అసిస్టెంట్ సెక్రెటరీ ఎన్. సునీత, రీసెర్చ్ అసోసియేట్ లక్ష్మీనారాయణ మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు గొప్ప కవి మరియు ప్రజా ప్రతినిధి అని, తెలంగాణ మాండలికాన్ని ఎగతాళి చేసిన వారికి తన శక్తివంతమైన, నిర్భయమైన కవితల ద్వారా తగిన సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆంధ్ర మహాసభ కార్యకలాపాలతో ఆయన గ్రంథాలయోద్యమంలో చురుకుగా పనిచేశారని, అలాగే శాసనమండలి సభ్యునిగా కూడా సేవలందించారని గుర్తుచేశారు. ఆయన రాసిన "నా గొడవ" పుస్తకం ఎంతో ప్రజాదరణ పొందిందని, "పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది" అనే ఆయన ప్రసిద్ధ నినాదం నేటికీ ఎంతోమందికి స్ఫూర్తినిస్తోందని ఆయన అన్నారు.

# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి



- ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్
- తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) :** తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక లి"తెలంగాణ రైజింగ్ సమ్మిట్"లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలు, విస్తారమైన ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యతతో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించగలవని ఆయన పేర్కొన్నారు. "తెలంగాణ రైతు పండించిన ధాన్యానికి అంతర్జాతీయ మార్కెట్ ద్వారాలు తెరవడమే మా ప్రభుత్వ లక్ష్యం. బియ్యం ఎగుమతులు విస్తరించడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతోపాటు రైస్‌మిల్లర్లు, విత్తన కంపెనీలు, మాంస ఉత్పత్తిదారులు, ఆహారశుద్ధి పరిశ్రమలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయాన్ని కేవలం జీవనాధారంగా కాకుండా ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానమైన లాభసాటి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్ రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షలకు అంతర్జాతీయ వేదికగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయం, ఆహారశుద్ధి, విత్తనోత్పత్తి, ఎగుమతులు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల రంగాల్లో తెలంగాణ-ఫిలిప్పీన్స్ మధ్య నూతన భాగస్వామ్యానికి ఈ సమ్మిట్ బలమైన పునాది వేస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

- ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్
- రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు
- సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం..
- శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 09(జనంసాక్షి) :** యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా, అవసరమైన మేరకు అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. యాప్ అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లో రైతులకు మరింత సులభంగా, సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రోజు శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్, కౌలు రైతుల ఇబ్బందులు, సొసైటీలకు యూరియా రవాణా చార్జీలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారు. వాటిపై మంత్రి సమగ్రంగా వివరణ ఇచ్చారు. గతంలో ఆధార్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేదని మంత్రి తెలిపారు. అయితే సబ్సిడీపై లభించే ఎరువులు భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకే అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఎరువుల అక్రమ తరలింపు, బ్లాక్‌మార్కెటింగ్, అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వంటి సమస్యలను అరికట్టడంతో పాటు, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చేయడమే యాప్ తీసుకురావడానికి ప్రధాన ఉద్దేశమని వివరించారు. పారదర్శకంగా, అవసరమైన మేరకు సబ్సిడీ యూరియా నిజమైన రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రబీ 2025-26లో 'యూరియా బుకింగ్ యాప్'ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో అమలు చేసిన ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 04.06.2026న ప్రవేశపెట్టిన యాప్‌ను తెలంగాణలో సెప్టెంబర్ 2, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన యూరియా యాప్ స్థానంలో ప్రస్తుతం యాప్ ద్వారా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

కొత్త యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక బృందం మరియు మా అధికారులు యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. రాబోయే పంట కాలాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు లేని రైతులు కూడా ఎరువుల బుకింగ్ చేసుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్ల సహకారంతో రైతులకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతు గుర్తింపు, వెరిఫికేషన్‌కు లోబడి ఈ సహాయం అందిస్తారని చెప్పారు. యాప్ ద్వారా రైతులు సులభంగా ఎరువులు బుక్ చేసుకునేలా 'మీ-సేవ' బుకింగ్‌లను కూడా అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు లేదా స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తెస్తోందన్నారు. గిడ్డంగుల నుంచి రిటైల్ విక్రయ కేంద్రాలకు ఎరువులను తరలించడానికి పట్టే సమయం, రసీదుల లెక్కింపు, స్టాక్ బదిలీ నమోదులు, వ-ూూ సింక్రొనైజేషన్, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో డిజిటల్ స్టాక్, భౌతిక స్టాక్ మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాల వారీగా స్టాక్ తనిఖీలు నిర్వహించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక నిల్వలను క్రమం తప్పకుండా సరిపోల్చాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రాబోయే పంట కాలాల్లో రైతుల సంఖ్య పెరిగినా, ఒకేసారి పెద్ద సంఖ్యలో రైతులు యాప్‌ను వినియోగించినా ఎలాంటి సాంకేతిక అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. యాప్ సాంకేతిక బృందం ఎప్పటికప్పుడు లోడ్ టెస్టింగ్ నిర్వహిస్తోందని, అవసరానికి అనుగుణంగా సర్వర్ సామర్థ్యాన్ని ఆటోమేటిక్‌గా పెంచుకునే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. గరిష్ఠ వినియోగ సమయంలో కూడా రైతులకు సేవలు అందేలా సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

# బ్లాస్టింగ్ దెబ్బకు ఇళ్లకు బీటలు..

- వానకు కూలిన ఇళ్లు సగ భాగం...
- కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ ప్రభావిత గ్రామంలో ఘటన
- కూలే సమయంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం



**కాసిపేట, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** ఓపెన్‌కాస్ట్ గని బ్లాస్టింగ్ శబ్దాలకు ఇళ్లు దద్దరిల్లుతున్నాయి.. గోడలకు పగుళ్లు వస్తున్నాయి.. చివరకు ఆ పగుళ్లే ఓసీ ప్రభావిత గ్రామాల కుటుంబాలకు నిలువ నీడ లేకుండా చేస్తున్నాయి. బెల్లంపల్లి మండలం సోమగూడెం(బీ) గ్రామపంచాయతీ పరిధిలోని కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ ప్రభావిత ప్రాంతంలో చెట్టి శాంతకు చెందిన ఇల్లు బుధవారం కురిసిన వర్షానికి సగభాగం కూలిపోయింది.

### బ్లాస్టింగ్‌తో పగుళ్లు.. వర్షంతో కుప్పకూలింది

కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ గనిలో జరుగుతున్న బ్లాస్టింగ్ ప్రభావంతో ఇంటి గోడలకు కొంతకాలంగా పగుళ్లు ఏర్పడినట్లు బాధిత కుటుంబం చెబుతోంది. ఇప్పటికే బలహీనంగా మారిన ఇంటిపై బుధవారం కురిసిన వర్షం ప్రభావం పడటంతో ఒక్కసారిగా సగభాగం కూలిపోయింది. ఇంటి పైకప్పు, గోడలు ధ్వంసమై తీవ్ర నష్టం వాటిల్లింది.ఇల్లు ముందు సగ భాగం కూలిపోయే సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అదే సమయంలో అక్కడ ఎవరైనా ఉండి ఉంటే పరిస్థితి తీవ్రంగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కూలిన ఇంటిని స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. నాయకులు ముత్తే భూమయ్య, పొన్నాల కనకరాజు, వార్డు సభ్యులు బాదె ఉమ, జాడి ప్రమీల, మాజీ సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలా గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కుక్క రాంచందర్ తదితరులు పరిశీలించారు.

### పరిహారం అందించాలని డిమాండ్

ఓపెన్‌కాస్ట్ బ్లాస్టింగ్ కారణంగా తమ ఇళ్లు దెబ్బతింటున్నాయని ప్రభావిత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఘటనాస్థలిని పరిశీలించి ఇంటి నష్టాన్ని అంచనా వేయాలని, బాధిత కుటుంబానికి తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



# వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం

- నిందితుడి అరెస్ట్
- లక్షెట్టిపేట జైలుకు తరలింపు

**తాండూర్, సెప్టెంబర్ 09(జనం సాక్షి) :** వివాహం చేసుకుంటానని నమ్మించి ఒక మహిళను మోసం చేసిన నిందితుడిని తాండూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాండూరు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ప్రసాద్ రావు తెలిపిన వివరాల ప్రకారం... తాండూరు మండలం, అచలాపూర్ గ్రామానికి చెందిన కొట్టే రవి అనే వ్యక్తి, ఒక మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. ఆ తర్వాత వివాహం చేసుకోవడానికి నిరాకరించాడు. దీనిపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాండూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 108/2026, యూ/ఎస్ 69 బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తు పూర్తయిన అనంతరం, పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి బెల్లంపల్లి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. గౌరవ న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో, అతనిని లక్షెట్టిపేట సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# ఖమ్మం జిల్లాలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం!

- గురుకుల పాఠశాల విద్యార్థికి గుండెపోటు..
- అధికారుల అలసత్వమేనని విద్యార్థి సంఘాల ఆందోళన..
- ఇంటర్ విద్యార్థి ఉరి వేసుకొని బలవన్మరణం..
- ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం..!




**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 09(జనం సాక్షి) :** ఖమ్మం జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు సంఘటనలు తీవ్ర కలకలం రేపాయి.. అభం శుభం తెలియని ఓ బాలుడు గుండె పోటుతో దుర్మరణం పాలవగా.. ఖమ్మంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి ఉరి వేసుకుని బలవన్మ రణానికి పాల్పడ్డాడు.. బాధిత కుటుంబాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం రఘునాథపాలెం మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సాత్విక్(13) బుధవారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటి విద్యార్థులతో ఆడుకుం టుండగా కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. అతడిని స్థానిక ఉపాధ్యాయులు హుటాహుటిన ఖమ్మంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు, అప్పటికే మరణించినట్లు నిర్ధారించి భౌతిక కాయాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి స్వస్థలం తిరుమలా యపాలెం మండలం కాకరవాయి. సమాచారం తెలుసుకున్న అతని తల్లిదండ్రులు హరీష్, ప్రియాంక ఇద్దరూ, వారి బంధువులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కి చేరుకొని విగత జీవిగా మారిన తమ ముద్దుల బిడ్డను చూసి హతాశులయ్యారు. తమ ఆశల సౌధం కుప్ప కూలిందని గుండెలవిసేలా రోదిస్తుంటే అక్కడి వాతావరణం ఉద్వేగ భరితంగా మారింది. బాలుడు మరణ వార్త వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ఖమ్మం వ్యాప్తంగా వ్యాపించడంతో పలు విద్యార్థి సంఘాలు ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకున్నాయి. గురుకుల పాఠశాలల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయని, కనీస మౌలిక వసతులు కూడా కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యాయని ఆరోపిస్తూ ఆందోళనకు దిగాయి. ఇది ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్య ఫలితమేనని, బాధితుడు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశాయి. పరిస్థితి అదుపు తప్పకుండా ఖమ్మం టూ టౌన్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలుడు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ బాలకృష్ణ దర్యాప్తు చేపట్టారు.

### ఉరి వేసుకుని ఇంటర్ మృతి..!

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. ఖమ్మం నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తుమ్మ రెడ్డి శ్రీ చరణ్ రెడ్డి (19) ఉరి వే బలవన్మరణానికి పాల్పడ్డాడు. కళాశాల నుంచి మూడు రోజుల క్రితం విద్యార్థి గంగారం వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో తన ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన తల్లిదండ్రులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యార్థి మరణానికి గల కారణాలను అతని తల్లిదండ్రులను అడిగారు. ఎవరికి ఏమి చెప్పలేదని రోదిస్తూ జవాబు ఇవ్వడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# సమాచార శాఖలో మట్టి గణపతుల పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణ గాను మట్టి వినాయకుడిని పూజించాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి పేర్కొన్నారు. నేడు సమాచార పౌర సంబంధాల శాఖ ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీని కమీషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ, పండుగలను పర్యావరణ పరిరక్షణలో భాగంగా భాద్యతాయుతంగా జరుపుకోవాలని అన్నారు. జల వనరుల పరిరక్షణ కాలుష్య నివారణకు కేవలం మట్టి గణపతి మాత్రమే పూజించాలని పేర్కొన్నారు. ఈ ఉచిత గణపతి ప్రతిమల కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్ జగన్ తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# హామీలకు కట్టుబడి ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది..

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన ఎమ్మెల్యే జీఎస్సార్.. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, గత బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కేంద్ర బీజేపీ విధానాలపై స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనే సంకల్పంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రిపై బీఆర్ఎస్ నాయకులు ఇష్టారీతిన మాట్లాడటం తగదని హెచ్చరించారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు సహజమేనని, అయితే ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ సంస్కృతికి మంచిది కాదని అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి నిర్మాణాత్మక సూచనలు చేయాలని సూచించారు. బీఆర్ఎస్ గతంలో దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదని, దళిత బంధు విషయంలో అర్హులైన ప్రతి కుటుంబాన్ని మోసం చేశారని విమర్శించారు. తమ పాలనపై ఆత్మపరిశీలన చేసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
10 సెప్టెంబర్ 2026

# ఓటు వెనుక కోట్లు ప్రజాస్వామ్యం అమ్మకానికి ఉందా?

సంపాదకీయం

రాజకీయాలు ఒకప్పుడు త్యాగానికి మారుపేరు. ఇప్పుడు పెట్టుబడికి మారుపేరుగా మారుతున్నాయి. ఈ మార్పు ఒక్కరోజులో రాలేదు. ప్రజాసేవ క్రమంగా వెనక్కి వెళ్లి, డబ్బు రాజకీయాలను శాసించే స్థితికి చేరింది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రూ. 1,737.68 కోట్లు, కాంగ్రెస్ రూ. 584.65 కోట్లు ఖర్చు చేసినట్లు ఎన్నికల సంఘానికి లెక్కలు సమర్పించాయి. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. అభ్యర్థుల ఖర్చులు, రాష్ట్రస్థాయి ఖర్చులు, ప్రచారానికి సంబంధించిన ఇతర వ్యయాలను కలిపితే ఎన్నికల అసలు ఖర్చు మరింత భారీగా ఉంటుంది. ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. ఒక అభ్యర్థి ఎన్నికల్లో ఖర్చు చేయడానికి చట్టపరమైన పరిమితి ఉంది. కానీ అతన్ని గెలిపించేందుకు పార్టీ ఎంత ఖర్చు చేయాలనే విషయంలో అదే స్థాయిలో సమగ్ర పరిమితి లేదు. ఫలితంగా అభ్యర్థి ఖర్చుపై ఉన్న పరిమితి ఆచరణలో ఎంతవరకు పనిచేస్తుందన్న ప్రశ్న మిగులుతోంది.

డబ్బు పెరిగిన కొద్దీ రాజకీయాల్లోకి వచ్చే వారి స్వరూపం కూడా మారుతోంది. ఒకప్పుడు సమాజం కోసం పనిచేసినవారు రాజకీయాల్లోకి వచ్చేవారు. ఇప్పుడు పెద్ద వ్యాపారవేత్తలు, భారీ పెట్టుబడులు పెట్టగలవారు, వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు కూడా రాజకీయాల్లోకి రావడం పెరిగింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన 543 మంది ఎంపీలలో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు వారు స్వయంగా సమర్పించిన అఫిడవిట్లలో వెల్లడైంది. వీరిలో 170 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నట్లు తేలింది. బీజేపీ, కాంగ్రెస్ సహా దాదాపు అన్ని ప్రధాన పార్టీల్లోనూ ఇలాంటి పరిస్థితి కనిపిస్తోంది. క్రిమినల్ కేసు ఉండటం అంటే నేరం రుజువైనట్లు కాదు. విచారణ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరికీ నిర్దోషిత్వ హక్కు ఉంటుంది. కానీ చట్టాలు చేసే పార్లమెంటులో ఇంత పెద్ద సంఖ్యలో కేసులు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులు ఉండటం మాత్రం ప్రజాస్వామ్యం ఆలోచించాల్సిన తీవ్రమైన విషయం.

అసలు సమస్య డబ్బు ఎక్కడి నుంచి వస్తుందన్నదే. రాజకీయ పార్టీలకు వేల కోట్లు ఎందుకు అవసరం? ఎవరెంత విరాళం ఇస్తున్నారు? ఎందుకు ఇస్తున్నారు? ఎన్నికల్లో పెట్టిన డబ్బుకు ప్రతిఫలంగా తరువాత విధాన నిర్ణయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందా? ఈ ప్రశ్నలకు ప్రజలకు స్పష్టమైన సమాధానాలు దొరకాలి.

ఎన్నికలు ఖరీదైన కొద్దీ సామాన్యుడికి రాజకీయాల్లోకి వచ్చే అవకాశం తగ్గుతుంది. డబ్బు లేని నిజాయితీపరుడు ప్రజలకు సేవ చేయాలనుకున్నా ఎన్నికల్లో పోటీ చేయడం కష్టమవుతుంది. డబ్బు ఖర్చు చేయగలిగినవారికి మాత్రం అవకాశాలు పెరుగుతాయి. ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమైన మార్పు.

రాజకీయాల్లో డబ్బు ప్రభావాన్ని తగ్గించాలి. పార్టీల ఎన్నికల వ్యయానికి కూడా వాస్తవిక పరిమితులు ఉండాలి. విరాళాల మూలాలు పూర్తిగా పారదర్శకంగా ఉండాలి. అభ్యర్థుల ఆస్తులు, కేసులు, ఆర్థిక వ్యవహారాల వివరాలు ప్రతి ఓటరుకూ సులభంగా అందుబాటులో ఉండాలి. ఎన్నికలు గెలవడానికి కోట్లు అవసరమయ్యే వ్యవస్థలో ప్రజాసేవ ఎక్కడ మిగులుతుంది?

ఓటుకు విలువ ఒక్కటే.. ఒక వ్యక్తికి ఒక ఓటు. ఆ ఓటు విలువను కోట్లు నిర్ణయించే పరిస్థితి వస్తే, ప్రజాస్వామ్యం రూపంలో ఉన్నా దాని స్ఫూర్తి మాత్రం మిగలదు. ప్రజాస్వామ్యం ఓట్లతో నడవాలి.. కోట్లతో కాదు.

# ఐలమ్మ పోరాటం

## భూమి, శ్రమ, సమానత్వం కోసం కొనసాగుతున్న పోరాటం



సెప్టెంబర్ 10 చాకలి ఐలమ్మ వర్ధంతి. తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో ఆమెకు ప్రత్యేక స్థానం ఉంది. పేద చాకలి కుటుంబానికి చెందిన ఐలమ్మ భూమి హక్కు కోసం విసునూర్ దేశ్‌ముఖ్ భూస్వామ్య పెత్తనాన్ని ఎదిరించింది. ఆమె పోరాటం వ్యక్తిగత సమస్యగా ప్రారంభమైనా, తెలంగాణ గ్రామీణ సమాజంలో కొనసాగుతున్న భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకమైన ప్రజా పోరాటంతో ముడిపడింది. ఐలమ్మ పోరాటాన్ని అర్థం చేసుకోవాలంటే ఆ కాలం తెలంగాణ సామాజిక పరిస్థితులను పరిశీలించాలి. నిజాం పాలనలో రాజకీయ నిరంకుశత్వంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో దేశ్‌ముఖులు, జమీందార్లు, దొరలు భూమి, శ్రమ, సామాజిక అధికారంపై ఆధిపత్యం కొనసాగించారు. వెట్టిచాకిరీ, అక్రమ వసూళ్లు, బలవంతపు శ్రమ, కౌలు రైతులపై దోపిడీ విస్తృతంగా ఉండేవి.
భూమిని సాగు చేసేవారికి భద్రత లేదు. దొరల ఆదేశాలకు ప్రజలు లోబడాల్సి వచ్చేది. కులం ఆధారంగా వృత్తులు, సామాజిక స్థానాలు నిర్ణయించబడేవి. మహిళలకు స్వతంత్ర నిర్ణయాధికారం పరిమితంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో ఐలమ్మ తన కుటుంబం సాగు చేస్తున్న భూమిపై హక్కును వదులుకోవడానికి నిరాకరించింది. భూస్వామ్య ఒత్తిడిని ఎదుర్కొంది. కమ్యూనిస్టు కార్యకర్తలు, రైతాంగ ఉద్యమం ఆమెకు అండగా నిలిచారు. ఆమె సమస్య గ్రామ ప్రజల సమస్యగా మారింది. ఇక్కడే ఐలమ్మ పోరాటానికి చారిత్రక ప్రాధాన్యత ఏర్పడింది. అది కేవలం ఒక భూమి వివాదం కాదు. భూమిపై హక్కు ఎవరిది అనే ప్రశ్నను ముందుకు తెచ్చింది. శ్రమ చేసేవారికి భూమిపై హక్కు ఉండాలనే రైతాంగ డిమాండ్‌తో అది అనుసంధానమైంది. దొరల అధికారానికి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం కావడానికి అది ఒక సందర్భంగా మారింది. తెలంగాణ రైతాంగ పోరాటం కూడా ఇదే సామాజిక నేపథ్యంలో అభివృద్ధి చెందింది. వెట్టిచాకిరీ నిర్మూలన, అక్రమ వసూళ్ల వ్యతిరేకత, కౌలు రైతుల హక్కులు, భూమి పంపిణీ, దొరల పెత్తనానికి వ్యతిరేకత వంటి అంశాలు ప్రజా ఉద్యమంలో ముందుకు వచ్చాయి.
దొడ్డి కొమురయ్య అమరత్వం తర్వాత రైతాంగ పోరాటం మరింత విస్తరించింది. వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు ఉద్యమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రజా సంఘాలు ఏర్పడ్డాయి. భూస్వామ్య అధికారాన్ని సవాలు చేసే పరిస్థితి ఏర్పడింది. ఈ చరిత్రలో ఐలమ్మ పాత్రను కేవలం ఒక వీర మహిళ కథగా చూడటం సరైంది కాదు. ఆమె పోరాటం తెలంగాణ రైతాంగ ఉద్యమంలోని వర్గ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. నేడు తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను వివిధ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పునర్వ్యాఖ్యానించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సెప్టెంబర్ 17ను కేంద్రంగా చేసుకుని తెలంగాణ చరిత్రను కేవలం నిజాం వ్యతిరేక పోరాటంగా చూపించే ధోరణి పెరుగుతోంది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడారు. రజాకార్ల దాడులను ఎదుర్కొన్నారు. కానీ అదే సమయంలో దొరల భూస్వామ్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా కూడా పోరాడారు. ఈ రెండు అంశాలను విడదీసి చూస్తే తెలంగాణ రైతాంగ పోరాటం యొక్క సామాజిక, ఆర్థిక స్వభావం కనిపించదు.
తెలంగాణ పోరాటాన్ని మతతత్వ రాజకీయాల పరిధిలోకి తీసుకురావడం చరిత్రను వక్రీకరించడమే. రైతాంగ పోరాటం మతాల మధ్య పోరాటం కాదు. అది భూస్వామ్య దోపిడీకి, వెట్టిచాకిరీకి, నిరంకుశ అధికారానికి వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటం. ఐలమ్మను మతతత్వ రాజకీయాలకు ప్రతీకగా మార్చే ప్రయత్నాలు ఆమె పోరాట సారాన్ని తొలగిస్తాయి. ఆమెను ఒక కులానికి మాత్రమే పరిమితం చేయడం కూడా అదే విధంగా చరిత్రను సంకుచితం చేస్తుంది. ఐలమ్మ చాకలి కులానికి చెందిన మహిళ. కులవ్యవస్థలో శ్రమను చేసే కులాలకు తక్కువ సామాజిక స్థానం కేటాయించబడిన కాలంలో ఆమె భూమి హక్కు కోసం పోరాడింది. కుల ఆధిపత్యం, భూస్వామ్య ఆధిపత్యం గ్రామీణ సమాజంలో పరస్పరం అనుసంధానమై ఉన్న పరిస్థితులను ఆమె అనుభవించింది. అందువల్ల ఐలమ్మ చరిత్రలో కుల ప్రశ్నను విస్మరించలేం. అదే సమయంలో ఆమె పోరాటాన్ని కేవలం కుల పరిమితుల్లో కూడా చూడకూడదు. ఆమె పోరాటం శ్రమజీవుల హక్కులతో ముడిపడింది. భూమి, శ్రమ, సామాజిక గౌరవం అనే ప్రశ్నలు పరస్పరం సంబంధం కలిగి ఉన్నాయని ఆమె అనుభవం చూపించింది.
స్త్రీ విముక్తి కోణంలో కూడా ఐలమ్మ జీవితం ప్రాధాన్యత కలిగి ఉంది. కుటుంబం, కులం, పేదరికం, పితృస్వామ్యం వంటి పరిమితుల మధ్య ఉన్న మహిళ ప్రజా పోరాటంలో భాగస్వామి కావడం ఆ కాలంలో ముఖ్యమైన పరిణామం. తెలంగాణ రైతాంగ పోరాటంలో మహిళల భాగస్వామ్యం కూడా ఈ నేపథ్యంలో చూడాలి. స్త్రీ విముక్తిని కేవలం మహిళలపై హింసకు వ్యతిరేకతగా పరిమితం చేయలేం. ఆస్తిపై హక్కు, విద్య, ఉపాధి, సమాన వేతనం, రాజకీయ భాగస్వామ్యం, నిర్ణయాధికారం కూడా దాని భాగాలే. ఐలమ్మ పోరాటం ఈ విస్తృత సామాజిక ప్రశ్నలతో అనుసంధానించాల్సిన అవసరం ఉంది. నేటి పరిస్థితుల్లో ఐలమ్మ పోరాటం భూమి ప్రశ్నను మళ్లీ ముందుకు తెస్తోంది.
తెలంగాణలో భూమి ఇప్పటికీ ప్రధాన ఆర్థిక, సామాజిక సమస్య. వ్యవసాయ భూములపై రియల్ ఎస్టేట్ ఒత్తిడి పెరుగుతోంది. పరిశ్రమలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, పట్టణ విస్తరణ పేరుతో భూమి వినియోగంలో మార్పులు జరుగుతున్నాయి. భూమిని జీవనాధారంగా చూసే రైతుకు, దాన్ని పెట్టుబడి ఆస్తిగా చూసే మార్కెట్‌కు మధ్య విభేదం పెరుగుతోంది. కౌలు రైతుల సమస్యలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ కార్మికుల ఉపాధి అస్థిరంగా ఉంది. చిన్న, సన్నకారు రైతులు రుణాలు, ఉత్పత్తి ఖర్చులు, మార్కెట్ ధరల ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. భూమి ఉన్నా జీవన భద్రత లేని పరిస్థితులు అనేక కుటుంబాల్లో ఉన్నాయి. ఈ సమస్యలను ఐలమ్మ చరిత్రతో అనుసంధానించడం అవసరం. ఆమె కాలంలో భూస్వామి భూమిపై ఆధిపత్యం చెలాయించాడు. నేడు భూమి మార్కెట్, కార్పొరేట్ పెట్టుబడి, రియల్ ఎస్టేట్ ప్రభావం పెరిగింది. రూపాలు మారినా భూమి మీద నియంత్రణ ప్రశ్న మాత్రం కొనసాగుతోంది. అందువల్ల భూమి హక్కు, కౌలు రైతుల రక్షణ, వ్యవసాయ కార్మికుల జీవన భద్రత, మహిళలకు భూమి మరియు ఆస్తిపై సమాన హక్కు వంటి అంశాలు ప్రజా రాజకీయాల్లో కీలకంగా ఉండాలి.
ఐలమ్మను స్మరించడం అంటే ఆమె ఎదుర్కొన్న దోపిడీ రూపాలను నేటి సమాజంలో గుర్తించడం. దోపిడీ రూపాలు మారినప్పుడు ప్రజా పోరాటాల రూపాలు కూడా మారాలి. కానీ సమానత్వం, భూమి హక్కు, శ్రమ గౌరవం, సామాజిక న్యాయం వంటి ప్రాథమిక లక్ష్యాలు మారవు. ఇది నేటి కార్పొరేట్ ఆధిపత్యాన్ని కూడా ప్రశ్నిస్తుంది. వ్యవసాయం, భూమి, నీరు, విద్య, వైద్యం వంటి ప్రజా వనరులు క్రమంగా మార్కెట్ ఆధీనంలోకి వెళ్లే పరిస్థితిలో ప్రజా హక్కుల పరిరక్షణ ప్రధాన రాజకీయ ప్రశ్నగా మారుతోంది. ప్రభుత్వ రంగాన్ని బలహీనపరచడం, ప్రైవేటీకరణను విస్తరించడం, ప్రజా వనరులను ప్రైవేట్ పెట్టుబడికి అప్పగించడం సామాజిక అసమానతలను పెంచుతుంది. ఐలమ్మ పోరాటం మనకు ప్రజా హక్కులు పై నుంచి ప్రసాదించబడవని గుర్తుచేస్తుంది. వాటి కోసం ప్రజలు సంఘటితంగా పోరాడాలి.
చరిత్రను కేవలం స్మారక కార్యక్రమాలకు పరిమితం చేయడం వల్ల ఆ పోరాట స్ఫూర్తి ప్రజలకు చేరదు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జరిగే కార్యక్రమాలు ఆమె జీవితం, తెలంగాణ రైతాంగ పోరాటం, భూమి ప్రశ్న, కుల నిర్మూలన, స్త్రీ సమానత్వం, నేటి ప్రజా సమస్యలపై చర్చకు వేదికలుగా మారాలి. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఐలమ్మకు విగ్రహాలు ఏర్పాటు చేయడమే కాకుండా ఆమె పోరాటం లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.
భూమిలేని కుటుంబాలకు భూమి? కౌలు రైతులకు రక్షణ? వ్యవసాయ కార్మికులకు జీవన భద్రత? మహిళలకు ఆస్తిపై సమాన హక్కు? కుల వివక్షకు ముగింపు? ప్రజా విద్య, వైద్యం, ఉపాధికి హామీ? ఈ ప్రశ్నలు ఐలమ్మను స్మరించే ప్రతి సభలో ఉండాలి. చరిత్రను మతతత్వ ప్రయోజనాలకు వినియోగించే ప్రయత్నాలను కూడా ప్రజలు తిరస్కరించాలి. తెలంగాణ రైతాంగ పోరాటం ప్రజల సామాజిక, ఆర్థిక విముక్తి కోసం సాగిన ఉద్యమం. దాన్ని ఒక మతానికి వ్యతిరేకంగా మరో మతం పోరాటంగా మార్చడం దాని అసలు స్వభావాన్ని వక్రీకరించడం.
ఐలమ్మను కేవలం ఒక కుల నాయకురాలిగా చూపించడం కూడా సరైంది కాదు. ఆమె ఒక అణగారిన కులం నుంచి వచ్చిన మహిళగా భూస్వామ్య ఆధిపత్యాన్ని ఎదిరించింది. ఆమె పోరాటం కుల, వర్గ, లింగ అసమానతలకు వ్యతిరేకంగా సాగిన విస్తృత ప్రజా ఉద్యమంలో భాగం. ఐలమ్మ వారసత్వం విభజనలో కాదు, ప్రజా ఐక్యతలో ఉంది. రైతు, వ్యవసాయ కార్మికుడు, పారిశ్రామిక కార్మికుడు, దళితుడు, ఆదివాసీ, బహుజనుడు, మహిళ, విద్యార్థి, యువకుడు ప్రజల జీవన హక్కుల కోసం జరిగే పోరాటాలను ఐక్యం చేయడం నేటి అవసరం. ఆమెను స్మరించడం అంటే గతాన్ని పొగడటం కాదు. వర్తమానంలోని అన్యాయాలను గుర్తించడం. ప్రజల హక్కుల కోసం పోరాటాలను బలోపేతం చేయడం. చరిత్రను వక్రీకరించకుండా దాని సామాజిక సారాన్ని కొత్త తరాలకు అందించడం. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రైతాంగ పోరాటంలోని అమరవీరులందరినీ స్మరించుకుందాం. భూమి, శ్రమ, సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య హక్కుల కోసం సాగుతున్న పోరాటాలతో ఆ చరిత్రను అనుసంధానిద్దాం. ప్రజా హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగించడమే ఐలమ్మకు నిజమైన నివాళి.



**- మామిండ్ల రమేష్ రాజా**
రాష్ట్ర కార్యదర్శి
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ
సెల్ : 78932 30218


## ఆధునీకరిద్దాం!

మారాలి మారాలి
ఇంకా మారాలి!
అజ్ఞానం నుండి
మూఢత్వం నుండి
ఇంకా మారాలి!
మతవాదులు
మనువాదులు
చాలాకాలంగా
దేశాన్ని నాశనం
చేస్తూనే ఉన్నారు!
ఇప్పుడుకూడాఅదే!
'మత'మను'వులకు
సామ్రాజ్యవాదంతోడై
పెనం మీది నుండి
పొయ్యిలోకి తోసారు!
మానవజీవనాన్ని
కల్లోలం చేసి
సమాజాన్ని
విచ్ఛిన్నం చేస్తున్న
దురాత్ములు!
యోచించు యోచించు
లోతుగా యోచించు!
మంత్రతంత్రాలు
ఊహా మాత్రాలు!
కడు కుతంత్రాలు!
శాస్త్రజ్ఞులు శోధించి
సాధించిన యంత్రాలు
సమాజ నిర్మాణాలు!
జన సుఖజీవన
సౌభాగ్యాలు!

నా కవితను
విశ్లేషించే యంత్రం
శాస్త్రజ్ఞాన ఫలితం!
కృత్రిమ మేధో
వికాస పత్రం!
మంత్రాలుమాయలు
మతాలు మహిమలు
కేవలం ఊహలు!
మంత్రాలనొదిలేద్దాం!
యంత్రాలనునమ్ముదాం!
ప్రకృతి శోధకులు
మన సైన్టిస్టులు!
వర్షాలు కురిపించే
మేధో వికాస
సైద్ధాంతికులు!
మనజనంలోమాత్రం
కప్పలను ఊరేగించి
వర్షాలు కురిపించే
అజ్ఞానాంధకారం!
మతమాయాతాంత్రికులు!
యోచనతో మారండి!
యంత్రాన్ని ప్రోత్సహిద్దాం!
మతాన్ని మంత్రాన్ని
విడిచిపెడదాం!
సమాజాన్నిఆధునీకరిద్దాం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## సెగలు తగిలాయి..



ఐక్యోద్యమ కాక
సెగలు తగిలాయి..
పాలక ఎలగొడ్లకు
పీఠం కంపించింది..
అయినా నమ్మలేం
దగుల్బాజీ హామీల్ని..
గుప్పెంటూ మంట
చెలరేగవల్సే ఉండే..
పద్దెనిమిదికి అంతా
ఖుల్లం ఖుల్లా ఐతది..
ఝూట కూత లివన్నీ
కానే కాదని తేలాలే..
సూద్దాం సర్కారుల్లో
ఎంత నిజాయితుందో..
ఓట్లేసినోళ్ల భ్రమలెట్ల
తేటతెల్ల మైపోతయో..
పిడికిళ్లు సల్లిద్వరాదు
లాబీయింగ్ల మీదగాక..
పోరుదారులే దిక్కనే
సత్యం మదిలుండాలె..

డా. ఇక్బాల్ పాషా
9440775732

# భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరీ విముక్తి కోసం

భూమి కోసం... భుక్తి కోసం.....వెట్టి చాకిరీ విముక్తి కోసం... సాగిన మట్టి మనుషుల గాధ,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం,ఒక గొప్ప చారిత్రక విజయం
"సెప్టెంబర్ 17ను కేవలం ఒక సంస్థానం భారతదేశంలో విలీనమైన తేదీగా చూడటం తెలంగాణ చరిత్రను అసంపూర్ణంగా చూడటమే. ఆ తేదీ వెనుక వేలాది మంది త్యాగం ఉంది.రైతులు, కూలీలు, మహిళలు, పేదలు తమ భూమి, తమ గౌరవం, తమ స్వేచ్ఛ కోసం చేసిన మహత్తర పోరాటం ఉంది."ఇది మట్టిమనుషుల గాధ.
తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 ఒక సాధారణ తేదీ కాదు. అది ఒక రాజు అధికారానికి ముగింపు పలికిన రోజు మాత్రమే కాదు. శతాబ్దాలుగా కొనసాగిన భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరీ, అక్రమ వసూళ్లు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ గ్రామీణ ప్రజలు తిరుగుబాటు చేసిన చారిత్రక దశకు ప్రతీక. ప్రత్యేకంగా 1946–51 మధ్య సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారతదేశ స్వాతంత్ర్యానంతర చరిత్రలోనే అత్యంత గొప్ప రైతాంగ ఉద్యమాలలో ఒకటి. ఈ పోరాటం కేవలం నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన రాజకీయ పోరాటం కాదు. భూమి ఎవరిది? ఈ భూమి దున్నేవాడిదేనా? వెట్టి చాకిరీ ఎందుకు చేయాలి? దొరల పెత్తనం ఎందుకు భరించాలి? అనే ప్రాథమిక సామాజిక–ఆర్థిక ప్రశ్నలను ప్రజల ముందుకు తీసుకొచ్చిన మహత్తర ఉద్యమం.
1940లలో తెలంగాణ గ్రామీణ సమాజాన్ని అర్థం చేసుకోకుండా సెప్టెంబర్ 17 చరిత్రను అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.భారత దేశంలో ఉన్న565 సంస్థానాల్లో హైదరాబాద్ అతిపెద్ద సంస్థానం. హైదరాబాద్ సంస్థానం నిజాం పాలన కొనసాగుతున్న సమయంలో తెలంగాణలో విస్తారమైన భూభాగం జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, దొరలు, భూస్వాముల ఆధిపత్యంలో ఉండేది. గ్రామీణ పేదలు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్ర దోపిడీకి గురయ్యేవారు. రైతు పంట పండించేవాడు. కానీ పంటపై హక్కు అతనికి ఉండేది కాదు. భూమిని దున్నేది రైతు. కానీ భూమిపై అధికారం దొరది. కష్టపడేది వ్యవసాయ కూలీ. కానీ అతనికి కనీస గౌరవం కూడా ఉండేది కాదు.
ఇదే సమయంలో వెట్టి చాకిరీ గ్రామీణ జీవితంలో ఒక దారుణమైన వ్యవస్థగా ఉండేది. భూస్వామి ఇంటి పనులు, వ్యవసాయ పనులు, రవాణా, ఇతర సేవలను పేద ప్రజలు ఉచితంగా చేయాల్సి వచ్చేది.అదనంగా అక్రమ పన్నులు, బలవంతపు వసూళ్లు, కౌలు భారాలు, భూస్వాముల దౌర్జన్యాలు ప్రజల జీవితాలను నాశనం చేసేవి.అందుకే తెలంగాణలో అసంతృప్తి క్రమంగా తిరుగుబాటుగా మారింది.
ఆంధ్ర మహాసభ నుంచి రైతాంగ పోరాటం వరకు, తెలంగాణలో ప్రజా చైతన్యం పెరిగింది. అది ఒక్కరోజులో పెరగలేదు.
1930లలో ఏర్పడిన ఆంధ్ర మహాసభ ప్రారంభంలో భాష, విద్య, సామాజిక సంస్కరణల వంటి అంశాలను ముందుకు తీసుకొచ్చింది. తరువాత కమ్యూనిస్టు పార్టీ భావజాల ప్రభావంతో అది గ్రామీణ పేదల సమస్యలను ప్రధానంగా తీసుకోవడం ప్రారంభించింది.
భూమి సమస్య, వెట్టి నిర్మూలన, అధిక కౌలు తగ్గింపు, అక్రమ వసూళ్లకు వ్యతిరేకత వంటి అంశాలపై గ్రామాల్లో, "గ్రామ సంఘాలు" ఏర్పడ్డాయి. క్రమంగా రైతులు తమ సమస్యలను వ్యక్తిగత సమస్యలుగా కాకుండా సామూహిక సమస్యలుగా చూడటం ప్రారంభించారు.
"దొరను ఎదిరిస్తే ఏమవుతుంది?" అనే భయం స్థానంలో "మనమంతా కలిస్తే దొరను ఎందుకు ఎదిరించలేం?"
అనే ప్రశ్న పుట్టింది.అక్కడి నుంచే రైతాంగ ఉద్యమం మరింత తీవ్ర రూపం దాల్చింది.
1946 – పోరాటానికి నాంది పలికింది.
1946లో నల్గొండ జిల్లాలోని విసునూరు దేశ్‌ముఖ్ ప్రాంతంలో దొడ్డి కొమురయ్య హత్య తెలంగాణ రైతాంగ పోరాటానికి కీలక మలుపుగా నిలిచింది. దొడ్డి కొమురయ్య మరణం గ్రామీణ ప్రజలలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. భూస్వామ్య దౌర్జన్యానికి వ్యతిరేకంగా ప్రజలు మరింత ధైర్యంగా ముందుకు వచ్చారు.
ఇక పోరాటం ఒక్క గ్రామానికో, ఒక్క దొరకు వ్యతిరేకంగానో పరిమితం కాలేదు. భూమి కోసం – భుక్తి కోసం– విముక్తి కోసం తెలంగాణ గ్రామాలు ఉద్యమ కేంద్రాలుగా మారాయి. రైతాంగ సాయుధ పోరాటం ఎందుకు అవసరమైంది? ప్రజలు మొదట శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడారు. కానీ భూస్వామ్య దళాలు, నిజాం ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు, రజాకార్ల దాడులు తీవ్రతరమయ్యాయి. ప్రజలపై హింస పెరిగింది. గ్రామాలను భయభ్రాంతులకు గురిచేయడం, నాయకులను అరెస్టు చేయడం, రైతులను కొట్టడం, మహిళలను అవమానించడం వంటి దౌర్జన్యాలకు ప్రజలు గురయ్యారు.
ఈ పరిస్థితుల్లో రైతాంగ ఉద్యమం ఆత్మరక్షణ కోసం సాయుధ ప్రతిఘటన రూపాన్ని సంతరించుకుంది. గ్రామాల్లో ప్రజా దళాలు ఏర్పడ్డాయి. గ్రామ రక్షణ కమిటీలు ఏర్పడ్డాయి. దొరల దౌర్జన్యానికి ప్రజలు సమిష్టిగా ప్రతిఘటించడం ప్రారంభించారు. "దున్నేవాడికే భూమి" – పోరాటం యొక్క ప్రధాన నినాదం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం యొక్క అత్యంత గొప్ప చారిత్రక అంశం భూమి ప్రశ్నను కేంద్రంగా నిలపడం.
భూమిని సాగు చేసేది రైతు.
కానీ భూమి హక్కు భూస్వామికి.
ఈ వైరుధ్యాన్ని రైతాంగ ఉద్యమం ప్రశ్నించింది.



భూస్వాముల ఆధీనంలోని భూములను స్వాధీనం చేసుకుని పేద రైతులు, కౌలు రైతులకు సాగు చేయించే ప్రయత్నాలు జరిగాయి.
కొన్ని ప్రాంతాల్లో ప్రజా కమిటీలు ఏర్పడి గ్రామ పరిపాలనలో కొత్త విధానాలను అమలు చేశాయి.ఇది కేవలం భూమి పంచడం కాదు.గ్రామీణ అధికార సంబంధాలను మార్చే ప్రయత్నం.దొర కేంద్రంగా ఉన్న గ్రామ సమాజం స్థానంలో ప్రజలను కేంద్రంగా ఉంచే ప్రయత్నం.

### వెట్టి చాకిరీపై తిరుగుబాటు

తెలంగాణ రైతాంగ పోరాటం సాధించిన మరో గొప్ప విజయం వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడం. "పేదవాడు పుట్టింది దొర కోసం కాదు" అనే భావన గ్రామాల్లో బలపడింది. వెట్టి చేయకూడదని ప్రజలు నిర్ణయించుకున్నారు. దొర ఇంటికి ఉచితంగా పనిచేయడం, ఉచితంగా సరుకులు అందించడం, బలవంతపు సేవలు చేయడం వంటి పద్ధతులకు వ్యతిరేకంగా ప్రజలు నిలబడ్డారు. ఇది కేవలం ఆర్థిక పోరాటం కాదు.
మనిషి గౌరవం కోసం జరిగిన పోరాటం.
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మహిళల పాత్రను ప్రత్యేకంగా గుర్తించాలి. చాకలి ఐలమ్మ వంటి మహిళలు భూస్వామ్య దోపిడీకి ఎదురు నిలిచారు. చాకలి ఐలమ్మ పోరాటం ఒక మహిళ తన సాగు హక్కును కాపాడుకోవడం నుంచి ప్రారంభమై, విస్తృత రైతాంగ ప్రతిఘటనకు ప్రతీకగా మారింది. అనేక మంది మహిళలు ప్రజా దళాలకు సహకరించారు. సమాచారాన్ని చేరవేశారు. ఆహారం అందించారు. రహస్య కార్యకలాపాల్లో పాల్గొన్నారు. కొందరు ప్రత్యక్షంగా సాయుధ దళాల్లో కూడా పనిచేశారు.
స్త్రీలపై దొరల పెత్తనానికి వ్యతిరేకంగా కూడా ఈ పోరాటం ఒక సామాజిక తిరుగుబాటుగా మారింది.

### రజాకార్ల దౌర్జన్యాలు - ప్రజల ప్రతిఘటన

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం వెంటనే భారత యూనియన్‌లో విలీనం కాలేదు.నిజాం పాలన కొనసాగింది. ఇదే సమయంలో రజాకార్ దళాల హింస పెరిగింది. గ్రామీణ ప్రజలపై దాడులు, భయపెట్టడం, హత్యలు, ఆస్తుల విధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో తెలంగాణలోని ప్రజా ప్రతిఘటన మరింత తీవ్రరూపం దాల్చింది. అయితే తెలంగాణ రైతాంగ పోరాటాన్ని కేవలం "రజాకార్లకు వ్యతిరేక పోరాటం"గా మాత్రమే పరిమితం చేయడం చారిత్రకంగా సరైనది కాదు. ఎందుకంటే ఈ పోరాటానికి మూలకారణం భూస్వామ్య దోపిడీ, వెట్టి, భూమి సమస్య, సామాజిక అణచివేత. రజాకార్ వ్యతిరేక పోరాటం ఆ కాలంలోని రాజకీయ–సైనిక పరిస్థితిలో ఒక ముఖ్యమైన భాగం మాత్రమే.
1947 ఆగస్టు 15 – స్వాతంత్ర్యం వచ్చింది, కానీ తెలంగాణకు?
1947 ఆగస్టు 15న భారతదేశం బ్రిటిష్ వలస పలన నుంచి స్వాతంత్ర్యం పొందింది. కానీ హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం పాలనలోనే కొనసాగింది. అందువల్ల తెలంగాణ ప్రజలకు ఒక ప్రశ్న ఎదురైంది: "దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. మరి మన గ్రామానికి స్వాతంత్ర్యం ఎప్పుడు?"
ఈ ప్రశ్నే తెలంగాణ రైతాంగ ఉద్యమానికి మరింత రాజకీయ బలాన్ని ఇచ్చింది. భారతదేశం స్వతంత్ర దేశంగా మారినప్పటికీ గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ కొనసాగితే ప్రజలకు ఆ స్వాతంత్ర్యం పూర్తి స్వాతంత్ర్యంగా అనిపించలేదు. 1948 సెప్టెంబర్‌లో భారత ప్రభుత్వం పోలీస్ యాక్షన్ పేరుతో హైదరాబాద్ సంస్థానంపై సైనిక చర్య చేపట్టింది.
1948 సెప్టెంబర్ 13న ప్రారంభమైన ఈ సైనిక చర్య కొద్ది రోజుల్లోనే నిజాం పాలన ముగిసే పరిస్థితికి దారితీసింది. 1948 సెప్టెంబర్ 17న నిజాం భారత యూనియన్‌కు లొంగిపోవడం/హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమయ్యే ప్రక్రియలో కీలక ఘట్టం జరిగింది.
అందుకే సెప్టెంబర్ 17 చరిత్రలో ముఖ్యమైన తేదీ.
కానీ ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి:
సెప్టెంబర్ 17తో తెలంగాణ రైతాంగ పోరాటం ముగియలేదు.



వ్యాస రచన
మాలోతు సాగర్
సెల్ నెంబర్ 7013805411



### ఇదీ వసూళ్ల లెక్క!

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పలు స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరవుతు న్నట్లు మహిళలు చెబుతున్నారు. వ్యాపారాలు ప్రారంభి ంచుకోవడానికి, చిన్నచిన్న ఉపాధి కార్యక్రమాలు చేపట్ట డానికి, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచు కోవడానికి ఈ రుణాలు ఎంతో ఉపయోగపడతాయని భావిస్తున్న మహిళలకు.. రుణం మంజూరైన తర్వాత కొత్త సమస్య ఎదురవుతోందని ఆరోపిస్తున్నారు. మంజూరైన ప్రతి రూ.లక్షకు రూ.1,000 చొప్పున ఇవ్వాలని కొందరు బుక్ కీపర్లు, ఆర్పీలు డిమాండ్ చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

అంటే రూ.10 లక్షల రుణం మంజూరైతే రూ.10 వేలు, రూ.15 లక్షలు మంజూరైతే రూ.15 వేలు, రూ.20 లక్షలు మంజూరైతే రూ.20 వేలు చెల్లించాల్సి వస్తోందని వారు ఆరోపిస్తున్నారు. రుణం మొత్తం మహిళల ఖాతాల్లో జమయ్యేలోపే ఈ డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారని, కొన్నిచోట్ల సంఘంలోని సభ్యులందరి నుంచి డబ్బులు సమీకరించి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని మహిళలు వాపోతున్నారు.

# లక్షకు వెయ్యి..
## ఇదీ ఆర్పీల 'వసూళ్ల' లెక్క

- డ్వాక్రా రుణాలపై ఆర్పీలు, బుక్ కీపర్ల అక్రమ దందా
- రుణంపదైనా.. కమిషన్ ఇవ్వాల్సిందే..
- డ్వాక్రా మహిళలపై ఆర్పీల ఒత్తిళ్లు
- ఇవ్వకపోతే రుణ ప్రక్రియ నిలిపివేస్తామని బెదిరింపులు

**రంగారెడ్డి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళలు ఆర్థికంగా ఎదగాలని, స్వయం ఉపాధి ద్వారా తమ కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు రుణాలను అందిస్తోంది. అయితే మహిళలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన ఈ రుణాల ప్రక్రియలోనే కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పలు డ్వాక్రా సంఘాల మహిళలు.. రుణం మంజూరు కావాలన్నా, రుణ ప్రక్రియ ముందుకు సాగాలన్నా కొందరు ఆర్పీలు, బుక్ కీపర్లకు డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణం మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాల్సి ఉండగా, రుణం చేతికి రాకముందే 'కమిషన్' పేరుతో కొంత మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోందని మహిళలు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేస్తే భవిష్యత్తులో రుణాలు రావని, సంఘాలకు ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరిస్తున్నారనే ఆరోపణలతో బాధిత మహిళలు తమ సమస్యను బహిరంగంగా చెప్పేందుకు కూడా వెనుకాడుతున్న పరిస్థితి నెలకొంది.

**జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు?**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో వినిపిస్తున్న ఈ ఆరోపణలు కేవలం ఒక ప్రాంతానికే పరిమితమా? లేక రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మరికొన్ని ప్రాంతాల్లోనూ ఇలాంటి వసూళ్లు జరుగుతు న్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాలకు సంబంధించిన రికార్డులు, బ్యాంకు రుణ ప్రక్రియ, సంఘాల సమావేశాలు, రుణాల మంజూరు వివరాలను పర్యవేక్షించాల్సిన సిబ్బందిపైనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి రుణానికి నిర్ణీత రుసుము ఉన్నట్లుగా వసూళ్లు జరుగుతున్నాయా? ఏయే సంఘాల నుంచి ఎంత మొత్తంలో డబ్బులు తీసుకున్నారు? ఆ డబ్బులు ఎక్కడికి వెళ్లాయి? ఇందులో ఆర్పీలు, బుక్ కీపర్లతో పాటు మరెవరైనా ఉన్నారా? అనే అంశాలను అధికారులు పరిశీలిస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని మహిళా సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని వారు కోరుతున్నారు.

### రుణం కావాలంటే 'కమిషన్' తప్పదు

బ్యాంకు రుణం అనేది ప్రభుత్వ పథకం కింద మహిళా సంఘాలకు అందుతున్న ఆర్థిక సహాయం. ఈ రుణం పొందేందుకు బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో కొందరు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ.. రుణం మంజూరు చేయడం, పత్రాలు సిద్ధం చేయడం, బ్యాంకు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలను అడ్డుపెట్టుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాము అడిగిన మొత్తాన్ని చెల్లించకపోతే ఫైల్ ముందుకు వెళ్లదని, రుణం ఆలస్యం అవుతుందని చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మహిళలు డబ్బులు సమకూర్చుకుంటున్నారని బాధితులు చెబుతున్నారు. ఒక్కో సంఘానికి లక్షల్లో రుణం వస్తుండటంతో.. ప్రతి రుణంపై కొంత మొత్తం వసూలు చేస్తే పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారుతున్నదనే ఆరోపణలు ఉన్నాయి. 'కమిషన్' పేరుతో అడిగిన డబ్బులు ఇవ్వడానికి ఎవరైనా నిరాకరిస్తే.. వారి సంఘానికి సంబంధించిన రుణ ప్రక్రియను నిలిపివేస్తామని, ఫైల్‌ను ముందుకు పంపబోమని హెచ్చరిస్తున్నారని కొందరు మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై మహిళలు ప్రశ్నించినప్పుడు.. తాము మాత్రమే డబ్బులు తీసుకోవడం లేదని, పైస్థాయి అధికారులకు కూడా వాటాలు ఇవ్వాల్సి ఉంటుందని కొందరు బుక్ కీపర్లు, ఆర్పీలు చెబుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేస్తే తమ సంఘానికి ఇబ్బందులు వస్తాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## జీవో నెంబర్ 97ను భేషరతుగా రద్దు చేయండి
### ప్రభుత్వానికి పాలిటెక్నిక్ విద్యార్థుల అల్టిమేట్




**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 97 ను భేషరతుగా రద్దు చేయాలని కోరుతూ బుధవారం పాలిటెక్నిక్ విద్యార్థులు రాయదుర్గం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వివరాలలోకి వెళితే తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన జీవో 97 కింద పాలిటెక్నిక్ కళాశాలలను, సాంకేతిక విద్యా విభాగాన్ని 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' పరిధిలోకి మరియు కొత్తగా ఏర్పాటు చేసిన 'శక్తి' విభాగంలోకి విలీనం చేయాలనే నిర్ణయాన్ని విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం విధితమే. జీవో నెంబర్ 97 ద్వారా ప్రభుత్వం తీసుకునే నిర్ణయంవల్ల తమ డిప్లొమా కోర్సులకు ప్రాధాన్యత తగ్గుతుందని, ఉన్నత చదువులకు, భవిష్యత్తు ఉద్యోగావకాశాలకు ఆటంకం కలుగుతుందని భావించిన విద్యార్థులు రాయదుర్గంవద్ద ఏకంగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అయితే విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేపట్టడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ క్రమంలో పోలీసులు నిరసనకారులను అడ్డుకుని, పలువురిని అదుపులోకి తీసుకుని ఈడ్చుకెళ్లడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అయితే రోడ్లపై ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు పరిస్థితి అంతకంతకు తీవ్రంగా మారుతుండడంతో భారీగా తరలివచ్చిన పోలీసులు ఒక్కసారిగా విద్యార్థులపై పడి చదరగొట్టడంతోపాటు ఎక్కడికక్కడ లాగి పడేస్తూ చదరగొట్టే ప్రయత్నం చేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. దీనికి తోడు విద్యార్థినుల పట్ల మగ పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తూ వారిని అక్కడ నుంచి పంపి వేసే క్రమంలో ఎక్కడపడితే అక్కడ బలవంతంగా చేతులు వేసి కర్కషంగా వ్యవహరించినట్లు విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను అక్కడినుంచి పంపించి వేసే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు వారిని అత్యంత హేయంగా అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి పోలీస్స్టేషన్లకు తరలించినట్లు పలువురు విద్యార్థులు వాపోయారు. అయితే ఘటనా స్థలంలో పోలీసులు వ్యవహరించిన తీరుపట్ల తీవ్ర నిరసన వ్యక్తం అవుతుండడం, స్థానికుల నుండి సైతం విమర్శలు తలెత్తడంతో మరోసారి పోలీసులు వివాదంలో చిక్కుకోవడం జరిగింది.

## తమ భూములు తమకు తిరిగి ఇవ్వాలని పొద్దుటూరు రైతుల ర్యాలీ



**శంకర్ పల్లి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** తమ భూములు తమకు తిరిగి ఇవ్వాలని పొద్దుటూరు గ్రామానికి చెందిన రైతులు ర్యాలీగా తహసిల్దార్ కార్యాలయానికి వచ్చి డిప్యూటీ తహ సిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే శంకర్పల్లి మండలం పొద్దుటూరు గ్రామంలోని సర్వే నంబర్లు 240, 241, 249 లో 24-39 గుశీట ల భూమి ఉంది. తమ పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్నాం. భూములను కొందరు వ్యక్తులు తమను మోసం చేసి భూములపై అక్రమంగా ఆధిపత్యం సాధించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపడుతున్నారని రైతులు అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు జీవనాధారమైన భూములను తిరిగి తమకు అప్పగించాలని వారు కోరారు.భూములకు సంబంధించిన వ్యవహారంపై జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ వద్ద ఫిర్యాదు పెండింగ్లో ఉందని సంబంధిత కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు పేరా వారిగా నివేదిక సమర్పించాలని కమిషన్ ఆదేశించినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## పిల్లలకు సెల్‌ఫోన్‌పై నియంత్రణ కాదు.. నిషేధం అవసరం
### టిపిఎస్కే, బాలల హక్కుల ప్రజా వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



**ముషీరాబాద్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి):** 16 ఏళ్లలోపు పిల్లలకు సెల్‌ఫోన్, సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధిస్తూ శాసనసభలో చట్టం చేయాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యం లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఏ మేరకు బుధవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సెల్‌ఫోన్ అధిక వినియోగం వల్ల పిల్లల్లో ఏకాగ్రత లోపం, నిద్రలేమి, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్లపై పర్యవేక్షణ లేకపోతే పిల్లలు ఆన్‌లైన్ బెట్టింగ్, అశ్లీల, హింసాత్మక కంటెంట్‌తో పాటు వివిధ వ్యసనాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణలో 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం విధించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.
2026-27 విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో స్మార్ట్‌ఫోన్లను పూర్తిగా నిషేధించాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్, హానికర కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. నవంబర్ 11న రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించి ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల స్క్రీన్ టైమ్‌ను పర్యవేక్షించాలని, ఉపాధ్యాయులు నైతిక విలువలను పెంపొందించాలని సూచించారు.

## గణేష్ మండపాల నిర్వాహకులు నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించాలి

- మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి
- ట్రాఫిక్, విద్యుత్, అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి
- రాత్రి 10 తర్వాత లౌడ్‌స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదు
- నిమజ్జనంలో పోలీసుల సూచనలు పాటించాలి




**మొయినాబాద్, సెప్టెంబర్ 09 (జనం సాక్షి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ మండపాల నిర్వాహకులకు సూచించారు. మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని, ఏర్పాటు చేసే ప్రదేశం, విగ్రహం ఎత్తు, నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర వివరాలను పోలీస్ ప్రోటోకాల్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖ అనుమతితో కనెక్షన్ తీసుకోవడంతో పాటు నాణ్యమైన వైరింగ్, ఫైర్ సేఫ్టీ పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, అగ్నిమాపక సిలిండర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.
మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కమిటీ సభ్యుల వివరాలు ప్రదర్శించాలని, 24 గంటలు వాలంటీర్ అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిమజ్జన సమయంలో పోలీసులు సూచించిన మార్గాలు, సమయాలను పాటించాలని, చిన్నారులను నిమజ్జనానికి పంపకుండా పెద్దలు వెంట ఉండాలని తెలిపారు. మండపాల వద్ద మద్యం, మత్తు పదార్థాలు, పేకాట, అసభ్యకర నృత్యాలు, వివాదాస్పద ప్రసంగాలు, ఇతర మతాలను కించపరిచే వ్యాఖ్యలు, విద్వేషాలకు దారితీసే పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదని డీసీపీ హెచ్చరించారు. రహదారులను నిర్బంధించేలా మండపాలు ఏర్పాటు చేయకూడదని, అనుమతులు లేకుండా విరాళాలు వసూలు చేయరాదన్నారు. సోషల్ మీడియాలో వదంతులు, వివాదాస్పద సమాచారాన్ని ప్రచారం చేయవద్దని సూచించారు. ప్రతి మండపంలో పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఉత్సవాలకు చేవెళ్ల జోన్ పోలీసులు పూర్తి బందోబస్తు, సహకారం అందిస్తారని, నిర్వాహకులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ సీఐ వై.మల్లికార్జున్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## అత్యవసర వేళ సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు
### ప్రాణం నిలిపే విద్యపై సీపీఆర్ అవగాహన

**తాండూరు సెప్టెంబర్ 9(జనంసాక్షి) :** కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాండూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కు సిపిఆర్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నిపుణులు డాక్టర్ అనిల్ కుమార్ సమక్షంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అత్యవసర సమయంలో ఒక మనిషి ప్రాణాన్ని కాపాడేందుకు సిపిఆర్ ఎంత ముఖ్యమో, సిపిఆర్ ఎలా చేయాలి, ఎప్పుడు చేయాలి అనే విషయాలపై విద్యార్థు లకు ప్రాక్టికల్‌గా వివరించారు.ఈ సందర్భంగా కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ కంజర్ల విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సిపిఆర్ వంటి ప్రాథమిక ప్రాణ రక్షణ విద్యను నేర్చు కోవడం చాలా అవసరం. అత్యవసర పరిస్థితు ల్లో డాక్టర్ వచ్చేలోపు మనం చేసే చిన్న ప్రయత్నం ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతు ంది. అందుకే విద్యార్థుల్లో ఈ అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చే శాం" అని అన్నారు.భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాప కులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్ఎంపీసీలో ప్రజాకవి కాళోజీ జయంతి వేడుకలు

- ప్రజల పక్షాన నిలిచిన కాళోజీ గొంతుక ఎప్పటికీ స్ఫూర్తిదాయకం
- సామాజిక అన్యాయంపై కలంతో పోరాడిన ప్రజాకవి
- కాళోజీ ఆశయాలు పోలీసులకు మార్గదర్శకం కావాలి



**గోదావరిఖని, సెప్టెంబర్ 09 (జనం సాక్షి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ యాస, భాషలో సామాజిక అంశాలను తన రచనల ద్వారా ప్రజలకు చేరువ చేసి చైతన్యం కలిగించిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని సీపీ కొనియాడారు. సామాన్యుడి భాషలో అతడి జీవితం, సమస్యలను ప్రతిబింబిస్తూ సామాజిక అన్యాయం, అసమానతలు, దోపిడీ, నిరంకుశత్వాన్ని కాళోజీ తన రచనలతో ప్రశ్నించారని తెలిపారు. 'నా గొడవ' వంటి రచనలు ప్రజా చైతన్యానికి ప్రతీకలుగా నిలిచాయని, సాహిత్యం, ప్రజాసేవకు ఆయన చేసిన కృషికి ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో సత్కరించిందని పేర్కొన్నారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల సమస్యలను ఓపికగా వినడం, బాధితులకు న్యాయం చేయడం, బలహీన వర్గాలకు అండగా నిలవడం, విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధతతో పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళి అని సీపీ అన్నారు. ప్రజల కోసం ప్రశ్నించిన కాళోజీ కలం స్ఫూర్తిగా, ప్రజల భద్రత కోసం పనిచేసే పోలీసు యూనిఫాం నమ్మకానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత చేరువగా, బాధ్యతాయుతంగా, మానవీయ దృక్పథంతో పోలీసింగ్ అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ కె.శ్రీనివాస్, ఏసీపీలు నాగేంద్రగౌడ్, ప్రతాప్, ఏవో శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దళితుల నిరసన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం హేయమైన చర్య
### కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి పూజల హరికృష్ణ



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 09 (జనం సాక్షి):** దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తే ఎంతమాత్రం సహించేది లేదని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ హెచ్చరించారు. ఎర్రవల్లి వద్ద దళిత సోదరులు తమ సంప్రదాయ వృత్తిలో భాగంగా డప్పులు కొడుతూ నిరసన తెలిపిన ప్రాంతాన్ని పసుపు, బండారీ నీళ్లతో శుద్ధి చేయడం తీవ్రంగా ఖండించదగిన, దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించే చర్య అని ఆయన మండిపడ్డారు. ఈ ఘటనపై పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దళితులు నిరసన తెలిపిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని, నిరసనల్లో డప్పులు వాయించడం కొత్తేమీ కాదని పేర్కొన్నారు. దళితులు నడిచిన, నిరసన తెలిపిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం అంటే దళితులను మాత్రమే కాకుండా యావత్ సమాజాన్ని అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో దళితులకు సముచిత గౌరవం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాపాలనలో దళితులకు సముచిత గౌరవం, ప్రాధాన్యత లభిస్తోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. దళిత నాయకుడిని ఉపముఖ్యమంత్రి స్థానంలో నియమించడంతో పాటు శాసనసభ స్పీకర్ పదవి, కేబినెట్‌లోనూ దళితులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించామని పేర్కొన్నారు. ఈ రాష్టని 10 సంవత్సరాలు పాలించి మరక చేసిందుకు మీ పై ఎం నీళు చల్లాలి అని అన్నారు. హరీశ్ రావు, కేటీఆర్ సోషల్ మీడియా అడ్డు పెట్టుకొని ఇస్తాం ఇచ్చినట్లు వేవరస్తే తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ క్షమాపణ చెప్పాలని, దళితుల సోదరులను కేవలం ఓట్ల గురుచి వాడుకుంటు వారిని అవమాన పరుస్తూ ఉన్నారు అని అన్నారు. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఘటనలపై దళితులపై వివక్ష చూపే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పూజల హరికృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు, బొమ్మల యాదగిరి, మైనారిటీ కలియుముద్దీన్ అహ్మద్,దాస అంజన్న,డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి, మైనారటీ జిల్లా అధ్యక్షులు రషద్, ఎర్ర మహేందర్, వాహబ్,గుర్రం అంజిరెడ్డి,రిక్కల మహేందర్ రెడ్డి,మేరుగు రాజు,బొమ్మల ప్రవీణ్, నరేష్,సంతోష,మైనార్టి జిల్లా నాయకులు,దళిత నాయకులు, నియోజకవర్గ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఇందుర్తిలో ఘనంగా ప్రారంభమైన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు
- పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న 250మంది క్రీడాకారులు



**చిగురుమామిడి సెప్టెంబర్ 9(జనంసాక్షి):** విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా,విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,మండల విద్యాధికారి చింతల జయప్రదలు పిలుపునిచ్చారు.బుధవారం చిగురుమామిడి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పాఠశాలల క్రీడా సమాఖ్య క్రీడలను ఇందుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మండల స్థాయి క్రీడలే పునాది అని,ఇక్కడి నుంచి ప్రతిభ చాటి జిల్లా,రాష్ట్ర స్థాయిల మీదుగా జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల వల్ల చదువుకు అవసరమైన ఏకాగ్రత, ఆలోచనా శక్తి, మానసిక ఉత్సాహం,శారీరక దారుఢ్యం లభిస్తాయని పేర్కొన్నారు.ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని, గెలుపు ఒక్కటే ముఖ్యం కాదని, పోటీలలో పాల్గొనడమే ఒక విజయమని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం వివిధ పాఠశాలల నుంచి హాజరైన దాదాపు 250మంది క్రీడాకారులకు అండర్-14, అండర్-17 బాలికల విభాగంలో ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాలలో ఎంపిక పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇందుర్తి గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్, ఉపసర్పంచ్ చింతపుల అనిల్ కుమార్, వార్డు సభ్యులు లక్ష్మి, పూజ, కిరణ్, అనిల్, బాబు, ఉమర్,అలాగే చిగురుమామిడి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఇర్షాద్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, లక్ష్మణ్ రావు, మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనకం సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందె సురేష్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. ఎండిపోతున్న పంటలు

- తీవ్ర విద్యుత్ కోతలతో రైతులకు కష్టాలు
- అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు
- రంగనాయకసాగర్ నింపి సాగునీరు విడుదల చేయాలి
- నంగనూరును కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్





**నంగనూరు, సెప్టెంబర్ 8 (జనం సాక్షి):** నంగనూరు మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, విద్యుత్ కోతలు, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి సాగు చేసిన పంటలకు చివరి దశలో నీరు అందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. రోజుకు 8 నుంచి 10 గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ సరఫరా కావడం లేదని, లో-వోల్టేజీతో మోటార్లు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. బోర్లు వేసినా నీరు లభించకపోవడంతో పంటలను కాపాడుకోలేకపోతున్నామని వాపోయారు.
ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు ఆరోపించారు. వెంటనే విద్యుత్ కోతలను నివారించి నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు తగిన పరిహారం అందించడంతో పాటు నంగనూరు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరిలో వృథాగా పోతున్న నీటిని కాళేశ్వరం ద్వారా రంగనాయకసాగర్‌కు తరలించి నింపాలని రైతులు కోరుతున్నారు. రంగనాయకసాగర్ నుంచి కాలువల ద్వారా సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు, వ్యక్తిగత పట్టింపులకు అతీతంగా ప్రభుత్వం రైతుల సమస్యలపై తక్షణమే స్పందించాలని కోరారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 10 సెప్టెంబర్ 2026

జనంసాక్షి వరుస కథనాలతో..

# న్యాల్‌కల్ కస్తూర్బా గురుకుల అభ్యున్నతికి డీఈఓ చొరవ

### లలితను ప్రత్యేకాధికారిణిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ
### నేడు ఎస్ఓగా విధుల్లో చేరిన లలిత

**న్యాల్ కల్, సెప్టెంబర్ 09, (జనం సాక్షి) :** న్యాల్ కల్ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రత్యేకాధికారిణి (ఎస్ఓ)గా నియమిస్తూ.. జిల్లా విద్యాధికారిణి (డీఈఓ) రోహిణి బుధవారం తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వెంటనే సాయంత్రం స్థానిక గురుకుల పాఠశాలకు వెళ్లి "ఎస్ఓ లలిత" విధుల్లో చేరారు. దాదాపు గత 40 రోజులకు పైగా గురుకులంలో ప్రత్యేకాధికారిణి, ఇన్చార్జి ఎస్ఓ లేకుండానే గురుకులం కొనసాగింది. దృష్టి సారించిన జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈనెల 4న పాఠశాలకు చెందిన సీనియర్ హిందీ ఉపాధ్యాయురాలు సంగీతను ఇన్చార్జి ఎస్ఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తాజాగా బుధవారం ప్రత్యేకాధికారిణిగా లలిత (ఎస్ఓ)ను నియమిస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. బాలికలకు మెరుగైన విద్య, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, విద్యాభివృద్ధి, బాలికల సంక్షేమంపై దృష్టి సారించాలని డీఈఓ ఆదేశించారు. స్థానిక గురుకులంలో ఎస్ఓ పోస్టు ఖాళీ ఉండటంతో పలువురు హైదరాబాద్ లోని విద్యాశాఖ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఎట్టకేలకు దరఖాస్తుల పరిశీలన అనంతరం.. విద్యాశాఖ ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం.. జిల్లా విద్యాధికారిణి న్యాల్ కల్ కస్తూర్బా గురుకులానికి ఎస్ఓ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తాజాగా విధుల్లో చేరిన లలిత గత రెండు సంవత్సరాలుగా.. విధులకు దూరంగా ఉన్నట్టు సమాచారం. అంతకుముందు గత11 సంవత్సరాలుగా సిర్గాపూర్ కస్తూర్బా గురుకులంలో ఎస్ఓ గా విధులు నిర్వహించారు.



**"జనంసాక్షి" వరుస కథనాలు**

గురుకులంలో నెలకొన్న పలు సమస్యలపై "జనం సాక్షి" ఇటీవల వరుస కథనాలు ప్రచురించిన విషయం పాఠకులకు తెలిసిందే. మెను పాటించక పోవడం, లోపించిన పారిశుద్ధ్యం, దుర్గంధం, దుర్వాసనతో కూడిన సెప్టిక్ ట్యాంక్, తదితర సమస్యలపై.."ఆగస్టు1న కంపు కొడుతున్న న్యాల్ కల్ కస్తూర్బా గాంధీ గురుకులం".., ఆగస్టు 2న "కారంపొడే దిక్కు".., ఆగస్టు 20న న్యాల్ కల్ కస్తూర్బా గురుకులానికి త్వరలో ప్రత్యేక అధికారిణి..? శీర్షికన "జనం సాక్షి" కథనాలను ప్రచురించింది. కథనాలను స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు.. వెంటనే డీఈఓ, జిసిడిఓ, స్థానిక వివిధ శాఖలకు చెందిన అధికారులు కస్తూర్బాను నేరుగా పరిశీలించారు. పరిశీలించిన నివేదికను డీఈఓ లిఖిత పూర్వకంగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎట్టకేలకు న్యాల్ కల్ గురుకులానికి ఎస్ఓ ను నియమిస్తూ ఉత్తర్వులను జారిచేశారు.

# ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ నివారణ

### మాజీమంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి • చర్లకోల శ్వేతారెడ్డి ద్వితీయ వర్ధంతి వేడుకలు
### జడ్చర్లలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ప్రారంభం

**జడ్చర్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి చాపకింద నీరులా విస్తరిస్తోందని, వ్యాధి బారిన పడి బాధపడటం కంటే రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కీర్తిశేషులు శ్రీమతి చర్లకోల శ్వేతారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా తన స్వగ్రామమైన తిమ్మాజిపేట మండలం ఆవంచలో ఆమె విగ్రహానికి కూతురు స్ఫూర్తి, కుమారుడు స్వరణ్ రెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి పుష్పాంజలి ఘటించి శ్రద్ధాంజలి అర్పించారు. అనంతరం జడ్చర్ల పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్ లో శ్వేతారెడ్డి జ్ఞాపకార్థం మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే సరైన వైద్య చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. నేటి కాలంలో ఆహార అలవాట్లు, మారిన జీవన శైలి వల్ల చాలామంది అనేక రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి వ్యాధిపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఉచిత శిబిరం రెండు రోజుల పాటు అందుబాటులో ఉంటుందని, గురువారం కూడా పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడిస్తూ, జడ్చర్ల నియోజకవర్గంలోని మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.





రూ.20 వేల లంచం తీసుకుంటూ..

# ఏసీబీకి చిక్కిన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

### కళాశాలకు అనుకూలంగా రిపోర్టు ఇచ్చేందుకు రూ.50 వేలు డిమాండ్

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :** ఈ మధ్యన ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న అధికారులు లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. అయినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు ఏమాత్రం మారడం లేదు. ఇష్టానుసారంగా లంచాలు డిమాండ్ చేస్తూ ఏసీబీకి చిక్కుతున్నారు. ఇలాంటి సంఘటన బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్‌రామ్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఓ కళాశాలకు అనుకూలంగా రిపోర్టు ఇచ్చేందుకు రూ.50 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఇప్పటికే రూ.30 వేలు చెల్లించిన కళాశాల యాజమాన్యం, మిగతా రూ.20 వేలు ఇవ్వాలని అధికారి ఒత్తిడి చేయడంతో ఏసీబీని ఆశ్రయించింది. దీంతో బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ దాడిలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. గోవింద్‌రామ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



# హరిత టూరిజం హోటల్ నిర్మించాలి

### ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** నియోజకవర్గంలో పర్యాటక రంగ అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన వసతి సౌకర్యాల కల్పనే లక్ష్యంగా జడ్చర్లలో వెంటనే హరిత టూరిజం హోటల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. బుధవారం ఈ మేరకు ఆయన మంత్రికి వినతిపత్రం అందజేశారు. జడ్చర్ల గ్రామం, మండలం పరిధిలోని సర్వే నంబర్ 445లో ఉన్న 4.12 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇదివరకే పర్యాటక శాఖకు కేటాయించినట్లు ఎమ్మెల్యే లేఖలో గుర్తుచేశారు. జడ్చర్ల వ్యూహాత్మకంగా అనుకూలమైన ప్రాంతంలో ఉండటంతో, ఇక్కడ హరిత హోటల్ అందుబాటులోకి వస్తే ప్రయాణికులు, పర్యాటకులకు నాణ్యమైన వసతి, భోజన సదుపాయాలు లభిస్తాయని తెలిపారు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. కావున కేటాయించిన స్థలంలో హరిత టూరిజం హోటల్ నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి జూపల్లి కృష్ణారావును ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జడ్చర్ల అభివృద్ధిలో పర్యాటక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ఈ ప్రాజెక్టును సాధించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.



# తెల్లాపూర్‌లో రూ.21 కోట్లతో ఆర్‌యూబీ

### మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

**రామచంద్రపురం,సెప్టెంబర్ 9 (జనం సాక్షి)** తెల్లాపూర్-- బీహెచ్ఈఎల్ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ అయిన రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)కి రూ.21 కోట్ల నిధులతో మంజూరు లభించిందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. బుధవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మెదక్ పార్లమెంట్ పరిధిలోని పెండింగ్ రైల్వే సమస్యలు, కొత్త ప్రతిపాదనలపై జీఎంతో చర్చించారు. శనివారం రైల్వే, ఇతర శాఖల అధికారులతో కలిసి ఆర్‌యూబీ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తామని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.





**తెల్లాపూర్ స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి**

తెల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేందుకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కూడా మంజూరైందని ఎంపీ తెలిపారు. ఈ నెలాఖరులో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

**రామచంద్రాపురం, నాగులపల్లికి ఎంఎంటీఎస్**

లింగంపల్లి వరకు వస్తున్న ఎంఎంటీఎస్ రైళ్లను రామచంద్రాపురం, నాగులపల్లి వరకు పొడిగించాలని రైల్వే జీఎంను కోరినట్లు ఎంపీ తెలిపారు. పశ్చిమ హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ దృష్ట్యా ఎంఎంటీఎస్ విస్తరణ అవసరమన్నారు. అయితే ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు రావాల్సి ఉందని జీఎం తెలిపారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని రఘునందన్‌రావు కోరారు.

## రీజినల్ రింగ్ రోడ్ భూ సేకరణ వేగవంతం చేయాలి



**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి) సెప్టెంబర్ 09 :** రీజనల్ రింగ్ రోడ్ భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేసి, నేషనల్ హైవే అధికారులకు భూమిని అప్పగించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కె. గంగాధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.బుదవారం గజ్వేల్ పట్టణంలోని సమకృత కార్యాలయ సముదాయంలో రీజినల్ రింగ్ రోడ్ భూ సేకరణ నేషనల్ హైవే, రెవెన్యూ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కె హైమావతి తో కలిసి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కె. గంగాధర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్తంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రీజనల్ రింగ్ రోడ్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఈ పెద్ద ప్రాజెక్టును మన జిల్లాలో రాయపోల్, వర్గల్, మర్కుక్, గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాల ద్వారా వెళు ్తందని భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చెయ్యాలని ఆదేశించారు.

మూసాపేట మండలం వేముల గ్రామంలో

# జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### జడ్‌పి ఉన్నత పాఠశాల,పల్లె దవాఖాన, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ
### పదో తరగతి విద్యార్థులు నిరంతరం సాధన చేసి గణితంపై పట్టు సాధించాలనీ సూచించిన కలెక్టర్

**మూసాపేట, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) :** మూసాపేట మండలం వేముల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్.పి.హెచ్.ఎస్), పల్లె దవాఖాన, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట వేముల జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యాబోధన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాలలోని వసతులు, కొనసాగుతున్న నిర్మాణ పనులు, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. స్టాఫ్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, మార్కుల నమోదును పరిశీలించారు. సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, విద్యార్థులకు అందిస్తున్న అక్షయపాత్ర భోజనాన్ని కూడా పరిశీలించారు. పదవ తరగతి క్లాస్ రూమ్ ను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు పూర్తయింది, పాఠ్యాంశాల పురోగతి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గణితంలోని సూత్రాలు, సమస్యల పరిష్కారంపై విద్యార్థులను ప్రశ్నించి వారి అవగాహనను పరీక్షించారు. గణితంలో మంచి మార్కులు సాధించాలంటే సూత్రాలను కేవలం గుర్తుపెట్టుకోవడం కాకుండా వాటిని క్రమం తప్పకుండా సాధన చేయాలని సూచించారు. సమస్యలను స్వయంగా పరిష్కరిస్తూ గణితంపై పూర్తి పట్టు సాధిస్తే ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించవచ్చని తెలిపారు. పాఠశాల విద్యార్థిని కుమారి మాధురి రచించిన 'శతక మధురిమ' పుస్తకాన్ని కలెక్టర్ పరిశీలించి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల పనితీరును కూడా ప్రశంసించారు. పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైనందున కేటాయించిన నిధులు, వాటి వినియోగం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని ఫ్యాక్టరీల యాజమాన్యాల సహకారంతో సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా పాఠశాల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఎదగాలని కలెక్టర్ సూచించారు.



**పల్లె దవాఖాన తనిఖీ**

అనంతరం పల్లె దవాఖానను సందర్శించిన కలెక్టర్ అక్కడికి వచ్చే రోగుల సంఖ్య, సాధారణంగా నమోదవుతున్న అనారోగ్య సమస్యలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు అందిస్తున్న కాల్షియం మాత్రలు, ఇతర మందుల నిల్వలను పరిశీలించారు. గ్రామంలోని స్థానికులతో కూడా కలెక్టర్ మాట్లాడి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, గ్రామ పరిస్థితులు, పాఠశాల పనితీరుపై వివరాలను తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమర్థవంతంగా పనిచేస్తున్నారని స్థానికులు కలెక్టర్‌కు తెలిపారు. తదుపరి వేముల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, మెనూ అమలు తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్**

వేముల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు ఆహారం అందిస్తున్నారా లేదా పరిశీలించారు. ఈరోజు మెనూలో 'ఎగ్ బిర్యానీ' ఉన్నప్పటికీ, బియ్యం వండి దానిపై గుడ్డు వేసి అందించినట్లు గుర్తించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం సిద్ధం చేయకపోవడంపై సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట మండల,గ్రామ అధికారులు ఉన్నారు

# ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో కీలక చర్చలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రధాన సమస్యల పరిష్కారంపై తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ)తో రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్చలు జరిపింది. ఈ నెల 6న టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగుల సంకల్ప సభ అనంతరం ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో టీజీఈజేఏసీ ప్రతినిధులు బుధవారం విస్తృతంగా చర్చించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

**18లోపు వేతన సవరణ నివేదిక**

ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ సంఘం నివేదికను ఈ నెల 18లోపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు టీజీఈజేఏసీ తెలిపింది.

**పాత పెన్షన్‌పై అధ్యయనం**

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే అంశంపై మూడు నెలల్లో సమగ్ర అధ్యయనం చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసే విషయంపైనా చర్చ జరిగింది.

**కరువు భత్యం, బకాయిలపై స్పష్టత**

పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిల చెల్లింపుపై ఈ నెల 18న స్పష్టత ఇవ్వాలని టీజీఈజేఏసీ కోరింది. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను త్వరితగతిన విడుదల చేయాలని చైర్మన్ లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్లాల రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబాలకు సంబంధించిన ఆరోగ్య కార్డు విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. మిగిలిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. చర్చల ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని టీజీఈజేఏసీ నాయకులు సూచించారు.

# రైతుల మార్కెట్‌లో 'షట్టర్' దందా

### నెలకు రూ.950 బయటకు రూ2000 నుండి 2500 వరకు వసూలు?
### పదేళ్లు గడిచినా కొత్త షటర్లకు టెండర్లు ఏవీ..?



**నంగనూరు, సెప్టెంబర్ 09( జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ సంబంధించిన షట్టర్ పై నంగనూరు మండల కేంద్రంలోని మార్కెట్ నిర్వహణపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సుమారు పదేళ్ల క్రితం నిర్మించిన ఈ మార్కెట్‌లో రైతుల కోసం దాదాపు 10 నుంచి 15 షటర్లను ఏర్పాటు చేశారు. అప్పట్లో టెండర్ ప్రక్రియ ద్వారా షటర్లను కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే ఆ టెండర్ల కాలపరిమితి ముగిసి ఏళ్లు గడుస్తున్నా.. ప్రస్తుతం టెండర్లు నిర్వహించకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**రూ.950 చెల్లించి.. రూ2500 నుండి 2500 వందల వరకు వసూలు?**

మార్కెట్‌లో టెండర్ ద్వారా షట్టర్ దక్కించుకున్న వారు ప్రభుత్వానికి సుమారు రూ.950 చెల్లిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే అదే షట్టర్‌ను ఇతరులకు వినియోగించుకునేందుకు ఇస్తూ వారి నుంచి నెలకు రూ.2000 నుండి 2500 వందల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి చెల్లించే మొత్తానికి, బయట వ్యక్తుల నుంచి వసూలు చేస్తున్న మొత్తానికి భారీ వ్యత్యాసం ఉండటంపై చర్చ జరుగుతోంది. టెండర్‌లో షట్టర్ దక్కించుకున్న వ్యక్తి దానిని మరొకరికి అద్దెకు ఇవ్వడానికి నిబంధనలు అనుమతిస్తున్నాయా? అనుమతి లేకుండా ఇతరులకు అప్పగిస్తే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**కొత్త టెండర్లు ఎందుకు లేవు?**

మార్కెట్‌లో ప్రస్తుతం మరికొన్ని షటర్లు అందుబాటులో ఉన్నప్పటికీ వాటికి బహిరంగ టెండర్లు నిర్వహించకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పదేళ్ల క్రితం నిర్వహించిన టెండర్ల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న షటర్లన్నింటికీ నిబంధనల ప్రకారం కొత్తగా టెండర్లు నిర్వహించి, పారదర్శకంగా కేటాయించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు. బహిరంగ టెండర్ల ద్వారా కేటాయిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు అర్హులైన రైతులు, వ్యాపారులకు అవకాశం లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

రైతుల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన మార్కెట్‌లో షటర్ల కేటాయింపు, అద్దె వసూళ్లు, ఇతరులకు అప్పగించే వ్యవహారంపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో నిర్వహించిన టెండర్ల వివరాలు, ప్రస్తుతం షటర్లను వినియోగిస్తున్న వారి వివరాలు, ప్రభుత్వానికి చెల్లిస్తున్న అద్దె, ఇతరుల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**రైతుల కోసం నిర్మించిన మార్కెట్..**

కొందరి చేతుల్లోకి వెళ్లకుండా చూడడంతో పాటు, షటర్ల కేటాయింపులో పారదర్శకత తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. కొత్తగా అందుబాటులో ఉన్న షటర్లకు వెంటనే బహిరంగ టెండర్లు నిర్వహించి ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# జిల్లాలో పోషణ్ మాసం కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలి

▫ కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మహిళలు, చిన్నారులలో పోషకాహార స్థాయిని మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న 9వ జాతీయ పోషణ్ మాసం కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించే పోషణ్ మాసం వాల్ పోస్టర్ ను కలెక్టర్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. ఈ ఏడాది "మన అంగన్ వాడీ – మన బాధ్యత" అంశంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి మల్లేశ్వరి, సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

▫ అదనపు కలెక్టర్(రెవెన్యూ) సీహెచ్ మహేందర్.జి



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 09(జనంసాక్షి) :** సెప్టెంబర్ 17న నిర్వహించే ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి అధికారులను ఆదేశించారు. బుధవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో మొదటిసారిగా నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేదిక, ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన తాగునీటి సౌకర్యంతోపాటు ఇతర మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత సమయంలోగా భూ సర్వే పూర్తి చేయాలి

▫ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**బయ్యారం, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసర్వేను అధికారులునిర్ణీత సమయం లోగా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి గ్రామ పరిధిలో కొనసాగుతున్న సమగ్ర భూ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు నిర్వహిస్తున్న రోవర్ల వినియోగం, హద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను, ఫీల్డ్ రిజిస్టర్ లను ఆమె నిశితంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సరిహద్దు వివాదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు నిర్వహించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ రికార్డులను పక్కాగా, పారదర్శకంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, గంధపల్లి సర్పంచ్ ప్రవీణ్, సర్వేయర్లు, ఇరిగేష్ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఉద్యమ నాయకుడు జే.రవీందర్ మృతి



**రామకృష్ణా పూర్, సెప్టెంబర్ 09(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నాయకుడు, మందమర్రి బీఆరెస్ పట్టణ అధ్యక్షుడు జే. రవీందర్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని రెనో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు, పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో రవీందర్ కీలకంగా పనిచేశారు. అనంతరం రాజకీయాల్లో కొనసాగుతూ బీఆరెస్ లో క్రియాశీలకంగా వ్యవహరించారు. మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా పార్టీ కార్యక్రమాలను ముందుండి నిర్వహించారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యలపై తనదైన శైలిలో స్పందించేవారు. రవీందర్ మృతి విషయం తెలియడంతో నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి, మందమర్రి పట్టణానికి తీరని లోటని పేర్కొన్నారు. రవీందర్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన అంత్యక్రియలకు బీఆరెస్నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ సహచరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.

## సరస్వతి కాలువ నీరు విడుదల చేయండి

▫ పీసీసీ అధ్యక్షునికి కూచాడి శ్రీహరి రావు విజ్ఞప్తి



**లక్ష్మణచందా, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** నిర్మల్ నియోజకవర్గ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్సారెస్పీ సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు కోరారు. ఈ విషయాన్ని పిసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో ఫోన్‌లో మాట్లాడి నిర్మల్ నియోజకవర్గానికి సరస్వతి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించి, సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించి నీటి విడుదలకు చర్యలు చేపట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి కూచాడి శ్రీహరి రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూచాడి శ్రీహరి రావు తో పాటు లక్ష్మణ చందా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ్ర నరేశ్ రెడ్డి, మామడ మాజీ జెడ్పీటీసీ మొహమ్మద్ రఫీ, మామడ మాజీ సర్పంచ్ బాపయ్య , మరియు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

▫ ఎన్నికల అధికారి, అబ్జర్వర్ నియామకం
▫ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలను నిబంధనలకు అనుగుణంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సత్య శారద తెలిపారు. బుధవారం. రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల అబ్జర్వర్‌గా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేశ్‌ను, ఎన్నికల అధికారిగా జిల్లా సహకార అధికారి (డీసీఓ) నీరజను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. సభ్యులు, సంబంధిత ప్రజల పరిశీలనార్థం ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ కార్యాలయం, వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ఉంచినట్లు వారు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, చేర్పులు, సవరణలకు సంబంధించి నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించి అధికారులకు సహకరించాలని కోరారు.

**ఎన్నికల షెడ్యూల్ ఇలా..**

సెప్టెంబర్ 9 నుండి 14 వరకు ఓటర్ల జాబితా ప్రదర్శన, అభ్యంతరాల స్వీకరణ జరుగుతుంది. సెప్టెంబర్ 15న ఓటర్ల జాబితాలో చేర్పులు, సవరణల కోసం అభ్యర్థనలు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 16న ఓటర్ల జాబితా పరిశీలన, ఆమోదం కోసం రాష్ట్ర శాఖకు అప్పీళ్లను సమర్పిస్తారు. సెప్టెంబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో పాటు ఎన్నికల నోటిఫికేషన్, షెడ్యూల్‌ను విడుదల చేస్తారు. సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ప్రతి నామినేషన్‌ను ఇద్దరు అర్హత కలిగిన సభ్యులు ప్రతిపాదించి, సమర్థించాల్సి ఉంటుంది. ప్రతి నామినేషన్‌కు తిరిగి చెల్లించబడని రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 25న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. సెప్టెంబర్ 26న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.అవసరమైతే అక్టోబర్ 4, 2026న ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టి, లెక్కింపు పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటిస్తారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేశ్, జెడ్పీ సీఈఓ ఎన్. వసంత, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, డీసీఓ నీరజ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ భార్గవ్, ఉపాధి కల్పన అధికారి సాత్విక తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట సర్పంచుల ఆందోళన

▫ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా సర్పంచ్ ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు సకాలంలో రాకపోవడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేపట్టిన పనులకు సొంత డబ్బులు పెట్టామని, బిల్లులు మంజూరు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఉప సర్పంచ్ లకు ఇచ్చిన చెక్ పవర్ ను వెంటనే రద్దు చేయాలని, సర్పంచ్ లకు గౌరవ వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలలో సర్పంచ్ లకు పూర్తి అధికారాలు కల్పించాలని, ప్రోటోకాల్ పాటించాలని కోరారు. గ్రామాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే సర్పంచ్ ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ గ్రామాల సర్పంచ్ లు కిరణ్ కుమార్, నాంద్రె సునీత, నిమ్మల శంకర్, జవ్వాజీ రమేష్, సరిత ఉపేందర్, కుర్రె మల్లయ్య, సప్పిడి ఇందిర, తిరుపతి, రాజ్ కుమార్, శ్రీనివాస్, మౌనిక, సబిత, రాజేశ్వరరావు, గురుసింగ్ బాపు, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు రుణాలు సకాలంలో అందించాలి

▫ బ్యాంకర్లు, అధికారుల సమన్వయంతో లక్ష్యాలను సాధించాలి
▫ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి




**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి బ్యాంకర్లను, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపుల కమిటీ , జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలు, విద్య, గృహ నిర్మాణం తదితర రంగాలకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ బ్యాంకర్లు జిల్లాలో నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించడంతో పాటు అర్హులైన దరఖాస్తుదారులకు రుణాలు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లాలో వార్షిక రుణ లక్ష్యంలో భాగంగా మొదటి త్రైమాసికంలో రూ. 2939కోట్లు (33శాతం )లబ్ధిదారులకు బ్యాంకర్ల ద్వారా మంజూరు చేయటం జరిగిందన్నారు. జిల్లాలో వార్షిక రుణ లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ విష్ణుప్రియ, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, డీఆర్డీవో మేన శ్రీను, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, మెప్మా పీడీ రాజేశ్వర్,ఆర్బీఐ రీజినల్ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ యశ్వంత్ సాయి, యూబీఐ రీజినల్ హెడ్ కమలాకర్, ఆర్సెటీ డైరెక్టర్ రవి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు పటిష్ట భద్రతా చర్యలు



**నిర్మల్ బ్యూరో, సెప్టెంబరు 9: (జనంసాక్షి) :** నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల వివరాలనులో సి టి ఎన్ ఎస్ లో ఎప్పటి కప్పుడు నమోదుచేయాలని, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. దొంగతనాల నివారణకు రాత్రి గస్తీని ముమ్మరం చేయడంతో పాటు సీసీ కెమెరాలు, సాంకేతిక నిఘాను సమర్థంగా వినియోగించాలని తెలిపారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, నకిలీ నంబర్ ప్లేట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతలు, ట్రాఫిక్ నిర్వహణకు పటిష్ట ప్రణాళిక రూపొందిం చాలని ఎస్పీ ఆదేశించారు. మండపాల నిర్వాహ కులు మండపం, కమిటీ, విగ్రహం, ఊరేగింపు, నిమజ్జన వాహనాల వివరాలను ముందస్తుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిం చేందుకు పోలీసులకు సహకరిం చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావే శంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వానాకాలం 2026-27 ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు

▫ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09(జనంసాక్షి) :** వానాకాలం 2026–27 సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కొరకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా మేనేజర్, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన మౌలిక వసతులను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. జిల్లాలో ధాన్యం నిల్వకు అవసరమైన గోదాములను వెంటనే గుర్తించి సిద్ధంగా ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితులలోనూ లోతట్టు ప్రాంతాలలో ఏర్పాటు చేయరాదని, ఎత్తైన చదును ప్రదేశాలను ఎంపిక చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చుకొని అక్టోబర్ 1వ తేదీ నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం సంబంధిత వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేసి, అందులో కేటాయించిన 16 ప్రశ్నలకు సంబంధించిన నిజ సమయం తెలిపే ఫోటోలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గత సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం, గన్నీ సంచుల లెక్కలు సరిచూడటం ప్రక్రియను సంబంధిత కొనుగోలు ఏజెన్సీలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గత సీజన్‌కు సంబంధించిన లెక్కలు పూర్తిగా సరిచేసిన తర్వాతే తదుపరి సీజన్‌కు సంబంధించిన అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వానాకాలం 2026–27 సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ధాన్యం రవాణాకు సంబంధించిన వాహన వివరాలు, గన్నీ సంచుల నిల్వ, ధాన్యం రవాణా చేసే లారీలకు ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. రైతులకు సకాలంలో, పారదర్శకంగా ధాన్యం కొనుగోలు సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, కొనుగోలు ఏజెన్సీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ క్షేత్రాల్లో వరుస చోరీలు

▫ రైతుల ఆందోళన

**దేవరుప్పుల, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** దేవరుప్పుల మండల కేంద్రంలోని హైవే రోడ్డు సమీపంలోని రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో కేబుల్, కాపర్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తున్న ఘటనలు పలుమార్లు చోటుచేసుకుంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బాధిత రైతులు దేవరుప్పుల ఎస్ఐకి వినతిపత్రం సమర్పించి, వ్యవసాయ పొలాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను విజ్ఞప్తి చేశారు.


## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

▫ అలరించిన విద్యార్థుల కవితలు, నృత్యాలు



**కాళేశ్వరం, సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తెలంగాణ భాషా మాధుర్యాన్ని, కాళోజీ గొప్పతనాన్ని వివరిస్తూ పిల్లలు చెప్పిన చక్కని కవితలు, ఇచ్చిన ఉపన్యాసాలు ఆలోచింపజేశాయి. అలాగే విద్యార్థులు చేసిన నృత్యాలు ఉల్లాసంగా సాగి విశేషంగా అలరించాయి. ఈ వేడుకలకు గ్రామ ఉపసర్పంచ్ చెమ్మాల సుధీర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తెలంగాణ భాషా ప్రాముఖ్యతను, కాళోజీ నారాయణరావు గారి సేవలను స్మరించుకున్న అనంతరం, ఆయన తన చేతుల మీదుగా పాఠశాల పిల్లలందరికీ స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొనికల రాజేందర్ తో పాటు ఉపాధ్యాయ బృందం విజయశ్రీ, సువర్ణ, జ్యోతి, శిరీష, శ్రీధర్, శారద, షహనాజ్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎంబీబీఎస్ ప్రభుత్వ సీటు సాధించిన నిక్షిత్ పటేల్



**రేగొండ, సెప్టెంబర్ 09( జనం సాక్షి):** మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన సిరంగి నిక్షిత్ పటేల్ మంచిర్యాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించి గర్వంగా నిలిచారు.గ్రామానికి చెందిన సిరంగి అక్కన్న రావు స్వప్న దంపతులకు ఇద్దరు కుమారులు, పెద్ద కుమారుడు నిక్షిత్ పటేల్ నీట్ పరీక్షలో 472 మార్కులు సాధించి రాష్ట్ర వ్యాప్తంగా 2050 ర్యాంక్ సాధించి ప్రభుత్వ సీటు సాధించారు. ఇందుకుగాను నిక్షిత్ పటేల్ కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యలో మరింత ప్రతిభ కనబర్చి పేద ప్రజలకు సేవలందించాలని వారు ఆకాంక్షించారు.

# ఏకలవ్య పాఠశాలలో విద్యాబోధనకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

## తరగతి సమయాల్లో ఇతర కార్యక్రమాలు నిర్వహించొద్దు
## ప్రయోగాత్మక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్09 ( జనం సాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాటేకులపల్లి మండలంలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ, ప్రయోగశాలలు, భోజనం, పరిశుభ్రత, యూనిఫాంలు, వెల్నెస్ సెంటర్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు.

8, 9, 10వ తరగతుల గదులను పరిశీలించిన కలెక్టర్ కొన్ని తరగతుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆరా తీశారు. గ్రామసభ, విద్యార్థి పార్లమెంట్, స్కాలర్‌షిప్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాల ప్రారంభం వంటి కార్యక్రమాల కోసం విద్యార్థులు తరగతులకు దూరంగా ఉన్నట్లు అధికారులు వివరించారు. ఆర్ట్ అండ్ డ్రాయింగ్ తరగతిని పరిశీలించి బోధిస్తున్న అంశాలను తెలుసుకున్నారు. 8వ తరగతి లైబ్రరీ పీరియడ్‌కు బదులుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి సమయాన్ని పూర్తిగా విద్యాబోధనకే కేటాయించాలని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇతర కార్యక్రమాల్లో నిమగ్నం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామసభ, విద్యార్థి పార్లమెంట్, బ్యాంకు ఖాతాల ప్రారంభం, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి కార్యక్రమాలను తరగతుల అనంతరం లేదా శనివారాల్లో నిర్వహించాలని ఆదేశించారు. విద్యా క్యాలెండర్ ప్రకారం ప్రతి పీరియడ్‌ను సక్రమంగా నిర్వహించి విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. భౌతిక శాస్త్ర ప్రయోగశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి ప్రయోగాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. భోజనశాల, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల భోజనశాల, వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్టోర్ రూమ్‌లోని కూరగాయలు, రిఫ్రిజిరేటర్‌లోని పాలు, పెరుగు నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం మాత్రమే అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట తాసిల్దార్ వీరభద్రం, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాళాలు పగలగొట్టి వరుస దొంగతనాలు

**60 లక్షల విలువైన 37.2 తులాల బంగారం 470 గ్రాముల వెండి, రూ.3.60 లక్షల నగదు, కారు స్వాధీనం**

**నిందితుడు అరెస్ట్**

**కేసు వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ కె.నరసింహ**




**సూర్యాపేట (జనంసాక్షి) :** కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని తాళాలు పగలగొట్టి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కోదాడ పట్టణ పోలీసులు,జిల్లా సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు.బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలలో జిల్లా ఎస్పీ కె.నరసింహ వెల్లడించారు.నిందితుడు పట్నంశెట్టి రాజీరెడ్డి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి,ఆ ఇళ్లను లక్ష్యంగా చేసుకునేవాడని తెలిపారు.దొంగిలించిన ఆభరణాలలో కొన్నింటిని అమ్మడం, కొన్నింటిని కరిగించడం, మరికొన్నింటిని ఫైనాన్స్ సంస్థలో కుదవ పెట్టడం ద్వారా వచ్చిన డబ్బును తన వ్యక్తిగత అవసరాలకు,అప్పుల చెల్లింపులకు వినియోగించేవాడని అన్నారు.తన కారు అసలు రిజిస్ట్రేషన్ నంబర్ ను మార్చి పోలీసులకు అనుమానం రాకుండా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడేవాడని తెలిపారు.కోదాడ పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతున్న విషయమై పోలీస్ శాఖ కోదాడ పట్టణంలో పటిష్ట నిఘా ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలను సేకరించి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని గుర్తించడం జరిగిందన్నారు.అరెస్టయిన నిందితుడు వృత్తిరీత్యా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని,నిందితుడు హైదరాబాద్ నుంచి ప్రయాణికులను కారులో కోదాడకు తీసుకువచ్చి, రాత్రి సమయంలో కోదాడలోనే ఉండేవాడని తెలిపారు.నిందితుడు కోదాడ పట్టణంలో 2021 నుండి ఇప్పటి వరకు 10 దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. 2026 సంవత్సరంలో 7 ఇండ్లలో దొంగతనాలు చేశాడని, నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం ఉదయం నిందితుడు దొంగిలించిన బంగారు వస్తువులను విజయవాడకు తీసుకెళ్లి విక్రయించాలనే ఉద్దేశంతో తన కారులో సూర్యాపేట నుండి కోదాడ పట్టణంలోని ఫ్లైఓవర్ మీదుగా హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్దకు చేరుకున్న సమయంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండటాన్ని గమనించాడని తెలిపారు.పోలీసులను చూసి భయపడి వాహనాన్ని వెనక్కి తీసుకొని తప్పించుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారని అన్నారు.వాహనాన్ని తనిఖీ చేయగా డిక్కిలోని కవర్లలో బంగారు, వెండి ఆభరణాలు, నగదు లభించాయన్నారు. స్క్రూడ్రైవర్లు, షూ సాక్సులు కూడా లభించడంతో అనుమానం మరింత బలపడిందన్నారు.అనంతరం నిందితున్ని అదుపులోకి తీసుకోగా కోదాడ పట్టణంలో తాను చేసిన దొంగతనాల గురించి వెల్లడించాడని అన్నారు.నిందితుడు ఉపయోగించిన కారు, మొబైల్ ఫోన్ కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.60 లక్షల విలువైన 37.2 తులాల బంగారం, 470 గ్రాముల వెండి, రూ.3.60 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.నేరాలకు పాల్పడిన వారు ఎప్పటికైనా చట్టానికి చిక్కక తప్పదని అన్నారు.ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనుమానస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపిస్తే డయల్ 112 కు సమాచారం ఇవ్వాలని అన్నారు.దొంగతనాల కేసు చేయించడంలో పర్యవేక్షణ చేసిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, నిందితున్ని అరెస్ట్ చేయడంలో బాగా పని చేసిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివంశంకర్, సిసిఎస్ ఎస్ఐ లు హరికృష్ణ, సాయిరాం, ఎస్ఐ అజయ్ కుమార్, సిసిఎస్ సిబ్బంది వెంకన్న, విద్యాసాగర్, మల్లేష్, సతీష్, శివ, ప్రభాకర్, మంజులని అభినందించి రివార్డ్ అందించారు.



# బిల్లుల కోసం బిక్కుబిక్కుమంటున్న సర్పంచులు!

## అప్పులు.. వడ్డీల భారం.. అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు



**గుర్రంపోడు సెప్టెంబర్ 09 (జనంసాక్షి) :** గుర్రంపోడు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల బిల్లుల మంజూరు వ్యవహారం తీవ్ర వివాదంగా మారింది. గ్రామాల్లో మురికి కాలువలు, సిమెంట్ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల పనుల కోసం సర్పంచులు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టడమే కాకుండా, బయట భారీగా వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారు. అయితే, పనులు ముగిసి రెండేళ్లు గడుస్తున్నా కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ రకరకాల సాకులు చెబుతూ బిల్లులను ఆన్‌లైన్ చేయడం లేదు.ముఖ్యంగా లక్ష్మీదేవిగూడెం సర్పంచ్ సల్వాది సరస్వతి నగేష్ ఈ ఆపరేటర్ తీరుపై ఉన్నతాధికారులకు సంచలన ఫిర్యాదు చేశారు. గత ఎన్నికల్లో సర్పంచ్‌కు వ్యతిరేక వర్గం నుండి పోటీ చేసిన ఆపరేటర్ భార్య వార్డు మెంబర్‌గా గెలవడంతో, ఆ రాజకీయ కక్షతోనే కావాలనే ల్యాండ్ రికార్డులను, బిల్లుల ఫైళ్లను తొక్కిపెడుతూ వేధిస్తున్నాడని ఆమె ఆరోపించారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పుల బాధలు ఎక్కువై, వడ్డీలు కొండలా పెరిగిపోతుండటంతో 'ప్రజావాణి'లో దరఖాస్తులు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని, తమకు చావే దిక్కు అని పలువురు సర్పంచులు కన్నీరు పెట్టుకుంటున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జడ్పీ సీఈవో స్పందించి సదరు కంప్యూటర్ ఆపరేటర్‌పై విచారణ జరిపి, పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, లేనిపక్షంలో మండల సర్పంచులమంతా కలిసి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని మండల సర్పంచుల సంఘం తీవ్రంగా హెచ్చరించింది.

# కెమికల్ పరిశ్రమలను తక్షణమే తొలగించాలి

## కాలుష్య బాధిత రైతులకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలి
## స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించాలి : సీపీఎం నేత జహంగీర్



**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** పోచంపల్లి మండలంలోని అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాల్లో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన కెమికల్ పరిశ్రమలను తక్షణమే తొలగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కెమికల్ పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టాలని, బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషపూరిత రసాయనాలు, పొగ, వ్యర్థాలతో వాయు, నీటి కాలుష్యం పెరిగి ప్రజల జీవన పరిస్థితులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల కాలుష్యం వల్ల వ్యవసాయ భూములు, పంటలు, భూసారం, సాగునీరు కలుషితమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రజలు క్యాన్సర్, చర్మవ్యాధులు, కిడ్నీ సమస్యలు తదితర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాలుష్య ప్రభావిత ప్రాంతంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించాలని, బాధితులకు సరైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పరిశ్రమల కాలుష్యంపై స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో చర్చించాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు మాట్లాడుతూ కాలుష్యంతో నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని, భూసారం, తాగునీరు, పంటలు, ఇతర ఆస్తులకు జరిగిన నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో స్థానిక రైతులు, ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించి విచారణను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాలుష్య ప్రభావిత భూములు, నీటి వనరులు, జీవనోపాధి నష్టాలను సమగ్రంగా నమోదు చేసి పరిశ్రమలపై చర్యలు తీసుకోకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అనంతరం బాధితులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పగిళ్ల లింగారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధుతో పాటు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# ఎస్‌జీఎఫ్ క్రీడలకు సర్వం సిద్ధం

## 11న పి.ఏ.పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు

**పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్‌జీఎఫ్ (SGF) క్రీడా పోటీల నిర్వహణపై బుధవారం పి.ఏ.పల్లి గ్రామంలోని ఎంఆర్సీ భవనంలో సమావేశం నిర్వహించారు.ఎంఈఓ డి.రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వివిధ పాఠశాలల పీడీలు,పీఈటీలు హాజరయ్యారు. ఎంఈఓ డి.రాజు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ శుక్రవారం పి.ఏ.పల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.కబడ్డీ,వాలీబాల్, ఖోఖో విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అండర్--14 విభాగంలో 01-01-2013 తర్వాత, అండర్--17 విభాగంలో 01-01-2010 తర్వాత జన్మించిన విద్యార్థులు మాత్రమే పోటీల్లో పాల్గొనాలని సూచించారు.పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలను తమ పాఠశాలల నుంచి తీసుకురావాలని తెలిపారు.పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు భోజన వసతి కల్పించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పీడీలు సీహెచ్.ఎల్లయ్య, ఎం.మల్లేష్,వి.వెంకన్న,వద్దిపట్ల డీవీవీ పీడీ కొండల్‌తో పాటు ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, వివిధ పాఠశాలల పీడీలు,పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు రైల్వే సౌకర్యం కల్పించాలి

## ప్రధానికి లక్ష పోస్టు కార్డుల ఉద్యమానికి శ్రీవాసవి సేవా సమితి మద్దతు



**సూర్యాపేట (జనంసాక్షి) :** ఆధ్యాత్మిక, సామాజిక సేవలతో పాటు ప్రజల అవసరాల కొరకు శ్రీవాసవి సేవా సమితి ముందుంటుందని ఆ సంఘ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్ తెలిపారు.బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష పోస్టు కార్డుల ఉద్యమ శిబిరంలో పాల్గొని పూర్తి మద్దతు ప్రకటిస్తూ 1000 కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని, రైల్వే మార్గం వస్తే మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.సూర్యాపేటకు రైలు కోసం కృషి చేస్తున్న రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్ ను అభినందించారు.రైల్వే లైన్ సాధించే వరకు ఏ ఉద్యమం తలపెట్టిన తమ సంఘం మద్దతు ప్రకటిస్తుందన్నారు. సూర్యాపేట జిల్లా మీదుగా గతంలో ప్రకటించిన విధంగా రైలు మార్గాన్ని కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి నిర్వాహకులు బిక్కుమల్ల ఉపేందర్ , రాచూరి ప్రతాప్, నల్లపాటి అప్పారావు, భద్రయ్య, మంజుల, అంజయ్య,తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్, శ్రీవాసవి సేవా సమితి ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్, రాచకొండ శ్రీనివాస్, మహంకాళి ప్రణీత్, కలకోటి నరసయ్య,సహాయ కార్యదర్శులు కర్నాటి కృష్ణ, బచ్చు శ్రీనివాస్, తప్పీ అనిల్, సోమా ధనుంజయ్, సభ్యులు పోలా లక్ష్మీనారాయణ, తాటిశెట్టి హనుమంతు, బెలిదే అంజయ్య, మహంకాళి సోమయ్య, మిట్టపల్లి రమేష్, చల్లా సత్యనారాయణ, తప్పీ గాంధీ, గుడిపాటి రమేష్, గుండా వెంకన్న, ఇల్లందుల నవీన్, తల్లాడ కృష్ణమూర్తి, దేవరశెట్టి కృష్ణమూర్తి, మిరియాల వెంకటేశ్వర్లు, దేవరశెట్టి ఉమారాణి, మిట్టపల్లి శ్రీదేవి, కలకోటి అనిత, తెల్లాకుల శ్రీదేవి, గుడిపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి

## ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 09 ( జనంసాక్షి) :** జిల్లాలో గుర్తించిన పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించగా, కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్ లతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి 142 పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళిక, ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడం, ప్రభుత్వ భూములతో ల్యాండ్ బ్యాంక్ గుర్తింపు, పీపీపీ విధానంలో పర్యాటక ప్రాజెక్టులు, మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళిక, జ్ఞాన భారతం మిషన్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో గుర్తించిన వీకెండ్ గేట్‌వే పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక వసతులు, రహదారులు, త్రాగునీరు, మరుగుదొడ్లు, భద్రత, సమాచార కేంద్రాలు, తదితర సౌకర్యాలను కల్పించేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, పర్యాటక ప్రచారం తదితర అంశాలను స్పష్టమైన కాల పరిమితులతో పొందుపరచాలని తెలిపారు. జ్ఞాన భారతం మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# శాసనసభను కౌరవ సభగా మార్చిన కాంగ్రెస్

- ప్రజా సమస్యలు చర్చకు రాకుండా డైవర్షన్ పాలిటిక్స్
- ప్రభుత్వ ప్రోద్బలంతోనే కేసీఆర్ ఇంటిపై దాడి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌ని సస్పెండ్ చేయాలి
- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర, లింగాల కమల్ రాజ్




**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) :** తెలంగాణ శాసన సభను కౌరవ సభగా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు విమర్శించారు. బుధవారం ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లా డుతూ.. గత మూడు రోజులుగా హైదరాబాదులో జరుగుతున్న పరిణామాలన్నింటికీ కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ప్రధానంగా శాసనసభలో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపారని దుయ్యబట్టారు.

**కేసీఆర్ ఇంటిపై దాడి దారుణం :** తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి తెచ్చిన తమ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటిపై దాడి అమానుష మని మాజీ ఎమ్మెల్యే సండ్ర అన్నారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోద్బలమేనని పేర్కొన్నారు. కెసిఆర్ ఇంటి ముట్టడికి పిలుపు నివ్వడం ఏ రాజకీయ సంస్కృతి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ శ్రేణులంతా మూకుమ్మడిగా ఫామ్ హౌస్ దిశగా దాడికి వెళ్తుంటే, రాష్ట్ర హోం మంత్రిగా ఉన్నటువంటి ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వ విప్ లకు ఎస్కార్ట్ ఇవ్వడం, దాడులు చేస్తుంటే పోలీసులు నిలబడి చూడడం వెనుక ప్రభుత్వ కుట్ర లేదా అని అడిగారు. ఎథిక్స్ కమిటీ ఏకపక్ష వైఖరి అవలంబిస్తోందని, కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ వంటివారు బీఆర్ఎస్ నాయకులను నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతుంటే కనిపించడం లేదా అని అన్నారు.

**ఎమ్మెల్యే శంకర్‌ని సస్పెండ్ చేయాలి**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చావుని కోరుకున్న షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలనే ఫణంగా పెట్టిన ఉద్యమనేత మరణాన్ని కోరడం అత్యంత దారుణమని, మానవత్వం లేనిచర్యగా అభివర్ణించారు. ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్ రెడ్డి వారి వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నప్పటికీ ఈ సెషన్ మొత్తం వారిద్దరిని సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. అదేవిధంగా తెలంగాణ అసెంబ్లీ, స్పీకర్ గడ్డం ప్రసాద్ అంటే తమ పార్టీకి ఎంతో గౌరవం అని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో అంబానీ, అదాని బొమ్మలు ఉన్న టీ షర్టు వేసుకొని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిరసన తెలుపలేదా అని ప్రశ్నించారు. **బీఆర్ఎస్ అధికారంలోకి రావడం పక్కా**

తెలంగాణలో రైతు రుణమాఫీ, ఫీజు రియంబర్స్మెంట్, ఉపకార వేతనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వంటి అనేక కీలక సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే సండ్ర అన్నారు. ఆయా అంశాలపై చట్ట సభల్లో చర్చ జరుగుతుందని, తమకు ఉపశమనం కలుగు తుందని రాష్ట్ర ప్రజలు భావించగా వాటికి సమాధా నాలు చెప్పాల్సి వస్తుందనే ఏకైక కారణంతో హైడ్రామా రాజకీయాలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళికలు రచించి అమలు పరిచారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను అడ్డుకునే హక్కు ఎవరిచ్చారు అని హైకోర్టు మందలించడం ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వరప్రదాయనిగా రూపుదిద్దుకుంటున్న సీతారామ ప్రాజెక్టుకు గత కేసిఆర్ ప్రభుత్వం రూ. వేల కోట్లు ఖర్చు చేసి 90% పనులను పూర్తిచేస్తే, కేవలం రూ. 80 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకోవడం సిగ్గు సేటు అని విమర్శించారు. రెండేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో నాయకులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, బి. తిరుమలరావు, బొమ్మెర రామ్మూర్తి, హెచ్ ప్రసాద్, ఆరెంపల వీరభద్రం, బలుసు మురళి కృష్ణ, కోడిరెక్కల ఉమా శంకర్, నారమళ్ళ వెంకన్న, పిడతల రామ్మూర్తి, కోడి రెక్కల ఫ్రాన్సిస్, సద్దాం, మొహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూమిని రక్షించండి

## తక్షణమే సర్వే నిర్వహించాలి

**పువ్వాడనగర్ సర్పంచ్ షేక్ సిద్దిక్ డిమాండ్**

**అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించిన గ్రామ పంచాయతీ**

**రఘునాథపాలెం (జనంసాక్షి) :** రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్ గ్రామంలోని సర్వే నంబర్ 192లోని అసైన్డ్ (ప్రభుత్వ) భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలపై, లేఅవుట్లపై తక్షణమే సర్వే నిర్వహించి, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ షేక్ సిద్దిక్ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వే నంబర్ 192లో ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, దీనిపై సర్వే జరిపించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు సరైన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి పరిరక్షణే లక్ష్యంగా ఇప్పటికే గ్రామ పంచాయతీలో ఏకగ్రీవంగా తీర్మానం కూడా ఆమోదించినట్లు తెలిపారు.

**ఉమ్మడి సర్వేతోనే నిజాలు వెలుగులోకి.. :** రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో ఏకకాలంలో ఉమ్మడి సర్వే నిర్వహించాలని కోరారు. ఆ సర్వే ద్వారా అక్రమంగా వెలిసిన లేఅవుట్లు, నివాసాలను గుర్తించి, వాటిని తక్షణమే తొలగించి విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

**అసత్య ప్రచారాలను నమ్మవద్దు :** ఇటీవల కొన్ని మాధ్యమాల్లో తనపై, గ్రామ పంచాయతీపై వచ్చిన అసత్య ప్రచారాలను, పుకార్లను సర్పంచ్ షేక్ సిద్దిక్ తీవ్రంగా ఖండించారు. స్వార్థ ప్రయోజనాల కోసం కొంతమంది నిందలు వేస్తున్నారని, నిబంధనలకు కట్టుబడి ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ప్రజాహితం కోసం అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హెచ్చరించారు.




## ఊపందుకున్న భావి యూనికార్న్‌లు

### ఏఐ, ఈవీ రంగాల నుంచీ పెరుగుతున్న ప్రాతినిధ్యం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్‌లో యూనికార్న్ (100 కోట్ల డాలర్లకు పైగా విలువ ఉన్న సంస్థ)గా ఎదిగేందుకు ఎక్కువ అవకాశాలున్న అంకుర సంస్థల సంఖ్య భారీగా పెరుగుతోంది. అంతే కాదు విభిన్న రంగాల నుంచి ఇవి ఉంటున్నాయని ఓ నివేదిక తెలిపింది. 2026 ఏఎస్‌కే ప్రైవేట్ వెల్త్ హురున్ ఇండియా 'చీతా' సూచీలో అంకుర సంస్థల సంఖ్య గత అయిదేళ్లలో రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగి 110కి చేరిందని పేర్కొంది. 2000 లేదా ఆ తర్వాత స్థాపితమై 200-500 మిలియన్ డాలర్ల మధ్య విలువ కలిగి, అయిదేళ్ల లోపు యూనికార్న్ హోదాను చేరొచ్చనే అంచనాలున్న అన్‌లిస్టెడ్ అంకురాలను ఈ సూచీలో 'చీతా'గా వ్యవహరిస్తారు. 2026 'చీతా' సూచీలోని 110 సంస్థల మొత్తం విలువ రూ.3 లక్షల కోట్లకు పైగా ఉంది. సగటున ఒక్కో సంస్థ విలువ రూ.2,820 కోట్లు. ఈ 110 చీతాలు దాదాపు 1.10 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.కొత్తగా ఈ జాబితాలో చోటు దక్కించుకున్న సంస్థల్లో క్లీన్ మొబిలిటీ (బ్లూ ఎనర్జీ మోటార్స్, మ్యాటర్, పీఎంఐ ఎలక్ట్రో మొబిలిటీ, రివర్ మొబిలిటీ), ఏరోస్పేస్, డిఫెన్స్ (సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్, ధ్రువ స్పేస్, దిగంతర), ఏఐ సేవలు వంటి రంగాల నుంచి ఉన్నాయి.

ఈ ఏడాదే 43

2021లో చీతా సూచీ ప్రారంభించినప్పుడు 54 చీతాలు ఉండగా.. 2026లో ఆ సంఖ్య 110కి పెరిగింది. అయిదేళ్లలో మొత్తంగా 104%, ఏటా 15 శాతం చొప్పున వృద్ధి నమోదైంది. 2026లోనే ఏకంగా 43 చీతాలు ఈ జాబితాలో తొలిసారిగా ప్రవేశించాయి. ఈ ఏడాది పది చీతాలు (సీఖో, అగ్నికుల్, డెహాట్, గివా, ఆటంబర్గ్, కూకూఎఫ్ఎమ్, మికో, ఖాతాబుక్, ప్రాక్టో, మోజాయిక్ వెల్‌నెస్) గజెల్ స్థాయికి చేరాయి. మరో మూడు - స్కైరూట్ ఏరోస్పేస్, స్క్వేర్ యార్డ్స్, ఆస్ట్రోటాక్ నేరుగా యూనికార్న్ స్థాయికి ఎగబాకాయి. యూనికార్న్‌గా అవతరించేందుకు అవకాశం ఉన్న ఆరు సంస్థలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లోనూ లిస్ట్ అయ్యాయి. బెంగళూరులో 36 చీతాలు ఉండగా.. ఎన్‌సీఆర్ (25), ముంబయి (16) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఆరోగ్య సంరక్షణ సంస్థ టెంపుల్ ద్వారా జొమాటో సహ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ తిరిగి చీతా జాబితాలోకి ప్రవేశించారు.

# 100 డాలర్లకు ముడి చమురు..

## 800 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశీయ మార్కెట్ సూచీలు బుధవారం భారీ నష్టాల్లో ముగిశాయి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడంతో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. 100 డాలర్ల మార్కు దాటడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడింది. ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 203 పాయింట్లు కోల్పోయింది. సెన్సెక్స్ ఉదయం 75,216.22 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,577.58) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే ఊగిసలాడిన సూచీ.. చివరికి 813.35 పాయింట్లు పతనమై 74,764.23 వద్ద ముగిసింది. నిఫ్టీ 203.60 పాయింట్లు కోల్పోయి 23,431.50 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.11గా ఉంది. సెన్సెక్స్ 30లో హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా నష్టాలను చవిచూశాయి. అదానీపోర్ట్స్, టాటాస్టీల్, ట్రెంట్, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, పవర్ గ్రిడ్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 100.60 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4,391.07 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.123.19 కోట్లు

ముడి చమురు ధరలు పెరుగుతుండటం, అమెరికా-ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా వరుసగా రెండో రోజూ దేశీయ సూచీలు నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి బ్లూ-చిప్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు




విలువ 28 పైసలు తగ్గి 94.84 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.54 శాతం పెరిగి 97.56 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. షాంఘై సూచీ లాభపడింది. ఐరోపా మార్కెట్లు ప్రతికూల ధోరణిలో కదలాడాయి. మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.35,000 కోట్లు తగ్గి రూ.486.21 లక్షల కోట్ల (5.13 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 75,970.28 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,132.81 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ 76,012.11 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 75,553.35 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 555.23 పాయింట్లు నష్టపోయి 75,577.58 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 144.05 పాయింట్లు తగ్గి 23,635.10 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,758.95-23,623.10 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 21 నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 2 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.72 శాతం, అల్ట్రాటెక్ సిమెంట్ 1.23 శాతం, కోటక్ బ్యాంక్ 1.20 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.16 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.11 శాతం, సన్ ఫార్మా 0.98 శాతం, మారుతీ సుజుకీ 0.96 శాతం తగ్గాయి. బీఈఎల్ 1.48 శాతం, అదానీ పోర్ట్స్ 1.06 శాతం, హెచ్‌యూఎల్ 0.84 శాతం, ఇండిగో 0.49 శాతం పెరిగాయి. రంగాల వారీ సూచీలకొస్తే బీమా, టాప్ 10 బ్యాంక్స్, ప్రైవేట్ బ్యాంక్స్, ఆర్థిక సేవలు, చమురు-గ్యాస్, బ్యాంకింగ్, ఇంధన రంగాలు డీలా పడ్డాయి. కమొడిటీస్, ఎఫ్ఎంసీజీ, ఆరోగ్య సంరక్షణ, పారిశ్రామిక, టెలికాం, భారీ యంత్ర పరికరాలు, విద్యుత్, సేవల రంగాలు రాణించాయి. బీఎస్ఈలో 2,384 షేర్లు నష్టాల్లో, 2,009 షేర్లు లాభాల్లో ముగిశాయి. 216 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

## ఉద్యోగులకు ఉబర్ షాక్..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అమెరికాకు చెందిన ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబర్ టెక్నాలజీస్ ఇటీవల ఉద్యోగాల కోత చేపట్టగా.. తాజాగా తమ వర్క్ ఫ్రమ్ హోం నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఇటీవల గ్లోబల్ సిబ్బందిలో దాదాపు 10 శాతం మందిని తొలగించడంతో.. దాదాపు 3,300 మంది కార్పొరేట్ ఉద్యోగులపై వేటు పడింది. తాజాగా కేవలం 1 శాతం మంది ఉద్యోగులకే పూర్తి స్థాయి వర్క్ ఫ్రమ్ హోం సదుపాయం కల్పిస్తామని కంపెనీ స్పష్టం చేసింది. ఉద్యోగులు వారానికి కనీసం 3 రోజులు తప్పనిసరిగా ఆఫీసుకు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రస్తుతం రిమోట్ వర్క్ చేస్తున్న ఉద్యోగులు, తమ బృందాలతో కలిసి పనిచేయడానికి వీలుగా ఆయా ప్రాంతాలకు రీలోకేట్ కావాలని కంపెనీ సీఈవో దారా ఖోస్రోషాహి సిబ్బందికి ఇ-మెయిల్ పంపారు. ఉద్యోగుల కోసం న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కోలలో ప్రత్యేక హబ్‌లను ఏర్పాటు చేశారు. మేనేజర్లు, వారి కింద పనిచేసే సిబ్బంది ఒకే ప్రాంతంలో ఉండాలని కంపెనీ భావిస్తోంది. మేనేజ్‌మెంట్‌లో అనవసరమైన లేయర్లను తొలగించడంతో పాటు రైడ్ షేరింగ్, డెలివరీ, రోబోట్యాక్సీ వ్యాపారాల్లో పెట్టుబడులను సమీక్షించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ పేర్కొంది. కార్పొరేట్ ఉద్యోగులకే ఇది వర్తిస్తుంది. డ్రైవర్లు, ఇతర సిబ్బందిపై ఎలాంటి ప్రభావం ఉండదు.






## దలాల్ స్ట్రీట్‌లో సందడి..
## ఒకే రోజు ఆరు ఐపీఓలు ఎంట్రీ

**ముంబై(జనంసాక్షి):**దలాల్ స్ట్రీట్‌లో సందడి చేసేందుకు బుధవారం ఆరు మెయిన్ బోర్డు ఐపీఓలు ఎంట్రీ ఇచ్చాయి (6 ఎఖూబ నీజూవని బినీటజీఎ). సెప్టెంబర్ 9న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. సెప్టెంబర్ 11న ముగియనున్నాయి. మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్, రెంట్‌మోజో వంటి పలు కంపెనీల ఐపీఓలు ఉన్నాయి. వివరాలు పరిశీలిస్తే.. ఆన్‌లైన్ ఫర్నిచర్ అండ్ గృహోపకరణాల రెంటల్ ప్లాట్‌ఫాం రెంట్‌మోజో రూ.1,256 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వచ్చింది. రూ.150 కోట్ల తాజా షేర్లు, రూ.1,106 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు ఉన్నాయి. ధరల శ్రేణి రూ.384-404గా కంపెనీ నిర్ణయించింది. 93.08 లక్షల ఈక్విటీ షేర్లను యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయించింది. కంపెనీ షేర్లు సెప్టెంబర్ 17న స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ కానున్నాయి.



మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ రూ.805 కోట్ల నిధుల సమీకరణతో పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ధరల శ్రేణి రూ.322-339గా నిర్ణయించింది. ఇందులో రూ.320 కోట్ల తాజా షేర్లు, రూ.485 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. కరమ్‌తారా ఇంజినీరింగ్ రూ.875 కోట్ల నిధులను ఐపీఓ ద్వారా సమీకరించనుంది. రూ.675 కోట్ల తాజా షేర్లు, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు ఉన్నాయి. ధరల శ్రేణి రూ.241-254 కంపెనీ నిర్ణయించింది. రిటైల్ ఇన్వెస్టర్లకు 35 శాతం కేటాయించింది. కనీసం 59 షేర్లు (లాట్ సైజ్) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ప్రైస్ బ్యాండ్ వద్ద రూ.14,986తో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆర్సిల్ రూ.733 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఒక్కో షేరు ధర రూ.132-139గా నిర్ణయించింది. 5.27 కోట్ల ఈక్విటీ షేర్లను పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. కంపెనీ షేర్లు సెప్టెంబర్ 17న స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ కానున్నాయి. రిటెయిల్ ఇన్వెస్టర్లు గరిష్ఠ ప్రైస్ బ్యాండ్ రూ.14,873 వద్ద కనీసం 107 షేర్లు (లాట్ సైజ్) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ రూ.427 కోట్ల నిధులను ఐపీఓ ద్వారా సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.139-146గా కంపెనీ నిర్ణయించింది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. రిటెయిల్ ఇన్వెస్టర్లకు 35 శాతం కేటాయించారు. స్టీమ్‌హౌస్ ఇండియా రూ.414 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వచ్చింది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ధరల శ్రేణి రూ.77-81గా కంపెనీ నిర్ణయించింది. లాట్ సైజ్ 185 షేర్లు, గరిష్ఠ ప్రైస్ బ్యాండ్ రూ.14,985 వద్ద పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. రిటెయిల్ ఇన్వెస్టర్లకు 35 శాతం షేర్లను కేటాయించింది.

# అందుకే 'ఐఫోన్' స్పెషల్..

**చేతిలో ఐఫోన్ ఉంటే ఆ క్రేజే వేరు.. అనుకునే టెక్ ప్రియులు ఎందరో..! అందుకే యాపిల్ కొత్త ఫోన్ తెస్తుందంటే చాలు.. దాని కోసం తెగ ఆసక్తి చూపిస్తారు. ఆ ఫోన్లను దక్కించుకునేందుకు ఉదయాన్నే స్టోర్ల ముందు బారులు తీరిన సందర్భాలూ ఉంటాయి. వెనుక కన్పించే సగం కొరికిన యాపిల్ పండు నుంచి.. ఫోన్ రంగు, డిస్‌ప్లే వరకు ఐఫోన్‌లో ప్రతిదాన్నీ ప్రత్యేకంగానే భావిస్తారు. స్టేటస్ సింబల్ కోసం కొందరు.. సేఫ్టీ కోసం మరికొందరు.. ఇలా 'ఐఫోన్' అంటేనే చాలా స్పెషల్ అనేవాళ్లు ఎందరో..! ఇంతకీ ఎందుకీ ఫోన్ అంత ప్రత్యేకం. మరికొద్ది గంటల్లో ఐఫోన్ 18 సిరీస్ విడుదల కానున్న వేళ.. వీటి ప్రత్యేకతలు ఓసారి చూద్దాం..!**



హైదరాబాద్(జనంసాక్షి):
ఐఫోన్‌ను కొనుగోలు చేసేందుకు యూజర్లు ఎక్కువగా మొగ్గు చూపడానికి ప్రధాన కారణం యాప్ స్టోర్‌లో యాప్‌లకు ఉండే భద్రతే. ప్రతి యాప్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. మాల్‌వేర్ గానీ, ప్రమాదకర కోడ్ గానీ లేదని నిర్ధరించుకున్న తర్వాతే యాప్ స్టోర్‌లోకి తీసుకొస్తారు. అంతేకాదు.. యాప్‌లు సమాచారాన్ని తీసుకోవాలంటే యూజర్ల అనుమతి తప్పనిసరి. అందుకే చాలా మంది డెవలపర్లు కూడా ముందుగా యాప్ స్టోర్ కోసమే యాప్‌లను తయారుచేస్తారు. ఐఫోన్ల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రెండూ యాపిల్ చేతుల్లోనే ఉంటాయి. అందువల్ల ఫోన్లలో చాలా స్థిరమైన, వేగవంతమైన రెస్పాన్స్ ఉంటుంది. ఇక, దీని బ్యాటరీ లైఫ్, హీట్ మేనేజ్‌మెంట్ కూడా మిగతా కంపెనీలతో పోలిస్తే మెరుగ్గా ఉంటాయి. యాపిల్ సొంతంగా డిజైన్ చేసిన ప్రాసెసర్లు, మైక్రోచిప్‌లు కూడా ఈ ఫోన్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. దీంతో పాటు యాపిల్ ఏడేళ్ల పాటు ఐఫోన్లకు అప్‌డేట్లు, సపోర్టులు ప్రకటిస్తుంది. దీని వల్ల పాత ఫోన్ అయినా సరే.. రీసెట్ చేసి కొన్నేళ్లు పాటు కొత్తదానిలా వాడుకునే వీలుంటుంది. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీని తొలుత ఐఫోన్లలోనే తీసుకొచ్చారు. అప్పుడు కొన్ని సమస్యలు ఎదురైనా యాపిల్ వాటిని పరిష్కరించి.. ఈ ఫేస్ ఐడీని అత్యంత భద్రమైన ఆప్షన్‌గా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక, దీంతో పాటు యాపిల్ ఐడీ కూడా ఇందులో ప్రత్యేకం. ఈ ఐడీతో యాపిల్ ఎకోసిస్టమ్‌కు, డివైజ్‌లకు యూజర్ ఖాతా అనుసంధానమవుతుంది. ఇక, 'సెక్యూర్ ఎన్‌క్లేవ్' ఫీచర్‌తో యూజర్ల వ్యక్తిగత డేటా భద్రంగా ఉంటుంది. ఒకవేళ ఫోన్‌లో ఏదైనా చొరబాటు జరిగినట్లు గుర్తిస్తే.. వెంటనే ఒక ప్రాసెసర్ ప్రధాన ప్రాసెసర్ నుంచి విడిపోతుంది. అప్పుడు వ్యక్తిగత సమాచారం హ్యాకర్ల చేతికి చిక్కకుండా ఉంటుంది. ఇక, యూజర్లు ఐఫోన్‌ను ఎంచుకోవడానికి మరో ప్రధాన కారణం 'యాపిల్ ఎకోసిస్టమ్'. దీని వల్ల యాపిల్ ఉత్పత్తులు అన్నింటితో ఐఫోన్ ఇంటిగ్రేట్ అయి ఉంటుంది. దాంతో ఫోన్ నుంచి ఐప్యాడ్, మ్యాక్‌బుక్‌ల వంటి డివైజ్‌లకు సులువుగా ఫైళ్లు, డేటాను షేర్ చేసుకోవచ్చు. యాపిల్ ఐడీ సాయంతో ఒక డివైజ్‌లో ఆపిన పనిని.. మరో డివైజ్‌లో కొనసాగించే వెసులుబాటూ ఉంటుంది. ఐఫోన్‌లో కెమెరా నాణ్యత కూడా అదనపు ఫీచర్. యాపిల్ ట్రేడ్-ఇన్ పాలసీ కూడా యూజర్లకు ఆకర్షణీయంగా ఉంటుంది. దీని కింద పాత ఐఫోన్లను యాపిల్‌కు చెందిన ఏ స్టోర్‌లోనైనా గానీ, మెయిల్ ద్వారా గానీ ఎక్స్ఛేంజ్ చేసుకోవచ్చు. రీసైక్లింగ్ సదుపాయమూ ఉంది. ఇక, ఐఫోన్లకు రీసేల్ విలువ కూడా ఎక్కువే. సంవత్సరాల తర్వాత కూడా మంచి ధరే దక్కుతుంది. యూజర్ల ఆరోగ్య స్థితికి సంబంధించిన కొన్ని హెల్త్ ఫీచర్లు కూడా ఐఫోన్లలో ప్రత్యేకంగా ఉంటాయి.

**ఇవి భరించాల్సిందే..**

ఇన్ని ప్రత్యేకతలున్నప్పటికీ.. ఐఫోన్లలోనూ కొన్ని లోటుపాట్లు ఉన్నాయి. మిగతా ఫోన్లతో పోలిస్తే వీటి ధర చాలా ఎక్కువే. ఇక, ఇందులో మెమొరీ కార్డు వేయడమూ సాధ్యం కాదు. ఫోన్లలో కస్టమైజేషన్ కూడా సులువుగా ఉండదు. ఛార్జర్, కేబుల్ వేరు వేరుగా కొనాల్సిందే.

# ఏఐతో మానవాళికి పెనుముప్పు..




## వచ్చే పదేళ్లలో తీవ్ర పరిణామాలు:ఇవాన్ హుబింగర్

హైదరాబాద్(జనంసాక్షి):
కృత్రిమ మేధ శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న తీరు ఆందోళన కలిగిస్తోంది. రానున్న పదేళ్లలో 10 శాతానికి పైగా మనుషులు ఏఐ కారణంగా మరణించే అవకాశం ఉందని ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్‌కు చెందిన పరిశోధకుడు ఇవాన్ హుబింగర్ హెచ్చరించారు. ప్రస్తుతం ఈ ముప్పు తక్కువగానే ఉందన్నారు. ఏఐ తనను తాను మెరుగుపరుచుకునే స్థాయికి చేరితే.. పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. సాధ్యమైనంత వరకు ఆంత్రోపిక్ దీనిని ఎదుర్కొనేందుకు కృషి చేస్తుందని చెప్పారు. సూపర్ ఇంటెలిజెన్స్‌తో వచ్చే ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు స్పష్టమైన ప్రణాళికలు లేవని హుబింగర్ తెలిపారు. ఏఐ అభివృద్ధికి తగ్గట్లుగా.. అదే స్థాయిలో భద్రతాపరమైన చర్యలు సాగడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు.. ఓపెన్ ఏఐ ప్రధాన శాస్త్రవేత్త జాకబ్ పచోచ్కి ఏఐ పురోగతిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ మానవుల నియంత్రణలోనే ఉండాలన్నారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఏఐ వ్యవస్థలు వాటంతటా అవే పనులు చేసే సామర్థ్యం పెరగడమే ఈ ఆందోళనలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. తగిన నియంత్రణ లేకపోతే భవిష్యత్తులో ఏఐని అదుపు చేయడం కష్టమేనని హెచ్చరిస్తున్నారు. ఇటీవల అమెరికాలో 1,300 మంది ఏఐ రంగ నిపుణులు.. ఏఐ వ్యవస్థలు సమాజానికి ముప్పుగా మారకుండా అంతర్జాతీయ స్థాయిలో భద్రతా నిబంధనలు తీసుకురావాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ ప్రయత్నానికి యూఎస్ ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని కోరారు. ఆ లేఖపై ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అగ్రశ్రేణి ఏఐ ల్యాబ్స్, ఐటీ కంపెనీలకు చెందిన పరిశోధకులు, ఇంజినీర్లు, ఉద్యోగులు సంతకం చేశారు.

## పీఎఫ్ అడ్వాన్స్ కొత్త రూల్స్..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఈపీఎఫ్ నుంచి ఉపసంహరణలను ఈపీఎఫ్‌వో మరింత సులభతరం చేసింది. ఇకపై చందాదారుడు తమ వైద్య అవసరాల కోసం నిబంధనలను అనుసరించి ఎన్నిసార్లయినా నగదు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటును కల్పించింది. ఈ మేరకు ఈపీఎఫ్ అడ్వాన్స్‌కు సంబంధించి కొత్త నిబంధనలను ఈపీఎఫ్‌వో వెల్లడించింది. ఉద్యోగులు, కార్మికుల వ్యక్తిగత ఈపీఎఫ్ నిధిలో కనీసం 25% నిల్వ ఉంచి మిగిలిన మొత్తాన్ని మాత్రమే ఉపసంహరించుకునేలా ఇప్పటికే సీబీటీ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈపీఎఫ్ సభ్యత్వం 12 నెలలు దాటిన తర్వాత చందాదారులు తమ ఈపీఎఫ్ బ్యాలెన్స్ నుంచి 75శాతం వరకు నిధులను విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంది. ఈ పాక్షిక ఉపసంహరణల కోసం గతంలో ఉన్న 13 రకాల సంక్లిష్ట నిబంధనలను విలీనం చేసి.. అత్యవసర గృహ సంబంధించిన అవసరాలు, ప్రత్యేక పరిస్థితులు అనే మూడు విభాగాలుగా వర్గీకరించింది.

## ఎన్ఎస్ఈ ఐపీఓ విలువ తగ్గొచ్చు..

### రూ.27 వేల కోట్లకు కుదింపు!




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ పబ్లిక్ ఇష్యూ పరిమాణం తగ్గే అవకాశం ఉంది. ఇటీవల మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఎన్ఎస్ఈ ఐపీఓకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. తొలుత 6 శాతం షేర్లను ఆఫర్ ఫర్ సేల్ విధానంలో విక్రయించాలని ఎన్ఎస్ఈ భావించింది. అయితే, తాజాగా ఆ వాటాను 5.2 - 5.5 శాతానికి కుదిం చినట్లు తెలుస్తోంది. కొందరు వాటాదారులు తమ విక్రయాలను వెనక్కి తీసుకోవడమే ఇందుకు ప్రధాన కారణమని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్ఎ స్ఈ రూ.30 వేల కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు రావాలని భావించింది. అయితే, భవిష్యత్తులో తమ షేర్లకు మరింత అధిక విలువ వస్తుందనే నమ్మకంతో కొందరు వాటాదారులు తమ ఆఫర్ ఫర్ సేల్ షేర్లను వెనక్కి తీసుకున్నట్లు సమాచారం. దీనివల్ల ఎన్ఎస్ఈ ఐపీఓ విలువ రూ.25- 27 వేల కోట్లకు పరిమితం కానుంది. ఒక్కో షేరు ధర రూ. 1,700-1,785 మధ్య ఉండే అవకాశం ఉంది. సెప్టెంబర్ 18న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. 21న ముగుస్తుందని, సెప్టెంబర్ 26న స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఉద్యోగ నియామకాల్లో హైదరాబాదే టాప్..

### మెట్రో నగరాల్లో 23 శాతంతో అగ్రస్థానం

### నౌకరీ జాబ్‌స్పీక్ వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):
దేశంలో ఉద్యోగ నియామకాల విషయంలో హైదరాబాద్ సరికొత్త రికార్డు సృష్టించింది. దేశంలోని ఇతర పెద్ద మెట్రో నగరాలన్నింటినీ వెనక్కి నెట్టి, నియామకాల వృద్ధిలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఈసారి హైదరాబాద్‌లో నియామకాలు 23% మేర పెరిగాయి. దేశీయ నియామక మార్కెట్ సరళిని అంచనా వేస్తూ నౌకరీ.కామ్ విడుదల చేసిన జాబ్‌స్పీక్ ఇండెక్స్ నివేదిక ఈ అంశాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా కార్యాలయ ఉద్యోగాల మార్కెట్‌లో స్పష్టమైన పురోగతి కనిపించింది. ఆగస్టులో వార్షిక ప్రాతిపదికన 14 శాతం వృద్ధి నమోదైంది. గతేడాది ఇదే నెలలో 2,664 పాయింట్లుగా ఉన్న నౌకరీ జాబ్‌స్పీక్ సూచీ ఈసారి 3,028 పాయింట్లకు పెరిగింది. ఐటీతోపాటు, ఐటీయేతర రంగాల్లోనూ, అన్ని స్థాయిల అనుభవజ్ఞుల విభాగాల్లోనూ నియామకాలు పెరగడం విశేషం. ఈ నియామకాల ధోరణిని పండగల సీజన్ మార్పుతో ముడిపెట్టి చూడాలని విశ్లేషకులు భావిస్తున్నారు. గతేడాది పండగల సీజన్ ఆగస్టులోనే ప్రారంభం కాగా, ఈసారి అది సెప్టెంబరుకు మారడం నియామకాల గణాంకాలపై ప్రభావం చూపింది. పండగల త్రైమాసికం పూర్తయితేనే మార్కెట్ అసలైన పురోగతిపై మరింత స్పష్టత వస్తుందని ఇన్ఫో ఎడ్జ్ (ఇండియా) లిమిటెడ్ ఎండీ, సీఈఓ హితేశ్ ఒబెరాయ్ వివరించారు. వివిధ రంగాల వారీగా విశ్లేషిస్తే.. వాహన విభాగంలో నియామకాలు 19% వృద్ధితో ముందంజలో నిలిచింది. ఆరోగ్య సేవలు 16%, రిటెయిల్ విభాగం 15 శాతంతో మెరుగైన ప్రదర్శన చేశాయి. బీమాలో 12%, సాఫ్ట్‌వేర్‌లో 11% కొత్త అవకాశాలు లభించాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగాలు చెరో 10 % వృద్ధిని నమోదు చేయగా.. బీపీఓ/ఐటీఈఎస్, చమురు-గ్యాస్, స్థిరాస్తి రంగాలు 8% చొప్పున వృద్ధి చెందాయి. ఫార్మా, బయోటెక్ రంగాలు గతేడాది స్థాయిలోనే స్థిరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు, పర్యాటక-ఆతిథ్యంలో 4%, విద్యా రంగంలో 8% చొప్పున నియామకాలు తగ్గాయి. ఉద్యోగ మార్కెట్‌లో అనుభవం ఉన్న వారి కోసమే సంస్థలు ఎక్కువగా చూస్తున్నాయి. కొత్తగా ఉద్యోగాన్ని ప్రారంభించే ఫ్రెషర్ల నియామకాల్లో 15 శాతం వృద్ధి నమోదైంది. 4 - 7 ఏళ్ల అనుభవం ఉన్న వారి విభాగంలో 10%; 8-12 ఏళ్ల విభాగంలో 16%; 13 నుంచి 16 ఏళ్ల అనువజ్ఞులకు 18 %, 16 ఏళ్లకు పైబడిన సీనియర్లకు 13% చొప్పున కొత్త అవకాశాలు లభించాయి. నగరాల వారీగా చూస్తే హైదరాబాద్ తర్వాతి స్థానాల్లో కోల్‌కతా 22%, చెన్నై 20 శాతంతో వృద్ధిని సాధించాయి. ఐటీ ప్రధాన కేంద్రాలైన బెంగళూరు, పుణె నగరాలు 14% చొప్పున వృద్ధి సాధించగా, దిల్లీ ఎన్‌సీఆర్ 10%, ముంబయి 7% చొప్పున నియామకాలను పెంచుకున్నాయి. రెండో శ్రేణి నగరాల్లో ఒడిశా రాజధాని భువనేశ్వర్ 32% నియామకాల వృద్ధితో దూసుకుపోయింది. రాయ్‌పూర్ 23%, సూరత్ 21%, రాంచీ 19 శాతంతో మెరుగైన వృద్ధిని నమోదు చేశాయి. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో ఉద్యోగ నియామకాల విషయంలో భారత్ ప్రపంచంలోనే తొలి స్థానంలో నిలిచింది. మ్యాన్‌పవర్ గ్రూపు తాజా 'ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ సర్వే' ప్రకారం 2026 నాలుగో త్రైమాసికంలో భారత నికర ఉద్యోగ నియామకాల ఉద్దేశం 54 శాతంగా నమోదైంది. గత త్రైమాసికంతో పోలిస్తే ఇది 6%, గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 11% అధికం. దేశవ్యాప్తంగా 3,055 సంస్థలపై నిర్వహించిన సర్వేలో 65 శాతం సంస్థలు అక్టోబరు-డిసెంబరు మధ్య ఉద్యోగుల సంఖ్యను పెంచాలని భావిస్తున్నాయి. 11% సంస్థలు మాత్రమే తగ్గింపును అంచనా వేస్తుండగా, 24% సంస్థలు ఉద్యోగుల సంఖ్యలో మార్పు ఉండదని తెలిపాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
10 సెప్టెంబర్ 2026

# నవీన ఆలోచనలతో స్టార్టప్‌ల వైపు యువత



**గోదావరిఖని, జనంసాక్షి :** విద్యార్థులు నవీన ఆలోచనలతో ముందుకు వచ్చి, వాటిని వ్యాపార అవకాశాలుగా మార్చుకొని భవిష్యత్తులో విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పలువురు వక్తలు సూచించారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న (వ్యవస్థాపకత అభివృద్ధి – అవకాశాలు, సవాళ్లు) రెండు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా రెండో రోజు కార్యక్రమం బుధవారం విజయవంతంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ అనే అంశంపై ఎం ఎస్ ఎం ఈ కరీంనగర్ జిల్లా మేనేజర్ పైడిమల్ల దేవేందర్ సార్ విద్యార్థులకు విలువైన సమాచారాన్ని అందించారు. నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతను ఉపయోగించుకొని కొత్త అవకాశాలను ఎలా సృష్టించుకోవచ్చో వివరించారు. స్టార్టప్‌లను ప్రారంభించేందుకు అవసరమైన ప్రాథమిక అంశాలు, అందుబాటులో ఉన్న అవకాశాలు, ఎదురయ్యే సవాళ్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.
అనంతరం వ్యాపార దృక్పథం కలిగిన ఆలోచనా ధోరణిని అభివృద్ధి చెయ్యడం) అనే అంశంపై కరీంనగర్, శాతవాహన యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్ డా. మనోజ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యాపార వేత్తగా) ఎదగాలంటే కేవలం బిజినెస్ ఐడియా ఉంటే సరిపోదని, ఆ ఆలోచనను ఆచరణలో పెట్టేందుకు సరైన దృక్పథం, ఆత్మవిశ్వాసం, సృజనాత్మక ఆలోచన, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం అవసరమని వివరించారు. అలాగే బిజినెస్ మోడల్ అండ్ బేసిక్ బిజినెస్ ప్లాన్ అనే అంశంపై శాతవాహన యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్ డా. కంచు తిరుపతి విద్యార్థులకు విలువైన సమాచారాన్ని అందించారు. ఒక బిజినెస్ ఐడియాను విజయవంతమైన వ్యాపారంగా మార్చుకోవడానికి అవసరమైన బిజినెస్ మోడల్ మార్కెట్ అవసరాలు, కష్టమర్ల అవసరాలు, ఆదాయ మార్గాలు మరియు ప్రాథమిక బిజినెస్ ప్లాన్ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించుకొని, కొత్త ఆలోచనలను అభివృద్ధి చేసి, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురు చూడటం కాకుండా భవిష్యత్తులో ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.
రెండు రోజుల వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు అంశాలపై ప్రాథమికంగా, ఆచరణాత్మకంగా అవగాహన కల్పించామని వర్క్ షాప్ కోఆర్డినేటర్ వి. ఆంజనేయులు అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా, వైస్ ప్రిన్సిపాల్ ఏ. సాంబశివరావు, సీనియర్ అధ్యాపకుడు జి .సుబ్బారావు, కామర్స్ విభాగం అధ్యక్షులు మరియు వర్క్ షాప్ కోఆర్డినేటర్ వి. ఆంజనేయులు, కామర్స్ అధ్యాపకులు డా. ఎం. నరేష్, డా. అజయ్ కుమార్, డా. బి. రవీందర్, డా. కిరణ్ కుమార్, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్.. 25 తులాల బంగారం స్వాధీనం

- దొంగ సొత్తు కొనుగోలు చేసిన వ్యాపారులపై కఠిన చర్యలు
- వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా




**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 9 (జనం సాక్షి):** వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికంఠ నగర్ కాలనీలో మే 1న రాత్రి ఓ ఇంట్లో చోరీ చేసి బంగారం నగదు అపహరించిన కేసులో అంతర్రాష్ట్ర కరుడుగట్టిన దొంగ వికాస్ సింగ్ అలియాస్ తేజా సింగ్ ను అరెస్టు చేసినట్లు వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా ఒక ప్రకటనలో తెలియజేశారు. నిందితుడు నుంచి 25 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. ఈ కేసులో వికారాబాద్ జిల్లా సిసిఎస్ వికారాబాద్ టౌన్ పోలీసులు కీలక పురోగతి సాధించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు, డీఎస్పీ అంజయ్య పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఇట్టి కేసులో ఇప్పటికే అరెస్టు అయి జైలు లో ఉంటున్న వికాస్ సింగ్‌ను పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ విచారణలో నిందితుడు వెల్లడించిన సమాచారంతో సీసీఎస్ పోలీసులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సుల్తాన్‌పూర్ జిల్లా కుదువర్ టౌన్‌లోని బాబా సాలిక్ రామ్ బంగారం దుకాణం నుంచి తన తల్లి లీలావతి ద్వారా గిరవు పెట్టిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 7 కేసులు పరిగి పిఎస్ పరిధి లోని ఒక కేసు మొత్తం 8 కేసులకు సంబంధించిన సుమారు 25 తులాల బంగారాన్ని రికవరీ చేశారు. నిందితుడి విచారణలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. చోరీ చేసిన బంగారాన్ని యూపీలోని కుదువర్ ఇతర ప్రాంతాల్లోని కొందరు బంగారం వ్యాపారులకు విక్రయించేవాడని తేలింది. అశోక్ కుమార్ సోనీ, వికాస్ అగ్రహారి తదితరుల బంగారం దుకాణాల నుంచి కూడా దొంగసొత్తును రికవరీ చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది.

**రిసీవర్లపై కఠిన చర్యలు**
దొంగసొత్తును కొనుగోలు చేసే రిసీవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. దొంగసొత్తును ప్రోత్సహించడం, కొనుగోలు చేయడం ద్వారా నేరాలకు సహకరించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రికవరీలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, సిబ్బంది జయవర్ధన్, శివకుమార్, సాయప్ప, రామకృష్ణ, రాజు, శివరాజ్, వెంకటేష్, పాండురంగం పాల్గొన్నారు. అంతర్రాష్ట్ర నిందితుడిని పట్టుకుని, కస్టడీ విచారణ ద్వారా దొంగసొత్తును రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్, వికారాబాద్ టౌన్ పోలీసులను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ప్రత్యేకంగా అభినందించారు.

## ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 09(జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి)తో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి తెలిపారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపి సిబి) ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్లను లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత విగ్రహాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరుల పరిరక్షణతో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ సైంటిస్ట్ ఈ. కనకజ్యోతి, ఏవో పెద్దపల్లి బి. ప్రకాష్, సూపరింటెండెంట్ కోటేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణి ,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భాషా యాసకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ప్రజాకవి కాళోజీ


- కరీంనగర్‌లో కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు : మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) :**
కరీంనగర్ నగరంలోని రేకుర్తి 19వ డివిజన్‌లో ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు 112వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు విగ్రహానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల జీవితాలను, వారి భావోద్వేగాలను, భాషా యాసను తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన మహోన్నత ప్రజాకవి అని కొనియాడారు. తెలంగాణ భాషలోని మాధుర్యాన్ని, తెలంగాణ యాసలోని ప్రత్యేకతను తన సాహిత్యంతో ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి కాళోజీ అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అసమానతలు, ప్రజా సమస్యల పై తన కలం ద్వారా నిరంతరం పోరాడిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కాళోజీ ఆలోచనలు, రచనలు, ప్రజాస్వామ్య విలువలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. కాళోజీ నారాయణరావు వంటి మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ గౌడ్, కాళోజీ నగర్ కాలనీల అధ్యక్షులు రమణారెడ్డి, నారాయణరెడ్డితో పాటు పలువురు డివిజన్ నాయకులు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# స్కూల్‌కు రాకున్నా జీతాలు.. ఎంఈఓ, హెచ్‌ఎంలను సస్పెండ్ చేయాలి

**కప్పపహాడ్ మాజీ స్కూల్ చైర్మన్ పల్లపు విఘ్నేశ్**


**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 9(జనం సాక్షి) :** పాఠశాలలకు సరిగ్గా హాజరుకాని ఉపాధ్యాయులకు అండగా నిలుస్తూ, వారు విధులకు రాకపోయినా జీతాలు ఇప్పిస్తున్న ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారి (ఎంఈఓ) హీర్యానాయక్‌తో పాటు ఇద్దరు హెడ్ మాస్టర్లను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని కప్పపహాడ్ మాజీ స్కూల్ చైర్మన్ పల్లపు విఘ్నేశ్ బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్, శేరిగూడ పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కప్పపహాడ్ స్కూల్ టీచర్ తిరుపయ్య గత ఏడాది కాలంగా బడికి రావడం లేదని, వచ్చినా నిద్రపోతున్నా ఎలాంటి చర్యలు లేవన్నారు. అలాగే మరో టీచర్ పరమేష్ ఏడాది పొడవునా విధులకు రాకుండా, బయట 'ఆన్ డ్యూటీ' పేరుతో తిరుగుతున్నా శేరిగూడ హెడ్ మాస్టర్ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం క్లస్టర్ హెడ్ మాస్టర్ వెంకట్ రెడ్డిలు వారికి జీతాలు చేస్తున్నారని మండిపడ్డారు. పీఆర్టీయూ సంఘం అండదండలతో ఎంఈఓ హీర్యానాయక్ ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని, దీనిపై ఏడాదిగా జిల్లా విద్యాధికారి (డీఈఓ)కి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విఘ్నేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. బడి దొంగలను వెనకేసుకొస్తున్న ఎంఈఓను, హెచ్‌ఎంలను వెంటనే విధులనుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.




# హైకోర్టులో మట్టి గణేశ విగ్రహాల పంపిణీ

- మట్టి గణేశ విగ్రహాలను ప్రోత్సహించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- జలాశయాల పరిరక్షణకు మట్టి గణేశుడిని ఎంచుకోవాలి
- పర్యావరణ హితంగా వినాయక చవితి నిర్వహణకు పిలుపు

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** పర్యావరణహిత వినాయక చవితి వేడుకలను ప్రోత్సహించే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు లో మట్టి గణేశ విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, పలువురు న్యాయవాదులతో పాటు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్,ఐఏఎస్ హాజ రయ్యారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పిఒపి) విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి విగ్రహాలను ఉప యోగించాలని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మట్టి విగ్రహాలను విని యోగించడం ద్వారా హైదరాబాద్‌లోని చెరువులు, జలాశయాలు, పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని కార్యక్రమంలో పేర్కొన్నారు. పండుగల సమయం లో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత గా వ్యవహరించాలని, సుస్థిర పద్ధతులను పాటిం చాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. అలా గే గణేశ విగ్రహాల నిమజ్జనానికి సరైన ఏర్పాట్లు, సామూహిక భాగస్వామ్యం ప్రాధాన్యతను ఆయన వివరించారు. పర్యావరణహిత వేడుకల నిర్వహ ణకు న్యాయమూర్తులు, న్యాయవాదులు మద్దతు తెలిపారు. మట్టి గణేశ విగ్రహాలను ఎంచుకుని పర్యావరణాన్ని, మన జలాశయాలను కాపాడాలని కార్యక్రమ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# తెలంగాణ వీరవనితల స్ఫూర్తి యాత్ర..

**అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)**




**ముషీరాబాద్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరవనితల స్ఫూర్తిని నేటి తరానికి అందించేందుకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు తెలంగాణ వీరవనితల స్ఫూర్తి యాత్ర నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం వీరనారి ఐలమ్మ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం అనంతరం ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవిల స్ఫూర్తి యాత్ర గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఐలమ్మ జన్మస్థలమైన పాలకుర్తి నుంచి ప్రారంభమయ్యే యాత్ర కడివెండి, భైరాన్‌పల్లి, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాకకు చేరుకుంటుందని తెలిపారు. అక్కడ అమరవీరుల స్మారక సభతో యాత్ర ముగుస్తుందన్నారు. యాత్రలో మహిళలు, యువత, విద్యార్థులు, అభ్యుదయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.ఎన్. ఆశాలత, ఉపాధ్యక్షురాలు పి. శశికళ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల గైర్హాజరుపై మాజీ కార్పొరేటర్ వినూత్న నిరసన

**మధ్యాహ్నం 12 దాటినా అందుబాటులో లేని అధికారులు**

- గేట్లకు తాళం వేసేందుకు ప్రయత్నం.. కార్యాలయంలోనే క్రికెట్ ఆడిన మాజీ కార్పొరేటర్
- అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




**మల్కాజిగిరి, సెప్టెంబర్ 9 (జనం సాక్షి):** మల్కాజిగిరి సర్కిల్, జోనల్ కార్యాలయంలో అధికారుల గైర్హాజరుపై మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాల యానికి వస్తున్నా అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 12 గంటలు దాటినా పలు విభాగాల్లో ఖాళీ కుర్చీలు, తిరుగుతున్న ఫ్యాన్లు మాత్రమే కనిపించాయని అన్నారు. అధికారుల కోసం ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో లేని కార్యాలయం ఎందుకంటూ ప్రధాన గేటుకు తాళం వేసేందుకు ప్రయత్నించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం కార్యాలయ ప్రాంగణంలోనే బ్యాట్ పట్టుకుని క్రికెట్ ఆడి నిరసన తెలిపారు. ప్రజా సమస్యలతో రద్దీగా ఉండాల్సిన కార్యాలయం ఖాళీ మైదానాన్ని తలపిస్తోందంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని జోనల్ కమిషనర్ సంచిత్ గాగ్వార్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా ఫోన్ స్పందించలేదని తెలిపారు.
కార్యాలయ వేళల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విధులకు గైర్హాజరవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## గ్యాస్ సిలిండర్‌లో నిలువు దోపిడీ

**కథలాపూర్, (జనంసాక్షి):** కథలాపూర్ మండ లం చింతకుంట గ్రామంలో గ్యాస్ సిలిండర్ల అక్రమ మార్పిడి జరుగుతోందని గ్రామస్తులు ఆరోపించారు. ఓ సంస్థకు చెందిన డెలివరీ సిబ్బంది నిండు గ్యాస్ సిలిండర్ నుంచి ఖాళీ సిలిండర్‌లోకి గ్యాస్ నింపుతున్నట్లు గుర్తించిన గ్రామస్తులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో డెలివరీ సిబ్బంది సిలిండర్ ఆటోను అక్కడే వదిలి పరారైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న సర్పంచ్ నాగం భూమయ్య, గ్రామస్తులు వాహనాన్ని సిలిండర్లతో సహా గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉంచారు. ఇలాంటి ఘటనలపై అధికారులు విచారణ జరిపి, ప్రజలను మోసం చేస్తున్న సంస్థలు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# జీఓ 81, 85 అమలు చేసి, వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

**ముషీరాబాద్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి):** జీఓ నెం.81, 85 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు కల్పించి దళిత, బలహీన వర్గాల కుటుంబాలకు న్యాయం చేయాలని వీఆర్ఏ వారసులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద గల ధర్నా చౌక్ లో బుధవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, గత ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్ఏలకు పేస్కేల్‌తో పాటు వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 20,555 మంది వీఆర్ఏల్లో 16,758 మందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసినప్పటికీ, ఇంకా 3,797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. మూడేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలు ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కొందరు అప్పుల భారంతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు 340 మందికి పైగా వీఆర్ఏలు మరణించారని పేర్కొన్నారు. ప్రస్తుతం రెవెన్యూ పనుల్లో వీఆర్ఏ వారసులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి ఉద్యోగాలు కల్పిస్తే రెవెన్యూ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.
ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారం లేకుండా 3,797 మంది వీఆర్ఏ వారసులకు తండ్రుల స్థానంలో ఉద్యోగ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వంగూరు రాములు, రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్, ఉపాధ్యక్షులు భరత్, హరీష్, సాగర్, శ్రీకాంత్, రవిసాగర్, యాదవ్, నగేష్, సంగమహేశ్వర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా అస్మిత ఖేలో ఇండియా రగ్బీ టోర్నీ

- క్రీడలతో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతాయి
- బాలికలు క్రీడల్లో మరింతగా రాణించాలి
- ప్రతిభకు టోర్నీలు చక్కని వేదికలు : నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు బాలికలను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా సిటీ లెవల్ రగ్బీ టోర్నమెంట్ కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో బుధవారం ఘనంగా జరిగింది. వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. ఖేలో ఇండియా–అస్మిత కార్యక్రమాల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులను గుర్తించి శిక్షణ, పోటీ వేదికలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలు క్రీడల్లో మరింతగా పాల్గొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కరీంనగర్ జిల్లాలో రగ్బీ అభివృద్ధికి రగ్బీ అసోసియేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. ఇలాంటి పోటీలతో క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ శివకృష్ణ, పెద్దపల్లి జిల్లా సెక్రటరీ రామకృష్ణ, సిద్దిపేట జిల్లా సెక్రటరీ అజయ్, రాజన్న సిరిసిల్ల జిల్లా సెక్రటరీ హనుమంతు, జగిత్యాల జిల్లా సెక్రటరీ మహిపాల్, వెంకటేశ్వర హాస్పిటల్ అడ్మిన్ వెంకటేశ్వర్లు, రగ్బీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అక్రమ అరెస్టుల్ని ఖండించండి

**నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు సిపిఎం**



**హయత్ నగర్, సెప్టెంబర్ 9 (జనం సాక్షి) :** హయత్ నగర్ చలో అంగన్వాడిని అడ్డుకొనడం కోసం తెల్లవారకముందుకే అంగన్వాడీల ఇండ్ల ముందు అడ్డాలు వేసి అక్రమ అరెస్టు చేయడానికి సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులకు తీవ్రంగా ఖండించారు. అంగన్వాడీలకు అధికారంలోకి రాకముందు చేసిన వాగ్దానాలని తక్షణమే అమలు చేయాలని, అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, రిటైర్మెంట్ సమయంలో గ్రాడ్యుటి చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అంగన్వాడీ సిబ్బందికి హక్కుల రక్షణ కల్పించాలని, విధులకు సంబంధం లేని అదనపు పనులను తొలగించాలని, అనే డిమాండ్లతో చేస్తున్న పోరాటాన్ని అడ్డుకున్న రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతుందని ఈ చర్యలను ప్రజలు ప్రజాతంత్ర వాదులు తీవ్రంగా ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వము కార్మికులను బానిసలు చేసే నాలుగు లేబర్ కోడులను తెచ్చి కార్మికులను ఉద్యోగులను బానిసలుగా చేస్తున్నారని, అదనపు పనిగంటలకు చేయుటకు అందులో ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న చట్టాలకు భిన్నంగా చేయడం దుర్మార్గమైన చర్య అని, ఇలాంటి చర్యలు అన్నీ కూడా భారత ప్రజాస్వా మ్యాన్ని గొడ్డలి పెట్టి లాంటివని అన్నారు, తక్షణమే కార్మిక వర్గంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రజలు ఎదుర్కొంటున్న ఉద్యోగ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అక్రమంగా అరెస్ట్ అయిన వారు డి మంజుల, ఎం గిరిజ, జి శ్రీలత, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి తదితరులను అరెస్టు చేశారు.

# సింగరేణి పరిరక్షణకు ఐక్య పోరాటం

- 12వ వేతన ఒప్పంద ప్రక్రియను వేగవంతం చేయాలి
- జేబీసీసీఐ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి
- సంస్థకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలి
- పెండింగ్ కార్మిక సమస్యలను పరిష్కరించాలి



**గోదావరిఖని, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** సింగరేణి సంస్థను పరిరక్షించడంతో పాటు కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమాన్ని కాపాడేందుకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లాల శ్రీనివాస్ అన్నారు. గోదావరిఖనిలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి పరిరక్షణ–12వ వేతన ఒప్పంద సాధన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణి సహా బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతన సవరణకు సంబంధించి 12వ వేతన ఒప్పంద ప్రక్రియను వేగవంతం చేయాలని, 12వ జేబీసీసీఐ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి కార్మిక సంఘాలతో చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వేతనాలు, సేవా నిబంధనలు, ఉద్యోగ భద్రత, వైద్యం, సంక్షేమం తదితర సమస్యల పరిష్కారానికి జేబీసీసీఐ కీలక వేదిక అని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలు పేరుకు పోవడం ఆందోళనకరమని, సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలంటే బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని కోరారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి మాట్లాడుతూ సంస్థ ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల పునర్వ్యవస్థీకరణపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర వాటాను 51 శాతానికి, రాష్ట్ర వాటాను 49 శాతానికి మార్చితే రాజకీయ జోక్యం తగ్గి సంస్థ స్వయం ప్రతిపత్తి, వృత్తిపరమైన నిర్వహణ బలోపేతమవుతుందని తెలిపారు. ఖాళీ పోస్టుల భర్తీ, ప్రమోషన్లు, వేతన సమస్యలు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, వైద్య సదుపాయాలు, గని భద్రత, ఉద్యోగ భద్రత తదితర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. కొత్త బొగ్గు బ్లాకులు సాధించడం, కొత్త గనుల ఏర్పాటు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని వేగవంతం చేయాలని సూచించారు. సింగరేణి పరిరక్షణ, 12వ వేతన ఒప్పందం, బకాయిల విడుదల, కార్మిక సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణపై సదస్సులో చర్చించారు. కార్యక్రమంలో ఏబీకేఎంఎస్ నాయకులు మంద రమాకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, వైస్ ప్రెసిడెంట్ వై.సారంగపాణి, బీఎంఎస్ జిల్లా కార్యదర్శి సాయవేని సతీష్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరావు, ఎస్సీ, బీసీ సంఘాల ప్రతినిధులు దుర్గప్రసాద్, దేవాచారి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో కార్మికులు హాజరయ్యారు.

# కేసీఆర్‌పై వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు

- సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి
- కేసీఆర్ మరణాన్ని కోరుతూ వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్



గోదావరిఖని, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు హేయమైన వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. కేసీఆర్ మరణాన్ని కోరుతూ, భౌతిక దాడులను ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ తదితరులపై బీఎన్ఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం చందర్ మాట్లాడుతూ.. కేసీఆర్ రాష్ట్రానికి పట్టిన పీడ అంటూ, ఆయన చావును కోరుకుంటూ వెయ్యి డప్పులతో ర్యాలీ తీస్తామని ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. కేసీఆర్‌పై భౌతిక దాడులకు ప్రేరేపించేలా కొందరిని ఉసిగొల్పడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఇలాంటి వ్యాఖ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహం ఇస్తున్నారని ఆరోపించారు. ప్రజలు పాలన కోసం అవకాశం ఇస్తే దానిపై దృష్టి పెట్టకుండా తెలంగాణ సాధించిన నాయకుడిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదన్నారు. కేసీఆర్ హయాంలో సాగునీరు, ఉచిత విద్యుత్, రైతుబీమా, పింఛన్లు, దళితబంధు, మెడికల్ కళాశాలలు, గురుకులాల ఏర్పాటుతో రాష్ట్ర అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. కేసీఆర్‌పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మురళీధర్‌రావు, మేకల సమ్మయ్య, తాళ్ల రాజన్న, మారుతి, అచ్చ వేణు, నూతి తిరుపతి, మేడి సదానందం, ఈదునూరి శ్రీకాంత్, సకినాల ప్రతాప్, పోగుల వకుళ సురేష్, రామరాజు, కనకరాజు, బుర్రి వెంకన్న, సట్టు శ్రీనివాస్, అవునూరి వెంకటేష్, కుమార్‌నాయక్, గడ్డం పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# బహుభాషా సాహితీవేత్త కాళోజీ నారాయణరావు

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఐఏఎస్



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందు గా కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఐఏఎస్ ఆయనకు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణ రావు సేవలను కమిషనర్ స్మరించుకున్నారు. సాహిత్యం, పౌర హక్కులు, సామాజిక కార్యక్రమాలు, ప్రజా చైతన్యం కోసం కాళోజీ తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. అనేక ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని ప్రజల గళంగా, వారి హక్కుల కోసం దృఢంగా నిలిచారని కొనియాడారు. బహు భాషా సాహితీవేత్తగా కాళోజీ తెలుగు సాహిత్యా న్ని సుసంపన్నం చేయడంతో పాటు మరాఠీ, కన్న డ, హిందీ, ఉర్దూ భాషల్లోనూ రచనలు చేశారని తెలిపారు. తెలంగాణ భాష, సాహిత్యం, సాంస్కృ తిక వారసత్వానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, భవిష్యత్ తరాలకు స్ఫూర్తి నిస్తూనే ఉంటాయని అన్నారు.

## దళితబంధు నిధులపై ఆరోపణలు నిరూపించాలి

- రూ.50 కోట్ల నిధులు వెనక్కి తీసుకున్నారనడం అవాస్తవం
- నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమా? : వొడితల ప్రణవ్
- కౌశిక్‌రెడ్డి దుష్ప్రచారాన్ని దళిత సమాజం గమనిస్తోంది

**జమ్మికుంట, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** దళితబంధు లబ్ధిదారుల ఖాతాల్లో ఉన్న రూ.50 కోట్లను వెనక్కి తీసుకున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళ్లిన నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా వెనక్కి పోలేదని పేర్కొన్నారు. తన ఆరోపణలను నిరూపించలేకపోతే కౌశిక్‌రెడ్డి రాజీనామా చేసి దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో దళితులను ఓట్ల కోసం ఉపయోగించుకోవడం తప్ప వారి సంక్షేమంపై నిజమైన చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో దళితబంధు నిధులను పూర్తిస్థాయిలో ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. మొదటి నుంచీ బీఆర్ఎస్, కౌశిక్‌రెడ్డి దళిత సమాజానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దళితబంధు నిధుల విడుదల బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, త్వరలో లబ్ధిదారులకు నిధులు అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఔషధ ఎయిర్ కార్గో హబ్‌గా మరింత బలోపేతం



**శంషాబాద్, (జనంసాక్షి) :** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం , జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్ కార్గోలు హైదరాబాద్ జీవశాస్త్రాలు, ఔషధ రంగాన్ని ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించడంలో కీలకంగా నిలుస్తున్నాయని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సీఈఓ కధీర్ కధీరవన్ తెలిపారు. 2025–26లో జీఎచ్ఏసీ1.79 లక్షల మెట్రిక్ టన్నుల సరుకును నిర్వహించగా, ఎగుమతి సరుకులో 61 శాతం ఔషధ ఉత్పత్తులేనని పేర్కొన్నారు. 2°C–8°C, 15°C--25°C, -20°C వరకు ఉష్ణోగ్రత నియంత్రిత నిల్వ సదుపాయాలతో పాటు కార్గో టెర్మినల్–2 ద్వారా మరో 50 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. విమానం టెర్మినల్ మధ్య ఉష్ణోగ్రతను నిరంతరం కాపాడేందుకు ప్రత్యేక శీతలీకరణ కార్గో ట్రక్కును కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

# పాఠశాలల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

*వెంకటాపూర్-ఆరెంద రహదారి విస్తరణ వెంటనే ప్రారంభించాలి*

- ప్రతి విద్యార్థికి కనీస విద్యా నైపుణ్యాలు కల్పించాలి
- హాజరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష



**మంథని, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం మంథని మండలంలోని ఖాన్‌సాయిపేట, భట్టుపల్లి, వెంకటాపూర్, మల్లారం, స్వర్ణపల్లి ఎంపీపీఎస్, ఆరెంద జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, విద్యాబోధన, అభ్యసన స్థాయిపై అధికారులను, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంకటాపూర్–ఆరెంద సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు రహదారిపై ఉన్న గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఖాన్‌సాయిపేట పాఠశాలలో కాంపౌండ్ వాల్, పెయింటింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, వెంకటాపూర్ పాఠశాలలో మంజూరైన అదనపు తరగతి గది నిర్మాణాన్ని నెల రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై దృష్టి సారించి చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు సాధించేలా బోధన అందించాలని సూచించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో వారి అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని తెలిపారు. విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ, గైర్హాజరు కారణాలను తల్లిదండ్రులతో చర్చించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో నెలకోసారి తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతిపై చర్చించాలని సూచించారు. మౌలిక వసతులతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యటనలో ఎంపీడీవో శ్రీజారెడ్డి, ఎంపీవో షబ్బీర్‌పాషా, ఏఈ పీఆర్ జగదీశ్, సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత అందరిది

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధు వ్యాఖ్యల కలకలం
- కాంగ్రెస్ నిరసన, దిష్టిబొమ్మ దహనం.. పోలీసులకు ఫిర్యాదు



**బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 08 (జనం సాక్షి) :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం బోయిన్‌పల్లిలో ఆందోళన చేపట్టారు. స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. అనంతరం తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సువీన్ యాదవ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ విమర్శలకు చోటున్నప్పటికీ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధ పదవుల గౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడిన బీఆర్ఎస్ నేతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. రాజకీయాల్లో విభేదాలు ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు హుందాగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండ

- 26 మందికి రూ.12 లక్షల విలువైన చెక్కుల పంపిణీ
- ఇప్పటివరకు వెయ్యిమందికిపైగా లబ్ధిదారులకు సాయం
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపద్బాంధవంగా నిలుస్తోందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ముకరంపురలోని తన కార్యాలయంలో బుధవారం 26 మంది లబ్ధిదారులకు రూ.12 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వివిధ అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. 30 నెలల క్రితం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, ఇప్పటివరకు వెయ్యిమందికిపైగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించినట్లు పేర్కొన్నారు. బుధవారం పంపిణీ చేసిన చెక్కుల్లో ముప్పిడి స్వప్న, గట్టు కమల, ఎండీ కలీమొద్దీన్, పెనుకుల సాయికిరణ్, తాటికొండ రాజిరెడ్డి, చిప్ప శంకరమ్మ, షమీద్ బేగం, షేక్ షకీల్ అహ్మద్, పెరుక రాజేందర్, బి.కుమారస్వామి, చిప్ప రవీందర్ తదితరులు ఉన్నారు.

# చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే వ్యక్తి కాళోజీ నారాయణ రావు: జీఎంలు



**రామగుండం సెప్టెంబర్ 08 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రజల గుండెల్లో, చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే వ్యక్తి ప్రజాకవి, తెలంగాణ ఉద్యమకారుడు స్వర్గీయ శ్రీ కాళోజీ నారాయణరావు అని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్యనారాయణ అన్నారు. బుధవారం జిఎం కార్యాలయం నందు నిర్వహించిన స్వర్గీయ కాళోజీ నారాయణ రావు గారి 112వ జయంతి వేడుకలలో భాగంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమం ప్రతిధ్వనిగా కొనియాడబడతారని, రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారంగా కవిత్వం రాసిన ప్రజాకవిగా నిలిచారని తెలిపారు. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా అతను కలమెత్తాడని, స్వాతంత్ర్యసమరయోధుడని, 1992 సంవత్సరంలో భారతదేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్ పొందాడని, అతని జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించిందని, వారి పేరున ఆరోగ్య విశ్వవిద్యాలయం, కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటు చేసి తెలంగాణ సమాజం వారి సేవలను గౌరవించిందన్నారు. తెలంగాణ సాధనకు ఆయన చేసిన కృషి, దృఢ సంకల్పం రాష్ట్ర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు దుగ్యాల తిరుపతి రావు, రవికుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, విభాగధిపతులు బి.టి.మురళీ కృష్ణ, బి.సుదర్శనం, సి.జె.సురేఖ, రవికుమార్, కె.ఐలయ్య, అఫ్సర్ పాషా, ఆర్.రాజేశ్వరి, జి.ప్రశాంత్ జీవన్, తోపాటు వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్‌గా చిట్టుమల్ల రవీందర్ నియామకం

- చైర్మన్‌తో పాటు 12మంది సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ..
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన చైర్మన్ రవీందర్

**చిగురుమామిడి (జనంసాక్షి):** చిగురుమామిడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్‌విండో) నిర్వహణకు ప్రభుత్వం నూతన కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన చిట్టుమల్ల రవీందర్‌ను నియమించింది. ఆయనతోపాటు చాడ మహిపాల్‌రెడ్డి, పోటు మల్లారెడ్డి, పచ్చిమట్ల లక్ష్మి, కుతాటి తిరుపతి, శ్రీరామోజు రాజ్‌కుమార్, చింతపుల సాయన్న, కనగాండ్ల శ్రీనివాస్, చిట్యాల బాల్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్, బైజంకి భాగ్య, పిల్లి కొమురయ్య, బొమ్మగాని పరశురాములు సభ్యులుగా నియమితులయ్యారు. సహకార సంఘాల నిబంధనల ప్రకారం ప్రస్తుత కమిటీ స్థానంలో ఈ నూతన కమిటీ ఆరు నెలలపాటు లేదా తదుపరి ఎన్నికలు జరిగే వరకు కొనసాగనుంది. తక్షణమే బాధ్యతలు స్వీకరించి రైతులు, ప్రజలకు అవసరమైన సహకార సేవలను పారదర్శకంగా అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. నూతన కమిటీ నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చైర్మన్ రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అందె సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బదుకోలు దేవేందర్‌రెడ్డి, సాంబారి బాబు రవీందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలి ఇంచార్జ్ ఎపిఎ జిఎం

**రామగిరి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** కోల్‌ఇండియా స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల్లో సింగరేణి క్రీడాకారులు ప్రతిభ చాటాలని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ బండి సత్యనారాయణ అన్నారు. రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఆర్‌జీ-3, అడ్రియాల, భూపాలపల్లి ఏరియాల క్రీడాకారుల మధ్య ప్రాంతీయ స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. జీఎం బండి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా సింగరేణి సంస్థ ఏటా వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఉద్యోగులు నిత్యం సాధన చేస్తూ తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

కంపెనీ, కోల్‌ఇండియా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రీజియన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు దుగ్యాల తిరుపతిరావు, ఎన్.శ్రీనివాసరావు, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డీవైపీఎం ఎం.డి.ఆసిఫ్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్సా శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బుర్ర సదానందం, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించం

**రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాలి : రాజారత్నం**



యైటింక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): రాష్ట్ర శాసనసభ స్పీకర్, దళిత నేత గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలను దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుకూరి రాజారత్నం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగబద్ధమైన కీలక పదవిలో ఉన్న వ్యక్తిని వ్యక్తిగతంగా అవమానించడం శాసనసభ వ్యవస్థ, ప్రజాస్వామ్య సంప్రదాయాలు, రాజ్యాంగ విలువలను అవమానించడమేనని అన్నారు. రాజకీయ విభేదాలను విధానాలు, నిర్ణయాలపై వ్యక్తం చేయవచ్చని, వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ సంస్కారం కాదని పేర్కొన్నారు. దళిత సమాజానికి చెందిన వ్యక్తి రాజ్యాంగ పదవిలో ఉన్న సమయంలో అవమానకర వ్యాఖ్యలు చేయడం మరింత అభ్యంతరకరమన్నారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులందరిపైనా ఉందని తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాలు, ప్రజాస్వామిక శక్తులను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని రాజారత్నం హెచ్చరించారు.

# గంజాయి కేసులో ఐదుగురికి మూడేళ్ల జైలు

- ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా
- 7.820 కిలోల గంజాయి స్వాధీనం కేసులో తీర్పు
- నేరం రుజువు కావడంతో శిక్ష విధించిన కోర్టు
- గంజాయి, డ్రగ్స్‌పై కఠిన చర్యలు: సీపీ




**గోదావరిఖని, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** గంజాయి కొనుగోలు, విక్రయానికి సంబంధించిన కేసులో ఐదుగురు నిందితులకు పెద్దపల్లి జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.సునీత మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. నిందితుల్లో గోదావరిఖనికి చెందిన వీణవంక సాయితేజ, ఆరెల్లి సాయికుమార్, జనగామకు చెందిన రామటంకి భరత్, కరీంనగర్ భరత్‌నగర్‌కు చెందిన సింగిరెడ్డి దిలీప్‌రెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన కొత్తంగే దత్తు ఉన్నారు. 2020లో గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీబీఎస్పీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలో అప్పటి ఎస్ఐ పి.సతీష్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ఐదుగురిని తనిఖీ చేయగా 7.820 కిలోల గంజాయి లభించింది. గంజాయి కొనుగోలు చేస్తున్న సమయంలో నిందితులు పట్టుబడ్డారు.

ఎస్ఐ ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజకుమార్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు. నిందితులకు శిక్ష పడేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకన రవీందర్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో పోలీసులు చేసిన కృషిని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎ.ఇంద్రసేనారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ అరుగొండ సతీష్‌కుమార్, సీఎంఎస్ హెచ్‌సీ పి.కోటేశ్వరరావు చర్యలు చేపట్టారు. గంజాయి, డ్రగ్స్ విక్రయాలు, రవాణా, సరఫరాపై కఠిన చర్యలు తప్పవని సీపీ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, సమాచారం తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# తెలంగాణ అక్షరయోధుడు కాళోజీ


**కవిత్వంతో ప్రజాచైతన్యం తెచ్చిన మహనీయుడు.. మున్సిపల్ చైర్మన్ రాజు**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 9 (జనంసాక్షి) :** ప్రజాకవి,పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా బుధవారం వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజుపూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ మట్టిలోని ఆత్మగౌరవాన్ని, ప్రజా సమస్యలను తన కలం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన అక్షరయోధుడన్నారు. అన్యాయాన్ని ఎదిరిస్తేనే ప్రజాస్వామ్యానికి అర్థం అని నమ్మి, జీవితాంతం ప్రజాపక్షాన నిలబడి పోరాడిన మహోన్నత వ్యక్తి కాళోజీ అన్నారు. ఆయన రాసిన ప్రతీ కవిత, ప్రతీ మాట సామాన్య ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చాయని,తెలంగాణ భాష, సంస్కృతుల పరిరక్షణకు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు కాళోజీ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. సామాజిక రుగ్మతలపై సమరం చేస్తూ,అణచివేతకు గురైన వర్గాల గొంతుకగా నిలిచిన ప్రజాకవి కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఆయన భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడమే కాళోజీకి మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. సమాజంలో మార్పు కోసం కాళోజీ పడ్డ తపన భావితరాలకు ఎల్లప్పుడూ మార్గదర్శకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, కమిషనర్ లోకేష్,మున్సిపల్ కౌన్సిలర్లు తూం మధు,తోట రాజు,కొక్కుల బాలకిషన్,కొండ రాజశేఖర్,ఏనుగు జ్యోతి,కోఆప్షన్ సభ్యులు, అధికారులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

Happy Anniversary
# జనంసాక్షి 16వ వార్షికోత్సవం
ప్రత్యేక అనుబంధం
12
జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
10 సెప్టెంబర్ 2026


## కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల అభ్యర్థుల
# వయో పరిమితి పెంచండి
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ విన్నపం



హైదరాబాద్ (జనంసాక్షి) :కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల అభ్యర్థుల వయో పరిమితి పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ విన్నవించారు. అసెంబ్లీలో సీఎంను కలసి వినతి పత్రం అందించారు. కరోనా పరిస్థితుల నేపథ్యం, నోటిఫికేషన్లు ఆలస్యం కావడం వల్ల చాలా మంది నిరుద్యోగులు వయో పరిమితి మించిపోయి, అర్హత కోల్పోతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో కానిస్టేబుల్, ఎస్సై పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తు చేసుకోవ డానికి ప్రస్తుతం అమల్లో ఉన్న గరిష్ఠ వయోపరిమితిని,కానిస్టేబుల్ ఉద్యోగానికి వయో పరిమితి 34 ఏండ్ల నుంచి 36 ఏండ్ల వరకు, ఎస్సై ఉద్యోగానికి వయో పరిమితి 37 ఏండ్ల నుంచి 38 ఏండ్ల వరకు వయో పరిమితి పెంచాలని కోరారు. నిరుద్యోగుల అభ్యర్థన పై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటా మని చెప్పారని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ తెలిపారు.

# ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతిక సమస్య

- ప్రపంచ వ్యాప్తంగా వెయ్యికిపైగా విమానాలు రద్దు!
- భారత్ విమానయాన సంస్థలపైనా తీవ్ర ప్రభావం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) : బ్రిటన్‌లో మంగళవారం విమాన ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా దేశవ్యాప్తంగా విమాన రాకపోకలకు భారీ అంతరాయం ఏర్పడింది. 1,000కుపైగా విమానాలు రద్దు కాగా, మరెన్నో విమానాలు గంటల తరబడి ఆలస్యమయ్యాయి. దీని ప్రభావం భారత్ విమానయాన సంస్థలపై కూడా పడింది. విమాన ట్రాకింగ్ సంస్థ ఫ్లైట్‌రాడార్24 ప్రకారం, ఈ అంతరాయం ప్రభావం బ్రిటన్‌లోని 15 విమానాశ్రయాలకు వ్యాపించింది. విమానాశ్రయాల టెర్మినల్స్‌తో పాటు రన్‌వేలపైనా ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అయితే బ్రిటన్ నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ (ఎన్ఏటీఎస్) తన ఫ్లైట్ ప్రాసెసింగ్ వ్యవస్థలో తలెత్తిన సమస్యను సాయంత్రానికి పరిష్కరించినట్లు తెలిపింది. కానీ అప్పటికే భారీ సంఖ్యలో విమానాలు ఆలస్యమవడంతో దాని ప్రభావం చాలా గంటల పాటు కొనసాగింది. విమానాలు, సిబ్బంది తమ షెడ్యూల్ స్థానాల్లో లేకపోవడంతో సేవలను సాధారణ స్థితికి తీసుకురావడం విమానయాన సంస్థలకు సవాలుగా మారింది. లండన్‌లోని హీత్రో విమానాశ్రయంలో విమానాల బయలుదేరే సేవలు తిరిగి ప్రారంభమైనప్పటికీ, రాత్రంతా వచ్చే విమానాలను నిలిపివేశారు. ప్రయాణికులు తమ విమానాల పరిస్థితిని సంబంధిత ఎయిర్‌లైన్స్ ద్వారా తెలుసుకోవాలని విమానాశ్రయ అధికారులు సూచించారు. ఈ సాంకేతిక సమస్య కారణంగా బ్రిటిష్ ఎయిర్ వేస్ 100కుపైగా విమానాలను రద్దు లేదా దారి మళ్లించినట్లు తెలిపింది. విమానాలు, సిబ్బంది వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోవడంతో పరిస్థితి చక్కదిద్దేందుకు సమయం పడుతుందని సంస్థ వెల్లడించింది. బడ్జెట్ ఎయిర్‌లైన్ ర్యానైర్‌పై కూడా ఈ అంతరాయం తీవ్ర ప్రభావం చూపింది. 65 వేల మందికిపైగా ప్రయాణికులు ప్రభావితమైనట్లు సంస్థ పేర్కొంది. 50కుపైగా షెడ్యూల్ విమానాలను రద్దు చేసినట్లు తెలిపింది. ఈజీజెట్ కూడా కొన్ని విమానాలు పూర్తిగా నడపలేకపోయామని తెలిపింది. వ్యవస్థ వైఫల్యం కారణంగా యూరప్ వ్యాప్తంగా తమ విమాన సేవల్లో జాప్యం ఏర్పడిందని వెల్లడించింది. ఈ సాంకేతిక సమస్య ప్రభావం భారత విమానయాన సంస్థలపైనా కూడా పడింది. ముంబయి నుంచి లండన్ వెళ్తున్న ఎయిరిండియా విమానాన్ని స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌కు మళ్లించినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది. విమానంలో 290 మంది ప్రయాణికులు ఉన్నారని, హీత్రూ విమానాశ్రయంలో సాంకేతిక సమస్యను పరిష్కరించే వరకు వారంతా విమానంలోనే ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఇక యూకేకు రాకపోకలు సాగించే తమ విమాన సర్వీసుల్లో అంతరాయం కలిగిందని ఎయిర్ ఇండియా సహా పలు దేశీయ విమానయాన సంస్థలు తెలిపాయి. మంగళవారం పలు విమానాలను రద్దు చేశారు. మరికొన్ని ఆలస్యమయ్యాయని ఎయిర్ ఇండియా వెల్లడించింది. ఈ అంతరాయం బుధవారం కూడా కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ప్రయాణికులు తాము ఎక్కాల్సిన విమాన సమయాలను బయల్దేరే ముందు చెక్ చేసుకోవాలని సూచించింది.

# ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

- ఒకరి చావును కోరడం సమర్థనీయం కాదు
- కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ



హైదరాబాద్, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు.




# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..
- తెలంగాణలో అధికారంలోకి వస్తాం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) : తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.







# 13 రకాల విత్‌డ్రాలకు
# 3 కేటగిరీలు

- పీఎఫ్ అడ్వాన్స్ రూల్స్‌లో కీలక మార్పులు
- 75 శాతం బ్యాలెన్స్ విత్‌డ్రాకు అనుమతి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 (జనంసాక్షి) : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ ఖాతా నుంచి నిధుల పాక్షిక ఉపసంహరణ (అడ్వాన్స్) నిబంధనలను సంస్థ గణనీయంగా సరళీకరించింది. గతంలో అమల్లో ఉన్న 13 రకాల సంక్లిష్ట ఉపసంహరణ పద్ధతులను రద్దు చేసి, వాటి స్థానంలో కేవలం మూడు సులభతర విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నూతన నిబంధనల ప్రకారం, ఈపీఎఫ్‌లో సభ్యత్వం పొంది 12 నెలలు పూర్తి చేసుకున్న చందాదారులు తమ ఖాతాలోని నిల్వలో 75 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. అయితే, ఖాతాలో కనీసం 25 శాతం నిల్వను తప్పనిసరిగా కొనసాగించాల్సి ఉంటుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ గతంలోనే ఆమోదం తెలిపింది. తాజా సవరణల ప్రకారం, ఉపసంహరణ ప్రక్రియను మూడు ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు. అనారోగ్యం లేదా వైద్య చికిత్స నిమిత్తం సర్వీసు కాలంలో ఎన్నిసార్లయినా నిధులు తీసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే, చదువుల కోసం 10 సార్లు, వివాహ అవసరాల కోసం 5 సార్లు ఉపసంహరణకు అనుమతి ఇచ్చారు. ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణాల చెల్లింపు లేదా ఇంటి మరమ్మతుల కోసం సర్వీసు మొత్తంలో ఐదుసార్లు అడ్వాన్స్ పొందే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు, సంస్థ మూసివేత, ఉద్యోగం కోల్పోవడం లేదా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు నిధులు ఉపసంహరించుకునే వెసులుబాటు కల్పించారు.













Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370